అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

సోమవారం 30-1-2023 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 8 | సంచిక : 345 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | www.navatelangana.com | 10 పేజీలు | వెల : 6.50



పాత పెన్షన్ స్కీమ్‌ను అమలుచేయాలని ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో ప్రభుత్వ ఉద్యోగుల భారీ ర్యాలీ

కేంద్రాన్ని ఎండగట్టండి

రాష్ట్రపతి ప్రసంగాన్ని బహిష్కరించండి

- ప్రజా వ్యతిరేక విధానాలపై నిలదీయండి
- దేశ ప్రజల గొంతు వినిపించండి
- విపక్షాలను కలుపుకెళ్లండి
- పార్లమెంటులో అనుసరించాల్సిన వ్యూహంపై ఎంపీలకు సీఎం కేసీఆర్ దిశానిర్దేశం



కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను పార్లమెంటరీ బడ్జెట్ సమావేశాల్లో ఎండగట్టాలని బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు పార్టీ ఎంపీలకు దిశా నిర్దేశం చేశారు. పార్లమెంటులో వ్యూహాత్మకంగా వ్యవహరించాలని చెప్పారు. రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధంగా కేంద్రం వ్యవహరిస్తున్నదనీ, ప్రతి బడ్జెట్‌లోనూ వివక్ష ప్రదర్శిస్తూ, ఆర్థిక అంశాలపై ఆంక్షలు విధించడం, రైతుల విషయంలో వివక్ష చూపడం వంటి చర్యలకు పాల్పడుతున్నారనీ, వీటన్నింటినీ దష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వానికి నిరసన తెలిపేందుకు ఉభయసభల్లో రాష్ట్రపతి ప్రసంగాన్ని బహిష్కరించాలని దిశానిర్దేశం చేశారు. రాష్ట్రానికి రావాల్సిన విభజన హామీలు, ప్రాజెక్టులు, ఆర్థిక పరమైన అంశాలపై రాజీలేని పోరాటం చేస్తూ, జాతీయ అంశాలపై కూడా స్పష్టమైన వైఖరితో వ్యవహరించాలని చెప్పారు. ప్రజా సమస్యలపై గొంతుని వినిపిస్తూ కేంద్రం చేస్తున్న తప్పులను దేశం దష్టికి తీసుకురావాలన్నారు. పార్లమెంటరీ ప్రజాస్వామిక పంథాలో అన్ని మార్గాలను అనుసరించాలనీ, ఆ దిశగా బీఆర్ఎస్‌తో కలిసివచ్చే అన్ని పార్టీలను కలుపుకుని వెళ్లాలని చెప్పారు.

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఆదివారం ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్ అధ్యక్షతన బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ సమావేశం జరిగింది. నాలుగు గంటలకు పైగా సాగిన సమావేశంలో అనేక అంశాలను చర్చించారు. పార్లమెంటరీ పార్టీ నేతలు కె.కేశవరావు (రాజ్యసభ), నామా నాగేశ్వర్‌రావు (లోక్‌సభ), ఎంపీలు జోగినపల్లి సంతోష్‌కుమార్, కె.ఆర్. సురేష్‌రెడ్డి, బడుగుల లింగయ్యయాదవ్, వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థసారథి, దీవకొండ దామోదర్ రావు, కొత్త ప్రభాకర్ రెడ్డి, బీబీ పాటిల్, మన్నె శ్రీనివాస్ రెడ్డి, మాలోత్ కవితా నాయక్, పసునూరి దయాకర్, బొర్లకుంట వెంకటేష్, పోతుగంటి రాములు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలు దేశ సమగ్రతకు, అభివద్ధికి ఆటంకాలుగా మారాయని చెప్పారు. దేశ ప్రజలు తమ కష్టార్జితంతో కూడబెట్టుకుంటున్న సంపదనంతా తమ కార్పొరేట్ స్నేహితులకు కట్టబెడుతున్నారని విమర్శించారు. "తమకు అనుకూల కార్పొరేట్ శక్తుల పట్ల కేంద్ర ప్రభుత్వం ప్రేమ కురిపిస్తూ లక్షల కోట్ల రుణాలను రద్దు చేస్తున్నది. ఎల్ఐసీ వంటి ప్రభుత్వ రంగ సంస్థల్లో అదానీ వంటి బడా వ్యాపారవేత్తలకు వాటాలను అప్పనంగా కట్టబెడుతున్నది. వారి కంపెనీల డొల్లతనం బైటపడుతూ షేర్ల విలువ హఠాత్తుగా పడిపోతుంటే, లక్షల కోట్ల రూపాయలు ఒక్క రోజులోనే నష్టపోతున్న వాస్తవాన్ని దేశం గమనిస్తున్నది" అని చెప్పారు. ఆర్థిక అవకతవకలకు దోహదం చేసే విధంగా దేశ సంపదనంతా ప్రయివేటు పరం చేస్తూ ప్రజలకు తీరని నష్టం చేస్తున్నారని అన్నారు. లాభాలను ప్రయివేటుకు కట్టబెడ్తూ, నష్టాలను దేశ ప్రజల మీద రుద్దుతున్నారనీ, ఇలాంటి ప్రమాదకర ఆర్థిక విధానాలపై పార్లమెంటు ఉభయ సభల్లో బీఆర్ఎస్ ఎంపీలు గొంతెత్తి, ప్రభుత్వాన్ని నిలదీయాలని దిశానిర్దేశం చేశారు. ఫెడరల్ స్ఫూర్తికి తూట్లు పొడుస్తూ రాష్ట్రాలను అనేక రకాలుగా ఇబ్బందులకు గురిచేస్తున్న విషయాలనూ ప్రస్తావించాలన్నారు. రాష్ట్రానికి జరుగుతున్న ఆర్థిక ఆటంకాలనూ కేంద్రానికి గుర్తుచేయాలనీ, సమాధానాలు రాబట్టే ప్రయత్నం చేయాలని తెలిపారు. గవర్నర్ల వ్యవస్థను దుర్వినియోగం చేస్తున్నారనీ, అప్రజాస్వామికంగా రాష్ట్రాలను నిర్వీర్యపరిచే చర్యలకు పాల్పడుతున్నారనీ చెప్పారు. రాజ్యాంగబద్ధమైన విధులు నిర్వర్తిస్తూ, కేంద్ర రాష్ట్రాల నడుమ సంధాన కర్తలుగా వుండాల్సిన గవర్నర్ల వ్యవస్థను తమ రాజకీయ స్వార్థ ప్రయోజనాల కోసం వాడుకుంటున్న తీరును ఉభయ సభల్లో తీవ్రంగా వ్యతిరేకించాలని స్పష్టం చేశారు. రాష్ట్ర కేబినెట్ సహా, శాసనసభ, శాసనమండలి తీసుకున్న నిర్ణయాలను సైతం ఉద్దేశపూర్వకంగా గవర్నర్లు పెండింగులో పెడుతున్నారని తెలిపారు. వీరి వైఖరిని పార్లమెంటు సాక్షిగా ఎండగట్టాలని సూచించారు. దేశ భవిష్యత్తు కోసం పార్లమెంటులో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మీద పోరాటానికి కలిసివచ్చే పార్టీల ఎంపీలను కలుపుకుని పోవాలన్నారు. పెరిగిన పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ నిత్యావసర వస్తువుల ధరలు, భారమవుతున్న సామాన్యుల బతుకులను పార్లమెంటులో ప్రస్తావించాలన్నారు. నిరుద్యోగం, ఉపాధి, ప్రయివేటీకరణ అంశాలతో పాటు విభజన హామీలపై కూడా కేంద్రాన్ని నిలదీయాలని చెప్పారు. ఆ దిశగానే బీఆర్ఎస్ ఎంపీలు పార్లమెంటులో తమ గొంతును వినిపించాలని స్పష్టంచేశారు.

అక్రమ బదిలీలలు!

పేరుకే పారదర్శకత.. పైరవీలకే పెద్దపీట

- ఉపాధ్యాయ బదిలీలపై నిరసనల వెల్లువ
- నేటితో ముగియనున్న 'ఆన్‌లైన్' ప్రక్రియ



నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

ఉపాధ్యాయుల అక్రమబదిలీలపై నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. బదిలీల్లో పారదర్శకత లోపించిందని.. పైరవీలకు పెద్దపీట వేస్తున్నారని ఉపాధ్యాయ సంఘాలు నిరసనలు వ్యక్తం చేస్తున్నాయి. సుమారు ఏడున్నర ఏండ్ల తర్వాత టీచర్ల బదిలీలు, ప్రమోషన్లకు అవకాశం కల్పించిన ప్రభుత్వం అవినీతికి ఆస్కారం లేకుండా బదిలీలు నిర్వహిస్తామని చెప్పి దానికి భిన్నంగా పైరవీలకు చోటిస్తోందని ఆందోళన వెలుబుచ్చుతున్నారు. సచివాలయం నుంచి పైరవీలు చేయించుకుని మరీ దొడ్డిదారిలో అనర్హులు అడిగిన చోటకు బదిలీలు చేయటంపై ఉపాధ్యాయసంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీఎస్సీ) ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహిస్తోంది. నేటితో ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ ముగుస్తున్న నేపథ్యంలో పోరాట కమిటీ ఆందోళనలు తీవ్రతరం చేసేందుకు సమాయత్తమవుతోంది.

బదిలీల స్ఫూర్తికి విరుద్ధంగా...

ఖమ్మం జిల్లాలో 4,712 మంది టీచర్లకు గాను ఖమ్మం జిల్లాలో 1,114 మందిని, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 1,563 మందిని బదిలీకి అర్హులుగా గుర్తించారు. వీరిలో 1,060 మంది ఎనిమిదేండ్లు పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులు, ఐదేండ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ప్రధానోపాధ్యాయులు ఉన్నారు. స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీలు, కేటగిరీల ఆధారంగా డీఈవో స్థాయిలో బదిలీలు ఉంటాయి. ప్రధానోపాధ్యాయులకు మల్టీ జోన్‌స్థాయిలో ఆర్‌జేసీ బదిలీలు చేపడుతారు. అయితే ఈ అర్హుల, అనర్హుల ఎంపికలో పారదర్శకత లోపించిందని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి. కొత్తగా ఉపాధ్యాయులు ఆన్‌లైన్ దరఖాస్తు పెట్టుకుంటే సర్వీస్ పాయింట్లు వస్తాయి. పనిచేసే స్కూల్‌ను బట్టి 17% హెచ్‌ఆర్‌ఏ లభిస్తుంది. జిల్లా కేంద్రానికి సమీపంలోని స్కూల్స్ అయితే ఒక పాయింట్ చొప్పున ఇస్తారు. దూరంగానైతే కేటగిరీ-3 కింద పరిగణించి సంవత్సరానికి మూడు పాయింట్ల చొప్పున కేటాయిస్తారు. సీనియార్టీ ఆధారంగా సంవత్సరానికి ఒక పాయింట్, భార్యభర్తలు ఇద్దరూ ప్రభుత్వ ఉద్యోగులైతే 8 ఏండ్లకోసారి పదిపాయింట్లు అదనంగా ఇస్తారు. పెళ్లికాని మహిళలు, వితంతువులు, ఒంటరి మహిళలకు అదనంగా పది పాయింట్లు లభిస్తాయి. ఇక ఓపెన్‌హార్ట్ సర్జరీ, క్యాన్సర్, లివర్, మూత్ర సంబంధిత వ్యాధులు డయాలసిస్ ప్రాబ్లమ్స్‌తో ఇబ్బంది పడేవారు, పిల్లలు మానసిక వ్యాధిగ్రస్తులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారైతే సంబంధిత టీచర్లకు బదిలీల్లో ప్రాధాన్యం ఉంటుంది. కానీ బదిలీల్లో ఇవేవీ పరిగణలోకి తీసుకోకుండా అనర్హులను కూడా ఎంపిక చేయడం విమర్శలకు తావిస్తోంది.

పాయింట్ల కేటాయింపు ఎలా..?

పట్టణాలు, పల్లెలు, దూరం ఆధారంగా మూడు కేటగిరీలుగా విభజించాలి. ఖమ్మం ...9లో

బీబీసీ డాక్యుమెంటరీ చూశారని...

రాజస్తాన్‌లో 14 మంది విద్యార్థుల సస్పెన్షన్

- ఏబీవీపీ ఒత్తిడితో సెంట్రల్ వర్సిటీ చర్యలు



జైపూర్ : ప్రధాని మోడీపై బీబీసీ రూపొందించిన డాక్యుమెంటరీని వీక్షించిన 11 మంది విద్యార్థులపై రాజస్తాన్ సెంట్రల్ యూనివర్సిటీ వేటు వేసింది. బీజేపీకి చెందిన విద్యార్థి విభాగం ఏబీవీపీ 24 మంది విద్యార్థుల జాబితాను విడుదలచేసి.. వారిపై చర్యలు తీసుకోవాలని యూనివర్సిటీని డిమాండ్ చేసినట్టు తెలుస్తున్నది. దీంతో శుక్రవారం నుంచి 14 రోజుల పాటు విద్యార్థులను యూనివర్సిటీ, హాస్టల్ నుంచి సస్పెండ్ చేసింది. ఏబీవీపీ విద్యార్థుల ఒత్తిడితోనే యాజమాన్యం వేటువేసినట్టు పీజీ విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏబీవీపీ కార్యకర్తలు క్యాంపస్‌లో గురువారం ఉద్రిక్తతలను సృష్టించారని, జైశ్రీరామ్, దేశ ఉగ్రవాదులను కాల్చి పారేయండి అని నినాదాలు చేశారని పీజీ విద్యార్థులు తెలిపారు. విద్యార్థులు తమ మొబైల్ ఫోన్‌లలోనే ఆ వీడియోను వీక్షించారనీ.. ఎక్కడా ప్రదర్శించలేదని చెప్పారు. సస్పెన్షన్‌కు గురైన విద్యార్థుల హాస్టల్ గదుల్లోకి బలవంతంగా ప్రవేశించి విద్యార్థులను బెదిరించారని తెలిపారు.

ఎన్నికల బడ్జెటేనా..?

క్యాబినెట్ భేటీలో మంతనాలు



న్యూఢిల్లీ : పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కేంద్ర మంత్రులతో ఆదివారం కీలక భేటీ నిర్వహించారు. ముఖ్యంగా వివిధ రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలున్న నేపథ్యంలో కీలక శాఖలకు సంబంధించిన కేటాయింపులు, బడ్జెట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. ఈ నెల 31న పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు జరగనున్న సంగతి తెలిసిందే. కేంద్ర బడ్జెట్ 2023-24ను ఫిబ్రవరి 1న పార్లమెంటులో ప్రవేశపెట్టనున్నారు. 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందుకు మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టే పూర్తిస్థాయి బడ్జెట్ కూడా ఇదే.

పునర్వ్యవస్థీకరణపైనా చర్చ !

కేంద్ర మంత్రివర్గంలో భారీ మార్పులకు కసరత్తు జరుగుతోందన్న కథనాల నేపథ్యంలో మోడీ కేంద్ర మంత్రులతో సమావేశమవ్వడం అనేక చర్చలకు తెర లేపింది. కీలక రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఆయా రాష్ట్రాల నేతలకు ...9లో

నోరు తెరవద్దు.. కాలు కదపద్దు

బాండ్ పేపర్‌పై సంతకం చేయండి

- సోనమ్ వాంగ్‌చుక్‌కు లడఖ్ యంత్రాంగం హుకుం
- సంతకం చేయనన్న రామన్ మెగసెసే అవార్డు గ్రహీత వాంగ్‌చుక్



శ్రీనగర్ : కేంద్రపాలిత ప్రాంతం లడఖ్‌ను ఆరో షెడ్యూల్‌లో చేర్చాలనే, పర్వతాలను పరిరక్షించాలనే డిమాండ్‌తో ఐదు రోజుల నిరాహార దీక్షను చేస్తున్న సామాజికవేత్త, విద్యా సంస్కర్త, రామన్ మెగసెసే అవార్డు గ్రహీత సోనమ్ వాంగ్‌చుక్‌ను నియంత్రించడానికి అక్కడి యంత్రాంగం ప్రయత్నిస్తున్నది. ఇందులో భాగంగా ఆయనతో బాండ్ పేపర్‌పై సంతకం చేయించాలని చూసింది. గత నెల రోజులుగా లేహ్ లో జరుగుతున్న పరిణామాలపై ఎలాంటి ప్రకటనలూ చేయననీ, బహిరంగ సమావేశాల్లో పాల్గొననని హామీనిస్తూ బాండ్ పేపర్‌పై సంతకం చేయాల్సిందిగా యంత్రాంగం ఆయనకు తెలిపింది. ఈనెల 26 నుంచి వాంగ్‌చుక్ లేహ్‌లోని ఫియాంగ్‌లో 'పర్యావరణ దీక్ష' లో ఉన్నారు. అక్కడ మైనస్ 20 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు ఉన్నాయి. అయితే, ఈ తరుణంలో లడఖ్ కేంద్రపాలిత యంత్రాంగం పైన తెలిపిన విధంగా ...9లో

గాంధీజీ హత్య వెనుక కుట్ర

వ్యక్తి చేసిన అఘాయిత్యంగా ప్రచారం

- తెరవెనుక సావర్కర్, ఆర్ఎస్ఎస్...
- 'గాంధీజీ హంతకుడు' పుస్తకావిష్కరణలో వక్తలు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

మహాత్మాగాంధీ హత్యకు సంబంధించిన సమాచారం పాక్షికంగానే జనబాహుళ్య ప్రచారంలో ఉన్నదనీ, దాని వెనుక అతిపెద్ద సైద్ధాంతిక ఘర్షణ, కుట్ర ఉన్నాయని ప్రముఖ రచయిత ధీరేంద్ర కే ఝూ అన్నారు. ఈ కుట్రకోణాన్ని సాక్ష్యాధారాలతో ప్రజల ముందు ఉంచే ప్రయత్నం తాను చేసినట్టు చెప్పారు. నవతెలంగాణ పబ్లిషింగ్ హౌస్ ...9లో

పాకిస్తాన్‌లో బస్సు ప్రమాదం

41 మంది మృతి



ఇస్లామాబాద్ : పాకిస్తాన్‌లో ఆదివారం ఉదయం ఘోర బస్సు ప్రమాదం జరిగింది. బలూచిస్తాన్ ప్రాంతంలోని లాస్‌బెలాలో జరిగిన ఈ ప్రమాదంలో 41 మంది మరణించగా, పలువురికి గాయాలైనట్టు అధికారులు తెలిపారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశముందన్నారు. 48 మంది ప్రయాణికులున్న ఈ బస్సు క్వెట్టా నుంచి కరాచీ వెళ్తోంది. బస్సు అదుపుతప్పి బ్రిడ్జి పిల్లర్‌ను ఢీ కొట్టిందని బలూచిస్తాన్ ప్రావిన్స్‌కు చెందిన సీనియర్ అధికారి హంజా అంజుమ్ తెలిపారు. ఆ వెంటనే కాలువలోకి దూసుకువెళ్లిందనీ, దీంతో ...9లో

కేంద్ర బడ్జెట్‌లో జనం సమస్యలు ఉంటాయా?

ఏ చిన్న ప్లాస్టిక్ వస్తువు కొన్నా..దానిపై వేరే దేశం భాష కనపడుతోంది. భారత్‌లో అమ్ముతోన్న ఆట బొమ్మలు, దుస్తులు, కంప్యూటర్ పరికరాలు, మొబైల్ ఫోన్లు, కార్లు..అనేక ఉత్పత్తుల వెనుకున్నది విదేశీ సంస్థలే. దేశీయ బడా కార్పొరేట్లు ఈ సంస్థల్ని నిర్వహిస్తున్నాయి. వీటికి మన బ్యాంకులు వేల కోట్లు రుణాలు ఇస్తాయి. ఇదీ మోడీ సర్కార్ ఆర్థిక విధానం. మొబైల్ ఫోన్ల తయారీలో అత్యధిక భాగం విదేశాల్లోనే నిర్వహిస్తారు. అసెంబ్లింగ్ భారత్‌లో. ఇది 'మేక్ ఇన్ ఇండియా' లెక్క. ఈ పరిస్థితికి కారణం కేంద్రంలో మోడీ సర్కార్. ప్రయివేటు రంగానికి, బడా కార్పొరేట్లకు ప్రభుత్వ పెట్టుబడుల్ని ఉపయోగిస్తోంది. సరైన ఉపాధి లేక, అధిక ధరలతో, నిరుద్యోగంతో బాధపడటం సామాన్యుడి వంతు అయ్యింది.

'ప్రయివేటు'ను నమ్ముకుంటే నిరుద్యోగం తగ్గదు : ఆర్థిక నిపుణులు

- కోవిడ్ పరిస్థితులు పోయినా..ఉద్యోగుల వేతనాల్లో కోతలు
- అధిక ధరలు, నిరుద్యోగం, ఉపాధి.. సమస్యలకు ప్రభుత్వ పెట్టుబడితో చెక్ పెట్టొచ్చు..



న్యూఢిల్లీ : నిరుద్యోగం, అధిక ధరలు, వేతనాల్లో కోతలు...ఇవి నేడు దేశం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు. ఈ సమస్యలు తీవ్రరూపం దాల్చడానికి ప్రధాన కారణం మోడీ సర్కార్ అనుసరిస్తున్న ఆర్థిక విధానాలు. దీంట్లో మార్పు ఉంటుందా? లేదా? అన్నది కేంద్ర బడ్జెట్ బయటపెడుతుంది. ఒకవేళ మార్పుకుంటే సామాన్యుడికి కొంత ఊరట. లేదంటే సగటు పౌరుడి సమస్యలు తీవ్ర రూపం దాల్చుతాయి. బుధవారం కేంద్ర బడ్జెట్‌ను కేంద్రం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నది. నేడు దేశం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలన్నీ 'ద్రవ్య విధానం'తో ముడిపడినవే. ఉపాధి రంగాన్ని మెరుగుపర్చాలన్నా, అధిక ధరల్ని నియంత్రించాలన్నా, వేతనాల్లో కోతల్ని అడ్డుకోవాలన్నా...కేంద్ర బడ్జెటే ప్రధాన ఆయుధం. మోడీ సర్కార్ ఇకనైనా 'ప్రయివేటు' అనుకూల విధానాలు వీడితేనే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు.

ఉదాహరణకు నిరుద్యోగ సమస్య ...9లో

నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదును పెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, ఆజామాబాద్, ఆర్టీసీ కళ్యాణమండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.

నేటితో ముగియనున్న జోడోయాత్ర..

న్యూఢిల్లీ : కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ భారత్ జోడోయాత్ర సోమవారంతో ముగింపు దశకు చేరుకుంటుంది. ఈ సందర్భంగా జనవరి 30న శ్రీనగర్‌లో నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమానికి 12 ప్రతిపక్ష పార్టీలు హాజరుకానున్నట్టు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమానికి 21 పార్టీలను ఆహ్వానించామని, అయితే భద్రతాకారణాల రీత్యా కొందరు హాజరుకావడం లేదని ఆ వర్గాలు వెల్లడించాయి. సీపీఐ(ఎం), సీపీఐలతో పాటు డీఎంకే, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ, ఆర్‌జేడీ, జేడీయూ, శివసేన, వీసీకే, కేరళ కాంగ్రెస్, ఫరూక్ అబ్దుల్లా నేతృత్వంలోని జమ్ముకాశ్మీర్ నేషనల్ కాన్ఫరెన్స్ పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ (పీడీపీ), షిబు సోరెన్ నేతృత్వంలోని జార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) శ్రీనగర్‌లో జరిగే కార్యక్రమానికి హాజరవుతారు. టీఎంసీ, సమాజ్‌వాది పార్టీ, టీడీపీ పార్టీలు ఈ కార్యక్రమానికి దూరంగాఉన్నాయి. భద్రతా వైఫల్యంతో శుక్రవారం రద్దైన యాత్ర శనివారం అవంతిపొరాలోని చెర్సూగ్రామం నుంచి ప్రారంభమైన ఈ యాత్రలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా, పీడీపీ అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీలు పాల్గొన్నారు. గతేడాది సెప్టెంబర్ 7న కన్యాకుమారి నుండి జోడోయాత్ర ప్రారంభమైన సంగతి తెలిసిందే. సుమారు 145 రోజుల్లో 3,970 కి.మీ, 12 రాష్ట్రాలు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఈ యాత్ర సాగింది. తెలంగాణ నుంచి రేవంత్‌రెడ్డి, సీతక్క, శామల కిరణ్‌రెడ్డి, ఎంఎల్ఏలు, ఎంపీలు శ్రీనగర్ చేరుకున్నారు. రాహుల్‌గాంధీతో భేటీ అయ్యారు.

గుండెకు శక్తినిచ్చే కార్డియాక్ రిహాబ్

- గుండెపోటుకు గురైన వారికీ ఉపయోగం
- డాక్టర్ మురళీధర్ బాబీ
- మారథాన్‌లో పాల్గొన్న 20 మంది గుండె రోగులు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కార్డియాక్ రిహాబ్ గుండెకు తగిన బలాన్నిస్తుందనీ, గుండెపోటుకు గురైన వారికి ఉపయోగకరంగా ఉందని స్వచ్ఛంద సేవా సంస్థ కార్డియాక్ రిహాబ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ఈఎస్ఐసీ మెడికల్ కాలేజీ హాస్పిటల్ అసిస్టెంట్ ప్రొఫెసర్, కార్డియాక్ రిహాబ్ స్పెషలిస్ట్ డాక్టర్ మురళీధర్ బాబీ తెలిపారు. ఆదివారం ఇనార్బిట్ మాల్ ఆధ్వర్యంలో హైదరాబాద్ దుర్గం చెరువు వద్ద నిర్వహించిన రన్‌లో 20 మంది గుండె సంబంధిత రోగులు పాల్గొన్నారు. గతంలో గుండె జబ్బులు, శస్త్రచికిత్సలు జరిగాయంటే పడకకు, ఇంటికి పరిమితమయ్యేవారు. బరువైన పనులు, పరుగులు పెట్టేందుకు ఇబ్బందులు పడే వారు. కానీ కార్డియాక్ రిహాబ్ అందుబాటులోకి వచ్చాక ఆ పరిస్థితి మారింది. ఇప్పుడు వారు వరుసగా మారథాన్‌లలో పాల్గొంటున్నారు. కార్డియాక్ రిహాబ్ రన్నర్లలో ఇప్పటికే హార్ట్ అటాక్ గురై కోలుకున్న వారు, యాంజియోప్లాస్టీ అయినవారు, బైపాస్, మైనర్ బ్లాక్‌లతో పాటు డయాలెటెడ్ కార్డియోమైయోపతీ (డీసీఎం), పల్మనరీ ఆర్టియల్ హైపర్ టెన్షన్ (పీఏహెచ్) రోగులుండడం గమనార్హం. వీరంతా మూడు నుంచి ఆరు నెలలపాటు గుండె వ్యాయామాలు చేసి దాని పంపింగ్ సామర్థ్యాన్ని పెంచుకుని కుటుంబంలో అందరి కన్నా ఫిట్నెస్‌గా మారి మారథాన్ లలో పాల్గొంటుండటం విశేషం. ఈ సందర్భంగా డాక్టర్ మురళీధర్ బాబీ మాట్లాడుతూ కార్డియాక్ రిహాబ్ తో బహుళ ప్రయోజనాలున్నాయని తెలిపారు.



డయాబెటీస్ వచ్చే రిస్క్ ఫ్యాక్టర్ తగ్గిపోతుందనీ, హై బ్లడ్ ప్రెషర్ వారికి హార్ట్ అటాక్ వచ్చే ప్రమాదం తగ్గుతుందనీ, ఆత్మస్థైర్యం పెరిగి మెరుగైన జీవితం లభిస్తుందని తెలిపారు. రిహాబ్‌లో వ్యాయామాలు చేసిన తర్వాత అయిన మూడు నెలల తర్వాత రిహాబ్ అయిన మూడు నెలల తర్వాత వీరిలో షుగర్, బీపీ తగ్గిపోవడం, స్మోకింగ్, డ్రింకింగ్ అలవాట్ల నుంచి బయటికి రావడమే కాకుండా శారీరకంగా చాలా ఫిట్‌గా అవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఏయస్ అధికారి జయేష్‌రంజన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ఆన్‌లైన్ మూల్యాంకనాన్ని స్వాగతిస్తున్నాం

- తెలంగాణ ఇంటర్ విద్యా పరిరక్షణ సమితి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఇంటర్మీడియట్ విద్యలో ఆన్‌లైన్ మూల్యాంకనం చేయాలనే విద్యాశాఖ నిర్ణయాన్ని తాము స్వాగతిస్తున్నామని తెలంగాణ ఇంటర్ విద్యా పరిరక్షణ సమితి పేర్కొంది. ఆదివారం ఈ మేరకు ఆ సమితి రాష్ట్ర కన్వీనర్ మాచర్ల రామకృష్ణగౌడ్, సమన్వయకర్త మైలారం జంగయ్య, ప్రభుత్వ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కొప్పిశెట్టి సురేశ్, సమితి కోకన్వీనర్లు లక్ష్మయ్య, మంజునాయక్, పరశురాములు, సైదులు, చంద్రయ్య, డాక్టర్ వస్కుల శ్రీనివాస్, పీఆర్వో శోభన్‌బాబు ఒక ప్రకటన విడుదల చేశారు. మొదటగా లాంగ్వేజ్, హ్యూమానిటీస్ సబ్జెక్టులపై ప్రయోగాత్మకంగా చేపట్టనుండటం శుభపరిణామం అని పేర్కొన్నారు. దీనివల్ల బోర్డుకు అనవసరపు ఖర్చులు తగ్గుతాయనీ, విద్యార్థులకు నష్టం జరుగకుండా కచ్చితమైన మూల్యాంకనం చేయడం వలన ఫలితాలను సాధ్యమైనంత త్వరగా ఇచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. మార్కుల విషయంలో ఏమైనా హెచ్చుతగ్గులు వచ్చాయని భావిస్తే తక్షణమే వారి పేపర్‌ను వెంబడే డౌన్ లోడ్ చేసుకొని వారికున్న సందేహాలను తీర్చుకోవచ్చునని పేర్కొన్నారు. ఆన్ లైన్ మూల్యాంకనంపై కొందరు వ్యక్తులు తప్పుడు ప్రచారం చేయడం తగదనీ, విద్యార్థులను అనవసరపు ఆందోళనలకు గురిచేయొద్దని కోరారు. ఇంటర్మీడియట్ విద్యలో పనిచేసే అధ్యాపకులందరూ వారివారి సబ్జెక్టులలో పోస్టు గ్రాడ్యుయేట్స్, స్మార్టుఫోన్, ల్యాప్ ట్యాబ్, కంప్యూటర్ వాడటంలో మంచి అనుభవం వున్న వారే కావడం వలన అధ్యాపకులకు "ఆన్ లైన్" మూల్యాంకనంలో అవగాహన కల్పించడానికి మూడు, నాలుగు రోజుల సమయం సరిపోతుందని తెలిపారు.

సర్వజనుల హితమే గాంధీ ఆదర్శాలు

- సీఎం కేసీఆర్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కుల, మత వర్గాలకు అతీతంగా సర్వజనుల హితమే తన మతమని చాటిన మహాత్మాగాంధీ ఆదర్శాలు భారతదేశానికి తక్షణావసరమని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు తెలిపారు. ఈమేరకు సీఎంవో కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి (అమరవీరుల దినోత్సవం) సందర్భంగా సీఎం కేసీఆర్ ఆయనను స్మరించుకున్నారు. జాతి సమగ్రతను, ఐక్యతను నిలబెట్టేందుకు తన జీవితాన్ని అర్పించిన గాంధీ ఈ దేశ పురోగమనానికి సదా ఓ దిక్సూచిలా నిలుస్తారని సీఎం పేర్కొన్నారు. నమ్మిన లక్ష్యాన్ని చేరుకునే క్రమంలో ఎదురయ్యే ఆటంకాలను లెక్క చేయకుండా ఒక్కొక్కటిగా అధిగమిస్తూ... విజయతీరాలకు చేరాలనే స్ఫూర్తినీ ఆయన జీవితం నుంచి ప్రతి ఒక్కరూ నేర్చుకోవాల్సి ఉందని గుర్తు చేశారు. గాంధీజీ ఆశయాల వెలుగులో ముందుకు సాగుతామని సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు.

ప్రజలకు శాంతి అవసరం

- వరల్డ్ పీస్ కౌన్సిల్ అధ్యక్షులు పల్లబ్ సేన్ గుప్తా



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

ప్రపంచంలోని ప్రజలకు శాంతి అవసరమని, అది లేకుండా అభివృద్ధి, సామాజిక న్యాయం, మంచి భవిష్యత్తు సాధ్యం కాదని వరల్డ్ పీస్ కౌన్సిల్ అంతర్జాతీయ అధ్యక్షులు పల్లబ్ సేన్ గుప్తా తెలిపారు. అభివృద్ధి చెందుతున్న దేశాలపై సామ్రాజ్యవాద శక్తులు బెదిరింపులు పాల్పడుతూ ఆంక్షలు విధించడం వల్ల క్యూబా లాంటి అనేక దేశాలు ప్రమాదకరమైన దుస్థితిని ఎదుర్కొంటున్నాయని అన్నారు. యుద్ధాలు ప్రపంచవ్యాప్తంగా మానవ జీవన వ్యయ సంక్షోభాన్ని తీవ్రతరం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అఖిల భారత శాంతి, సంఘీభావ సంఘం రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ఇటీవల వరల్డ్ పీస్ కౌన్సిల్ అంతర్జాతీయ అధ్యక్షులుగా నూతనంగా ఎన్నికైన పల్లబ్ సేన్ గుప్తాను సంఘం రాష్ట్ర జనరల్ సెక్రెటరీ డాక్టర్ కాచం సత్యనారాయణ గుప్త శాలువా, గజ పూలమాలతో హైదరాబాద్ హిమాయత్ నగర్‌లోని హెూటల్ మినర్వాలో ఘనంగా సత్కరించి, జ్ఞాపకను అందజేశారు. ఈ సందర్భంగా పల్లబ్ సేన్ గుప్తా మాట్లాడుతూ.. ఐక్య రాజ్యసమితి గుర్తింపు పొందిన వరల్డ్ పీస్ కౌన్సిల్ 'శాంతికి అవును, యుద్ధానికి కాదు' అన్న నినాదంతో ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాల్లో పని చేస్తుందని తెలిపారు. నిజమైన శాంతిని విశ్వసించే దేశాలు అంతర్జాతీయ సహకారం అందిస్తాయని, సామ్రాజ్యవాద దేశాలు ఆంక్షలు, యుద్ధాలను ప్రోత్సహిస్తాయన్నారు. క్యూబాపై అమెరికా నిర్బంధాన్ని వెంటనే ముగించాలని డిమాండ్ చేశారు. ఐరోపాలో జీవన పరిస్థితులు దిగజారుతున్నట్టు రుజువులు కనిపిస్తున్న నేపథ్యంలో రష్యా, ఉక్రెయిన్ దేశాలు వెంటనే యుద్ధాలు ఆపి, శాంతీయుత చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. భారతదేశంలో ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా ఫాసిస్ట్ చర్యలు ప్రారంభమయ్యాయని, ప్రజాస్వామ్య రక్షణకై, వారి హక్కులు, సామాజిక పురోగతి కోసం శాంతియుతంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. యుద్ధాలకు ముగింపు పలకాలని, శాంతిని రక్షించాలని, శరణార్థులు, వలసదారుల హక్కులను కాపాడాలని వరల్డ్ పీస్ కౌన్సిల్ ప్రపంచవ్యాప్తంగా ప్రజలను చైతన్యపరుస్తూ కార్యక్రమాలు నిర్వహిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో సంఘం జాతీయ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ కె.యాదవరెడ్డి, సీపీఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా, సీపీఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట్ రెడ్డి, సీపీఐ ఏపీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య, ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు డా.దిడ్డి సుధాకర్, ఐప్సో రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కేవీఎల్, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్ రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షులు ఎం.ఆర్.జి.వినోద్ రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ రాష్ట్ర నాయకులు పి.ఎల్.శ్రీనివాస్, లోకసత్తా ఉపాధ్యక్షులు మెట్ల జగన్, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్, రాష్ట్ర నాయకులు తిప్పర్తి యాదయ్య, కాచం సత్యనారాయణ గుప్త, నాగేశ్వర్ రావు, ప్రముఖ సినీనటి ప్రీతి నిగమ్, ఐపీసో నాయకులు ఉమా మహేష్, బచ్చన్ సింగ్, టి.రాకేష్, జగన్ మోహన్ రావు, రఘుపాల్, నాగిరెడ్డి, కర్ర నగేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగానికి బడ్జెట్‌లో
అధిక నిధులు కేటాయించాలి

- సారంపల్లి, సత్యబాబు బోస్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాలకు బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించాలని అఖిలభారత కిసాన్ సభ (ఏఐకేఎస్) జాతీయ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, పీపుల్స్ మానిటరింగ్ కమిటీ(పీఎంసీ) జాతీయ కన్వీనర్ టీడీఏ సత్యబాబు బోస్ డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని కేవీపీఎస్ రాష్ట్ర కార్యాలయంలో తెలంగాణ అగ్రి నెట్‌వర్క్, సీబీజీఏ సంయుక్తంగా నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టబోయే బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి కనీసం పదిశాతానికి పైగా కేటాయించాలని డిమాండ్ చేశారు వామపక్ష ప్రభుత్వం అధికారంలో ఉన్న కేరళ, పక్కనున్న కర్నాటక, తమిళనాడు ప్రభుత్వాలు రైతులు పండించిన ధాన్యానికి ఇస్తున్న మాదిరిగా బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా బోనస్ ఇవ్వాలని కోరారు. వీటి కోసం ప్రత్యేకంగా బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. రైతుల పండించే పంటలకు కనీస మద్దతుధర అమలు కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలనీ, పూర్తి సబ్సిడీతో విత్తనాలు, ఎరువులు అందించేందుకు బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. ప్రసాద్, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి శోభన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు క్షేత్రస్థాయి నుంచి బడ్జెట్ ప్రతిపాదనలు తీసుకోవాలనీ, అందుకు వ్యవసాయ రంగంలో పని చేస్తున్న సంఘాలు, సంస్థలు, రైతు సంఘాలు, రైతులతో సంప్రదింపులు జరపాలని సూచించారు. కౌలు,పోడు సాగుదారులకు రైతుబంధు, రైతు బీమా వర్తింపజేయాలని అన్నారు. వలసలు నివారించేలా వ్యవసాయ విధానాలు తీసుకురావాలనీ, పట్టణ పేదలకు ప్రత్యేకంగా పని కల్పించేందుకు కేరళ తరహాలో రూ. 1000 కోట్లు 'పట్టణ ఉపాధి హామీ' కోసం కేటాయించాలన్నారు. నిత్యవసర ధరల నియంత్రణ కోసం ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయాలని కోరారు. వివిధ ప్రాజెక్టుల కోసం సేకరిస్తున్న భూసేకరణ ప్రాంతాలలో వ్యవసాయ కార్మికులు వత్తిదారులను ఆదుకొనేందుకు ప్రత్యేక ప్యాకేజీకి బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు తెల్లరేషన్ కార్డుదారులకు సబ్సిడీ బియ్యం అందించేందుకు రాష్ట్ర బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించాలనీ, 14 రకాల నిత్యావసర సరుకులు అందించే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. బాధితులకు భూసేకరణ చట్టం 2013 ప్రకారం పునరావాసం కల్పించాలన్నారు. ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకున్న వారికి పట్టాలిచ్చి ఇంటి నిర్మాణానికి రూ. 5లక్షలు ఇవ్వాలని కోరారు. కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ కులాంతర వివాహాలు చేసుకున్న వారికి ఉపాధి కల్పించేందుకు బడ్జెట్లో ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని కోరారు అనంతరం తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ 2023-24పై రైతుల ఆకాంక్షల నివేదిక విడుదల చేశారు. కార్యక్రమానికి తెలంగాణా అగ్రి నెట్‌వర్క్, సీబీజీఏ రాష్ట్ర సమన్వయకర్త సురుపంగ శివలింగం అధ్యక్షత వహించారు. సీబీజీఏ ప్రతినిధి సోమశేఖర్, పీఎంసీ నాయకులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

24 గంటలు కరెంట్ ఇస్తున్నట్టయితే..
రాజకీయాల నుంచి తప్పుకుంటా

- ఏసీడీ చార్జీలు వసూలు చేసే చట్టం లేదు
- కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి



నవతెలంగాణ- జగిత్యాల

తెలంగాణలో ఎక్కడైనా 24 గంటలు విద్యుత్ ఇస్తున్నట్టయితే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. విద్యుత్ వినియోగదారుల నుంచి ఏడీసీ చార్జీలు వసూలు చేసే అధికారం ప్రభుత్వానికి లేదని తెలిపారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడారు. రైతులకు కరెంటు ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అసమర్థత వల్ల విద్యుత్ ఏసీడీ బిల్ తీసుకు వచ్చిందన్నారు. 300 యూనిట్లు లోపల ఉన్న నిరుపేద వర్గాలైన వారిపై పన్ను వేస్తున్నారని, ఇది ఒక ఎన్పీడీసీఎల్‌లో మాత్రమే ఉందని, ఉత్తర తెలంగాణ వినియోగదారులు తెలంగాణ బిడ్డలు కాదా అని ప్రశ్నించారు. దక్షిణ తెలంగాణలో ఏసీడీ చార్జీలు లేవని, కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోని ఎర్రవెల్లిలో, ఆయన కొడుకు కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్లలో ఏసీడీ బిల్లు వసూలు చేయడం లేదన్నారు. రాష్ట్రంలో 110 మంది ఎమ్మెల్యేల బలం ఉన్నప్పుడే తెలంగాణ ప్రజల హక్కులను పరిరక్షించలేని అసమర్థుడు కేసీఆర్ అని ఆరోపించారు. ఈ నెల 31న విద్యుత్ సమస్యలపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జగిత్యాల ఎస్ఈ కార్యాలయాన్ని ముట్టడిస్తామని తెలిపారు. పసుపు బోర్డు లేకుంటే తన పదవికి రాజీనామా చేస్తానన్న ఎంపీ అరవింద్ సాధించలేకపోయారని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకరి మీద ఒకరు నెట్టి వేసుకోవడం తప్ప రైతుల సమస్యలు పరిష్కరించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

అధిష్టానం ఆదేశిస్తే ఎమ్మెల్యే, ఎంపీ దేనికైనా పోటీ చేసేందుకు సిద్ధమన్నారు. ఈ సమా వేశంలో డీసీసీ అధ్యక్షులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మాజీ మున్సిపల్ చైర్మెన్ గిరి నాగ భూషణం, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మి దేవేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వీలైనంత మేర ప్రయివేటు ఆస్తుల సేకరణ తగ్గించేలా..

- ఎయిర్‌పోర్ట్ మెట్రో అలైన్‌మెంట్‌ను ఖరారు చేసే యోచన
- ఇంజనీర్ల బృందంతో కలిసి ఎన్వీఎస్ రెడ్డి మెట్రో అలైన్‌మెంట్ పరిశీలన



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఎయిర్‌పోర్ట్ మెట్రో విస్తరణ పనులు శర వేగంగా సాగుతున్నాయి. ఈ మెట్రో నిర్మాణ పనుల కోసం సంబంధిత అధికారులు ఇప్పటికే స్థల సేక రణపై దృష్టిసారించిన విషయం తెలిసిందే. అదే సమయంలో ప్రయివేటు ఆస్తుల సేకరణ సాధ్యమ య్యేనంత మేర తగ్గించేలా.. ఎయిర్‌పోర్టు మెట్రో అలైన్‌మెంట్‌ను ఖరారు చేయాలని అధికారులు భావి స్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం హైదరా బాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో లిమిటెడ్(హెచ్‌ఏఎంఎల్) ఎండీ ఎన్వీఎస్ రెడ్డి సీనియర్ ఇంజనీర్ల బృందంతో కలిసి మెట్రో అలైన్‌మెంట్‌ను, స్టేషన్ స్థానాల ఎంపికను పరిశీలించారు. నార్సింగి అండర్‌పాస్ (మై హెూమ్ అవతార్ జంక్షన్) నుంచి రాజేంద్రనగర్ గుట్ట వరకు దాదాపు 10 కిలోమీటర్లు నడిచి.. అలైన్‌మెంట్‌లోని ప్రతి అంశాన్ని క్షుణంగా పరిశీలించారు. అనంతరం హెచ్ఏఎంఎల్ ఎండీ అధికారులకు పలు మార్గదర్శకాలు, ఆదేశాలిచ్చారు. ఎయిర్‌పోర్ట్ మెట్రో అలైన్‌మెంట్‌ను ప్రయివేట్ ఆస్తుల సేకరణను నివారించే విధంగా లేదా సాంకేతికంగా సాధ్యమయ్యేంత వరకు తగ్గించే విధంగా ఖరారు చేయాలన్నారు. ప్రయాణీకులు స్టేషన్లకు సులువుగా చేరుకోవడానికి ఓఆర్ఆర్ అండర్‌పాస్‌లను ఉపయోగించేందుకు వీలుగా స్టేషన్లు నిర్మించాలని తెలిపారు. కారిడార్ పరిసరాల్లో నిర్మాణంలో ఉన్న ఎత్తైన వాణిజ్య, నివాస భవనాల వాసుల అవసరాలను తీర్చడానికి భవిష్యత్తులో అదనపు స్టేషన్ల నిర్మాణం కోసం గుర్తించబడిన ప్రదేశాల్లో మెట్రో వయాడక్ట్ ప్లాన్ చేయాలన్నారు. స్కైవాక్‌లు, ఇతర పాదచారుల సౌకర్యాలు స్టేషన్ ప్లానింగ్‌లో అంతర్భాగంగా ఉండాలని చెప్పారు. మెట్రో పిల్లర్లు నానక్‌రామ్‌గూడ జంక్షన్ నుంచి టీఎస్‌పీఏ(అప్పా) జంక్షన్ వరకు విస్తరించిన సర్వీస్ రోడ్డు సెంట్రల్ మీడియన్‌లో ఉండాలని, ఇది సర్వీస్ రోడ్డులో ఇప్పటికే చాలా ఎక్కువగా ఉన్న రహదారి ట్రాఫిక్ సజావుగా సాగేలా చేస్తుందని చెప్పారు. స్టేషన్ల యాక్సెస్ పాయింట్లు కొత్త సైకిల్ ట్రాక్‌కు అను గుణంగా ఉండాలని, పర్యావరణహితంగా స్టేషన్లను చేరుకోవడానికి ఈ కొత్త సైకిల్ ట్రాక్ ఉపయోగ పడుతుందిన సూచించారు. ఎయిర్‌పోర్టు మెట్రో ప్రయాణం మరింత వేగవంతం చేయడానికి, సజావుగా సాగేలా చేయడానికి కొన్ని ప్రదేశాల్లో వంపులు లేకుండా సాంకేతిక సాధ్యాసాధ్యాలను పరిశీలించాలన్నారు. స్టేషన్ల కోసం పార్కింగ్ సౌకర్యాల అభివృద్ధి, ప్రాజెక్ట్ వేగవంతం చేయడానికి తాత్కాలిక కాస్టింగ్ యార్డుల ఏర్పాటు కోసం కారిడార్ సమీపంలో తగిన బహిరంగ ప్రభుత్వ భూములను గుర్తించాలని అధికారులను ఆదేశిం చారు. పరిశీలనా బృందంలో.. హెచ్ఏఎంఎల్ చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ బి.ఆనంద్ మోహన్, జనరల్ మేనేజర్‌లు ఎం. విష్ణువర్ధన్ రెడ్డి, రాజేంద్ర ప్రసాద్ నాయక్, ఎస్ఈ వై.సాయపు రెడ్డి, డీఎస్పీ కె.శ్రీనాథ్ రెడ్డి, ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

బడ్జెట్ లో 5శాతం
నిధులు కేటాయించాలి

- జీవో నెంబర్17ను రద్దు చేయాలి
- నేడు కలెక్టరేట్ల ముందు ధర్నాలు
- ఎన్‌పీఆర్‌డీ పిలుపు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వికలాంగులకు రాష్ట్ర బడ్జెట్లో ఐదు శాతం నిధులు కేటాయించాలనీ, ఆసరా పెన్షన్ల మంజూరుకు ఆదాయపరిమితి విధించే జీవో నెంబర్ 17ను రద్దు చేయాలని కోరుతూ నేడు రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల ముందు ధర్నాలను చేపట్టినట్టు వికలాంగుల హక్కుల జాతీయ వేదిక(ఎన్‌పీఆర్‌డీ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె వెంకట్, ఎం అడివయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వయం ఉపాధి కోసం వేలాదిమంది నిరుద్యోగులు దరఖాస్తులు చేసుకున్నారనీ, 25 శాతం మందికి కూడా రుణాల మంజూరు చేయలేదని పేర్కొన్నారు. వికలాంగుల వివాహ ప్రోత్సాహం కోసం గతేడాది 711 మంది దరఖాస్తు చేసుకుంటే 240 మందికి మాత్రమే మంజూరు చేశారని గుర్తుచేశారు. బ్యాటరీ వీల్ చైర్ల కోసం రెండు వేల మంది దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. 2022 ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నప్పటికీ దరఖాస్తు చేసుకున్న వారందరికీ పరికరాలు పంపిణీ చేయలేదని ఆందోళన వ్యక్తం చేశారు. బడ్జెట్‌లో అవసరమైన నిధులు కేటాయించి, స్వయం ఉపాధి రుణాలు, పరికరాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

317 జీవోను సవరించి
ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి



నవతెలంగాణ-అడిక్ మెట్

317 జీవోను సవరించి ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని బాధిత ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద 317 జీవో బాధిత ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు మహా ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో ఉపాధ్యాయ సంఘాల నేతలు మారిశెట్టి తిరుపతిరావు, సదానంద గౌడ్, భుజంగరావు, నాగేశ్వరరావు, వినోద్‌లు హాజరై మాట్లాడారు. ప్రస్తుతం ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లు చేపడుతున్న తరుణంలో స్థానికత కోల్పోయిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు స్థానికత కల్పించాలని డిమాండ్ చేశారు. సంవత్సరం నుంచి తాము పోరాటం చేస్తున్నా ముఖ్యమంత్రి కేసీఆర్ స్పందించడం లేదన్నారు. సీఎం తమ మీద ఎందుకు ఇంత కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతునారని ప్రశ్నించారు. తాము గొంతెమ్మ కోరికలు కోరడం లేదని.. స్థానికత ఆధారంగా తమను ట్రాన్స్‌ఫర్ చేయాలని కోరుతున్నామని తెలిపారు. భార్యాభర్తల్ని విడదీయకుండా ఒకే దగ్గర ఉండే విధంగా బదిలీ చేయాలన్నారు. జీవో 317 వల్ల తాము 200, 300 కిలోమీటర్ల ప్రయాణం చేసి పిల్లలకు విద్యా బోధించగలమా అని ఆవేదన వ్యక్తం చేశారు. చదివింది ఎక్కడో ఉద్యోగం అక్కడే కల్పించాలని కోరారు. 317 జీవోను సవరించి ఉపాధ్యాయులకు న్యాయం చేయకపోతే ఫిబ్రవరి 3 నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాలను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ ధర్నాలో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులు బీఆర్ఎస్‌కు
మద్దతుగా నిలవాలి

- తెలంగాణ టూరిజం చైర్మెన్ ఉప్పల శ్రీనివాస గుప్తా



నవతెలంగాణ-హైదరాబాద్

దేశ రాజకీయాల్లో రాబోయే రోజుల్లో కీలక పాత్ర పోషించే భారతీయ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీకి అంతర్జాతీయంగా ఆర్య వైశ్యులు మద్దతు ఇవ్వాలని ఐబీఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మెన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా పిలుపునిచ్చారు. ఆదివారం తమిళనాడులోని చెన్నైలో కాస్మోపాలిటన్ క్లబ్, అన్నశాల ఇంటర్నేషనల్ వైస్ ఫెడరేషన్ తమిళనాడు విభాగం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందించిన నూతన పారిశ్రామిక విధానం టీఎస్ పాస్‌ను అందరూ అభినందిస్తున్నారని తెలిపారు. తెలంగాణలో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక ప్రభుత్వశాఖల్లో పారదర్శకత పెరిగిందన్నారు. బీఆర్ఎస్‌కు ఆర్యవైశ్యులు మద్దతుగా నిలిచి తమిళనాడులో కూడా గెలిపించుకుంటే అవన్నీ ఇక్కడా అమలవుతాయని, ఆర్యవైశ్యులకు సముచిత స్థానం లభిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో కస్తూరి రంగరాజన్, కె శంకర్రావు, అధ్యక్షులు పి శేషాద్రి, కార్యదర్శి, ట్రెజరర్ తదితరులు పాల్గొన్నారు.

నవభారత నిర్మాణానికి
'ప్రజల పద్మా'ల ఉద్యమం

- మన్ కీ బాత్ లో ప్రధాని మోడీ
- తెలుగు వారి ప్రస్తావన

న్యూఢిల్లీ : 'ప్రజల పద్మా'ల ఉద్యమం ప్రజల భాగస్వామ్యంలో సమూల మార్పులు తీసుకొచ్చిందనీ, ఈ ఉద్యమం నవభారత నిర్మాణానికి దోహదపడుతుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అన్నారు. ఈ ఏడాది 'పద్మ' పురస్కారా లను పొందినవారిలో గిరిజన జాతులు, వారితో మమేకమైనవారు చెప్పుకోదగ్గ సంఖ్యలో ఉన్నారని అన్నారు. 2023లో మొట్టమొదటి మన్ కీ బాత్ రేడియో కార్యక్రమంలో ప్రధాని మోడీ ఆదివారం మాట్లాడారు. గిరిజన జీవితం నగర జీవితం కన్నా భిన్నమైనదన్నారు. గిరిజన జీవన విధానంలోనూ తనదైన సవాళ్లు ఉన్నాయన్నారు. అనేక ఆటుపోట్లు ఎదురైనప్పటికీ గిరిజన సమాజాలు తమ సంప్రదాయాలను కాపాడుకోవడానికి ఎల్లప్పుడూ ఆత్రుతతో కృషి చేస్తున్నాయని తెలిపారు. గిరిజన ప్రాంతాలకు చెందిన పెయింటర్స్, మ్యుజీషియన్స్, రైతులు, కళాకారుల వంటివారు ఈ ఏడాది 'పద్మ' పురస్కారాలను పొందారన్నారు. వీరి కథలు ప్రేరణనిస్తాయని, వాటిని చదవాలని ప్రజలను కోరారు. టోటో, హో, కుయి, కువి, మాండా వంటి గిరిజన భాషలపై కృషిచేసిన అనేక మందికి పద్మ పురస్కారాలు లభించాయన్నారు. ఇది మనందరికీ గర్వకారణం అని అన్నారు.

తెలుగు వారి ప్రస్తావన

ఈ మన్‌కీబాత్‌లో ఇద్దరు తెలుగు వారి గురించి ప్రస్తావించారు. మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ నడిపే ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కె.వి రామసుబ్బారెడ్డి, తెలంగాణకు చెందిన ఇంజినీరు విజయ్ గురించి ప్రస్తావించారు. 'నంద్యాల జిల్లాకు చెందిన కె.వి రామసుబ్బారెడ్డి మిల్లెట్స్ పండించడం కోసం మంచి జీతం వచ్చే ఉద్యోగం మానేశారు. తల్లి చేతితో తయారు చేసిన మిల్లెట్స్ రుచి చూసిన సుబ్బారెడ్డి గ్రామంలో ప్రాసెసింగ్ యూనిట్ ప్రారంభించారు. మిల్లెట్ల వల్ల వచ్చే ప్రయోజనాలు ప్రజలకు వివరించడంతోపాటు ప్రజలకు అందుబాటులో ఉంచుతున్నారు" అని అన్నారు. "నమో యాప్‌లో తెలంగాణకు చెందిన ఇంజినీరు విజయ్ చేసిన పోస్ట్ చదివాను. ఇందులో ఈ వేస్ట్ గురించి రాశారు. దీనిపై మన్‌కీ బాత్‌లో చర్చించమని అడిగారు. ఈ రోజు ఈ వేస్ట్ గురించి చర్చిద్దాం" అంటూ ప్రధాని మోడీ మొబైల్, ల్యాప్‌టాప్, టాబ్లెట్ వంటివి నిరుపయోగం అయినపుడు వాటిని ఎలా పారవేయాలో వివరించారు.

రజక వృత్తిదారుల సంక్షేమం పట్ల సర్కారు నిర్లక్ష్యం

బడ్జెట్‌లో వెయ్యి కోట్లు కేటాయించాల్సిందే..

- సేవావృత్తిని పట్టించుకోని ప్రభుత్వం: రౌండ్ టేబుల్ సమావేశంలో పైళ్ల ఆశయ్య



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'రజక వృత్తిదారుల సంక్షేమంపట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. రజక జనాభాలో 80శాతానికి పైగా ఈ వృత్తిపైన్నే ఆధారపడి బతుకుతున్నారు.సమాజంలో సేవా వృత్తిగా పిలవబడుతున్న రజకుల పట్ల సర్కారు చిన్నచూపు చూడటం సరికాదని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య విమర్శించారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గుమ్మడిరాజు నరేశ్ అధ్యక్షతన '2023-24 రాష్ట్ర బడ్జెట్‌లో రజక వృత్తిదారుల సంక్షేమానికి వెయ్యి కోట్లు కేటాయించాలి' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశయ్య మాట్లాడుతూ ప్రతి ఏటా బడ్జెట్‌లో రజకులకు అన్యాయం జరుగుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. కాగితాల్లో చూపిస్తున్న అరకొర నిధుల్ని కూడా ఖర్చు చేయటం లేదని చెప్పారు. 2017-2020 బడ్జెట్లలో రూ.450 కోట్లు కేటాయించినట్టు ప్రకటించీ, వాటిని విడుదల చేయలేదని తెలిపారు. దోబీఘాట్ల నిర్మాణం కోసం మూడు కోట్లు మాత్రమే కేటాయించి ప్రభుత్వం చేతులు దులుపుకున్నదని తెలిపారు. ఎనిమిదేండ్లలో తొమ్మిది దోబీఘాట్లు మాత్రమే కట్టడమేంటని ప్రశ్నించారు. 46దోబీఘాట్ల నిర్మాణానికి దరఖాస్తులు వస్తే..వాటినెందుకు పట్టించుకోవటం లేదో చెప్పాలన్నారు. తరతరాలుగా వృత్తిపై ఆధారపడి బతుకుతున్న రజకులు..కాంట్రాక్టర్లదగ్గర కూలీలుగా బతకాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆస్పత్రులు,విద్యా సంస్థలు, పోలీసు శాఖల బట్టల వాషింగ్, ఇస్త్రీ పనుల్ని వృత్తిదారులకే ఇవ్వాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. వృత్తి పరంగా ఎలాంటి ఆర్థిక పరమైన మెరుగుదల లేకపోవడంతో వెనుకబాటు, అణచివేత, దోపిడీ, వివక్షతలకు గురౌతున్నారని చెప్పారు. రజక వృత్తిలోకి అనేక కార్పొరేట్ కంపెనీలు ప్రవేశించటంతో అసలైన వృత్తిదారులు దివాళా తీస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అర్హత కలిగిన వారందరికీ రుణాలిస్తామని నమ్మబలికిన ప్రభుత్వం.. 50వేల దరఖాస్తులను బుట్టదాఖలు చేసిందని విమర్శించారు.

ఉమ్మడి రాష్ట్రంలో రజకుల సంక్షేమానికి ఏర్పాటు చేసిన 18, 19, 343, 116, 178, 11, 892, 27 జీవోలను రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు అమలు చేయటం లేదో చెప్పాలని ప్రశ్నించారు. ఉచిత విద్యుత్ పథకాన్ని ఎల్‌టీ-4కు మార్చి, ఏసీడీ ఛార్జీల భారాలు తగ్గించాలని డిమాండ్ చేశారు. రజకుల సామాజిక భద్రతకోసం రక్షణ చట్టం చేయాలన్నారు. ఫెడరేషన్‌కు పాలక వర్గాన్ని నియమించాలనీ, దోబీ ఘాట్‌ల పరిరక్షణకు ప్రహరీ గోడలు నిర్మించాలనీ, కబ్జాల నుంచి కాపాడాలనీ, వృత్తిదారులందరికీ ఇండ్లు, ఇండ్ల స్థలాలివ్వాలనీ,రూ.5లక్షల జీవితాబీమా సౌకర్యం ఏర్పాటు చేయాలని పలు తీర్మానాలు చేశారు.

తకార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం బాలకృష్ణ, సహాయ కార్యదర్శులు సి మల్లేశ్,ఎదునూరు మధార్,పి రాములు, నవీన్, దోబీ మహాసంఘం రాష్ట్ర అధ్యక్షులు సి శంకర్, రాష్ట్ర కమిటి సభ్యులు, ఆయా జిల్లాల నేతలు పాల్గొన్నారు.

మొగల్ గార్డెన్ పేరును అమృత్ ఉద్యాన్‌గా మార్చటం సమంజసం కాదు : ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దేశ రాజధాని న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో గల మొగల్ గార్డెన్ పేరును అమృత్ ఉద్యాన్‌గా మార్చటం సమంజసం, సమర్థనీయం కాదని ఎమ్మెల్యే అలుగుబెల్లి నర్సిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మొగల్ గార్డెన్ పేరునే కొనసాగించాలని కేంద్రాన్ని కోరారు. ఆ పేరు మార్చటం వల్ల భారతీయ సమాజానికి జరిగేమేలు లేశమాత్రమైనా లేదని తెలిపారు. దేశ ప్రజల్లో విభజన పెరగటానికి ఇలాంటి చర్యలు దారితీస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. కొత్త నిర్మాణాలకు పాలకులు తమకు అనుకూలమైన పేరు పెట్టుకోవటాన్ని అర్థం చేసుకోవచ్చునని తెలిపారు. కానీ, 75 ఏండ్ల స్వతంత్ర భారతంలో అవసరం రాని పేరు మార్పిడి ఇప్పుడెందుకు అని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు పౌరులందరికీ బాధ్యత వహించే విధంగా ఉండాలని సూచించారు. ప్రజల మధ్య విభజన రేఖ తీసుకొచ్చే ఇలాంటి చర్యలకు స్వస్తి పలకాలని విజ్ఞప్తి చేశారు.

రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు 30 శాతం నిధులు కేటాయించాలి : ఏఐఎస్‌ఎఫ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

విద్యా రంగానికి రాష్ట్ర బడ్జెట్‌లో 30 శాతం నిధులు కేటాయించాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఈ మేరకు వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఉద్యమ సమయంలో రాష్ట్రమొచ్చాక విద్యకు ప్రతి బడ్జెట్‌లోనూ అధిక ప్రాధాన్యత ఇస్తామని సీఎం కేసీఆర్ చెప్పి ఇప్పుడు అమలు చేయడం లేదని విమర్శించారు. 2014-15లో విద్యకు బడ్జెట్‌లో 10 శాతం నిధులు కేటాయిస్తే 2021-23 నాటికి అది ఆరు శాతానికి తగ్గిపోయిందని పేర్కొన్నారు. మహారాష్ట్ర, తమిళనాడు, కేరళ, ఢిల్లీ రాష్ట్రాల్లో విద్యకు 25 శాతం నిధులు కేటాయిస్తుంటే ఇక్కడ సగం కూడా ఇవ్వడం లేదని విమర్శించారు. ఢిల్లీలో అమలు చేస్తున్న ప్రభుత్వ విద్య విధానాన్ని మన రాష్ట్రంలోనూ అమలు చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఉస్మానియా యూనివర్సిటీకి వెయ్యి కోట్ల రూపాయలను కేటాయించాలని డిమాండ్ చేశారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా హాస్టల్ విద్యార్థులకు మెస్ ఛార్జీలు పెంచాలనీ, ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలను అద్భుతంగా తీర్చిదిద్దాలని విజ్ఞప్తి చేశారు.

నేడు అనాథల అరిగోస దీక్ష : మంద కృష్ణ మాదిగ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అనాథల అరిగోస దీక్షను చేపట్టనున్నట్టు మంద కృష్ణ మాదిగ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఇందిరా పార్కు వద్ద చేపట్టనున్న దీక్షకు వివిధ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల నేతలు హాజరవుతారని పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వం అనాథలకు ఎన్నో హామీలు ఇచ్చిందనీ, ఆ హామీలను అమలు చేయకుండా నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నదని విమర్శించారు. అనాథల సంక్షేమం కోసం నియమించబడ్డ మంత్రి వర్గ ఉప సంఘం ఎన్నో తీర్మానాలు చేసిందనీ,వాటిని అమలు చేయటం లేదని తెలిపారు. మంత్రి వర్గ ఉపసంఘం సిఫారసులు, ప్రభుత్వ హామీలను అమలు చేయాలని కోరతూ దీక్ష చేస్తున్నట్టు తెలిపారు.

ఇల్లు లేని నిరుపేదలందరికీ ఇంటి స్థలం, రూ.5లక్షలు ఇవ్వాలి

- ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి
- ఐద్వా సిరిసిల్ల జిల్లా కార్యాలయం ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

నవతెలంగాణ - తంగళ్ళపల్లి

ఇల్లు లేని నిరుపేదలందరికీ ఇంటి స్థలం, ఇల్లు కట్టుకునేందుకు రూ.5లక్షలు అందించాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని బీవై.నగర్‌లో ఐద్వా (అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం) జిల్లా కార్యాలయాన్ని మల్లు లక్ష్మి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. మహిళా పొదుపు సంఘాలకు రావాల్సిన పావలా వడ్డీ రుణాల బకాయిలను వెంటనే చెల్లించి, వడ్డీ లేని రుణాలు అందించాలని డిమాండ్ చేశారు. మహిళలపై జరుగుతున్న దాడులు, అణచివేతలకు వ్యతిరేకంగా వారి హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న సంఘం ఐద్వా అని తెలిపారు. మద్యపాన నిషేధం విధించాలని, ప్రజలందరికీ విద్యా, వైద్యాన్ని అందుబాటులోకి తీసుకురావాలన్నారు. మహిళల రక్షణ, భద్రతకు చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం అర్హులైన నిరుపేదలందరికీ నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను అందించాలని, మిగిలిన వారందరికీ ఇంటి స్థలం, రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం ప్రజాసంఘాల పోరాట ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఫిబ్రవరి 9న చేపట్టిన చలో హైదరాబాద్ ధర్నాలో మహిళలందరూ పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షులు సూరం పద్మ, జిల్లా కార్యదర్శి జవాజి విమల, నాయకులు వడ్ల లక్ష్మి, గట్ల స్వప్న, సామల కవిత, కృష్ణవేణి, శారద, భాగ్యలక్ష్మి, రూప, పూజ, మంజుల, అంబవ్వ, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

దళిత బంధుకు రూ.20వేల కోట్లు కేటాయించాలి

- ఫిబ్రవరి 9న చలో హైదరాబాద్ : కేవీపీఎస్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దళితబంధు కోసం 2022-23 బడ్జెట్‌లో రూ.20వేల కోట్లు కేటాయించాలనీ, దళితులు, పేదలకు ఇండ్ల స్థలాలివ్వాలని కోరుతూ వచ్చే నెల తొమ్మిదిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జాన్ వెస్లీ, టి స్కైలాబ్ బాబు తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించినట్టు పేర్కొన్నారు. దళితబంధు పథకాన్ని హైకోర్టు తీర్పుమేరకు రాజకీయలకతీతంగా అర్హులను అధికారుల ద్వారా ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు.ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించాలని విజ్ఞప్తి చేశారు. పారదర్శకంగా గ్రామసభలు నిర్వహించి అర్హులను ఎంపిక చేయాలని పేర్కొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో నియోజకవర్గ పరిధిలోని 5,000మందికి దళితబంధు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇండ్లస్థలాల కోసం బడ్జెట్‌లో నిధులు కేటాయించి 120గజాల స్థలం ఇచ్చి, రూ. 5లక్షలు ఇంటి నిర్మాణం కోసం ఇవ్వాలని కోరారు. వచ్చే నెల మూడున మున్సిపాలిటీ పరిధిలో ధర్నాలు, తొమ్మిదిన చలో హైదరాబాద్‌కు దళితులు తరలిరావాలని విజ్ఞపి చేశారు.

గుజరాత్ పంచాయతీరాజ్ క్లర్క్ పోస్టుల పరీక్ష పేపర్ లీక్

- మూలాలు ఐడీఏ బొల్లారంలో..



నవతెలంగాణ-ఐడీఏ బొల్లారం

గుజరాత్ ప్రభుత్వ పంచాయతీ రాజ్ జూనియర్ క్లర్క్ పరీక్ష పేపర్ లీక్ మూలాలు సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం ఐడీఏ బొల్లారం లోని కేఎల్ హైటెక్ పరిశ్రమలో దొరికాయి. దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ కేసులో సర్దాకర్ రోహన్ అనే వ్యక్తిని గుజరాత్ ఏటీఎస్ పోలీసులు బొల్లారం కేఎల్ హైటెక్ పరిశ్రమలో అరెస్టు చేశారు. గుజరాత్ పంచాయతీ రాజ్ జూనియర్ క్లర్క్ పరీక్ష ఆదివారం ఉదయం 11 గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా రెండు గంటల ముందు సోషల్ మీడియాలో లీక్ కావడంతో పరీక్ష వాయిదా పడింది. పేపర్ లీక్ వెనుక మొత్తం 16 మంది ఉండగా అందులో ఒక వ్యక్తి సర్దాకర్ రోహన్‌ను గుజరాత్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గుజరాత్‌కు చెందిన జీతూనాయక్ సహకారంతో ఈ పేపర్ లీకేజీకు పాల్పడినట్టు తెలుస్తోంది. సర్దాకర్ రోహన్ బొల్లారంలోని కేఎల్ హైటెక్ పరిశ్రమలో ఆపరేటర్‌గా పని చేస్తున్నట్టు సమాచారం. సుమారు తొమ్మిది లక్షల యాభై వేల మంది అభ్యర్థులు ఈరోజు పరీక్ష రాసేందుకు గుజరాత్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. పరీక్ష ప్రారంభం కావడానికి రెండు గంటల ముందు పరీక్ష పేపర్ లీక్ కావడంతో పరీక్షకు హాజరైన అభ్యర్థులకు రవాణా సౌకర్యం ప్రభుత్వం సమకూర్చినట్టు తెలుస్తోంది. ఈ కేసుకు సంబంధించి జరిగిన అరెస్టును బొల్లారం పోలీస్ ఇన్‌స్పెక్టర్ సురేందర్‌రెడ్డి ధృవీకరించారు.

ప్రజావ్యతిరేక విధానాలను తిప్పి కొట్టండి ..

రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగర్

- ఏప్రిల్ 5న ఢిల్లీలో కదం తొక్కండి



నవ తెలంగాణ-కందనూలు

కేంద్ర ప్రభుత్వ అవలంబిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. సాగర్ అన్నారు. ఆదివారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో జిల్లా సదస్సును సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ.. ప్రజా సంఘాల ఐక్యవేదిక, సీఐటీయూ, తెలంగాణ రైతు సంఘం, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఏప్రిల్ 5వ తేదీన దేశ రాజధాని ఢిల్లీ నడిబొడ్డున 10 లక్షల మందితో కేంద్ర ప్రభుత్వంపై సమర శంఖం పూరించేందుకు ప్రజలు కదం తొక్కాలని పిలుపునిచ్చారు.

కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు వ్యవసాయ చట్టాలను తీసుకువచ్చి వ్యవసాయాన్ని కార్పొరేటీకరించేందుకు ప్రయత్నించిందని తెలిపారు. దానిపై ఏడాదిపాటు పోరాడిన రైతులు, వారు చేసిన త్యాగాల ఫలితంగా చట్టాలను వెనక్కి తీసుకున్నదని గుర్తుచేశారు. కాని వాటిని దొడ్డిదారిలో అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. అలాగే, విద్యుత్ సవరణ బిల్లును వెనక్కు తీసుకోవాలని, ఉపాధి హామీ చట్టానికి నిధుల కేటాయింపులు, 200 పనిదినాలు, కనీస వేతనం రోజుకు రూ. 600 నిర్ణయించాలని డిమాండ్ చేశారు. బడా పారిశ్రామికవేత్తల ప్రయోజనాల కోసం తర్వాత 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా తెచ్చి కార్మికులను కట్టు బానిసలుగా మార్చాలని చూస్తున్నదన్నారు. వీటన్నింటికి వ్యతిరేకంగా ఏప్రిల్ 5న నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, ప్రజాసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ బదిలీలను వెంటనే ఆపేయాలి

- విద్యాశాఖ కార్యాలయం ఎదుట నిరసన



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

రాష్ట్రంలో జరుగుతున్న ఉపాధ్యాయుల బదిలీలకు జీరో సర్వీసును అనుమతించాలని, దొడ్డి దారిన జరుగుతున్న సెక్రటేరియట్ బదిలీలను వెంటనే ఆపివేయాలని యూఎస్‌పీసీ స్టీరింగ్ కమిటీ రాష్ట్ర బాధ్యులు ఏ.వెంకట్ డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ యూఎస్‌పీసీ ఆధ్వర్యంలో ఆదివారం విద్యాశాఖ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోర్టు కేసులు లేని స్కూల్ అసిస్టెంట్ తెలుగు, హిందీ, పీడీ పోస్టులను అర్హత గల ఉపాధ్యాయులతో భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఉపాధ్యాయ బదిలీ కౌన్సెలింగ్‌కు ముందు జీరో సర్వీసు కలిగిన ఉపాధ్యాయులందరినీ బదిలీకి అనుమతించాలన్నారు. 317 జీఓ ద్వారా సుదూర ప్రాంతంలో పనిచేస్తూ అనేక ఇబ్బందులు పడుతున్నటు వంటి ఉపాధ్యాయులను బదిలీలకు అనుమతించినట్టయితే వారికి ఎంతో కొంత ఉపశమనం కలుగుతుందని తెలిపారు. జిల్లాలో జరుగుతున్న పదోన్నతులు, బదిలీల జాబితా తయారీలో పారదర్శకత పాటించాలని కోరారు. ఒకవేళ అక్రమాలు జరుగుతున్నట్లయితే తీవ్రస్థాయిలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు స్వామి, అశోక్, శ్రీనివాస్, వృకోధర్, రామేశ్వర్, సుగుణ, జాదవ్ శ్రీనివాస్, లక్ష్మణ్, కిష్టన్న శంకర్, విలాస్, సేవాసింగ్, ఉదరి నారాయణ, ప్రేమల, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

గురుద్వార్‌ను దర్శించుకున్న రాష్ట్ర ప్రజాప్రతినిధులు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

నాందేడ్ బహిరంగ సభ ఏర్పాట్లలో ఉన్న రాష్ట్ర ప్రజాప్రతినిధులు...సిక్కుల పవిత్ర స్థలమైన గురుద్వార్‌ను సోమవారం దర్శించుకున్నారు. వారికి గురుద్వార్ ప్రబంధక కమిటీ స్వాగతం పలికారు. శాలువాలు కప్పి సత్కరించారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యేలు బాల్కసుమన్, జోగురామన్న, షకీల్, సివిల్ సప్లై కార్పొరేషన్ చైర్మెన్ రవీందర్ సింగ్ ఉన్నారు.

13 జిల్లాల ఎస్జీటీ, భాషా పండితుల స్పౌజ్ బదిలీలు తక్షణమే చేపట్టాలి

- జీరో సర్వీస్ బదిలీలు అమలు చేయాలి
- 317 జీవోతో ఉద్యోగుల జీవితాలు చిన్నాభిన్నం
- టీచర్లకు ఇబ్బందులు పెట్టిన ఏ ప్రభుత్వం మనుగడ సాగించలేదు
- విద్యామంత్రి గారూ మా సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్లండి : టీఎస్పీటీఏ రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ షౌకత్ అలీ
- టీఎస్పీటీఏ ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద ధర్నా



నవతెలంగాణ-సిటీబ్యూరో

బ్లాక్ చేసిన 13 జిల్లాల ఎస్జీటీ, భాషా పండితుల స్పౌజ్ బదిలీల ఉత్తర్వులను తక్షణమే జారీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ రాష్ట్ర ప్రాథమిక ఉపాధ్యాయ సంఘం(టీఎస్పీటీఏ) రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు సయ్యద్ షౌకత్ అలీ, పిట్ల రాజయ్య విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆ సంఘం ఆధ్వర్యంలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన టీచర్లు ప్లకార్డులు ప్రదర్శించి హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్పౌజ్ బదిలీల కోసం ఖాళీలు లేవనే నెపంతో 2300 మంది ఉపాధ్యాయుల బదిలీలు చేయకుండా 13నెలలుగా పెండింగ్‌లో పెట్టారన్నారు. ఎస్జీటీలు ఉపాధ్యాయులు కాదా అని నిలదీశారు. రాష్ట్ర ప్రభుత్వం సెకండరీ గ్రేడ్ తత్సమాన క్యాడర్‌లను పక్కన పెట్టి కేవలం స్కూల్ అసిస్టెంట్‌లకు మాత్రమే బదిలీలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్కూల్ అసిస్టెంట్ల ఓట్లు పొందడానికే ఎస్జీటీలను నిర్లక్ష్యం చేశారని, రాష్ట్ర ప్రభుత్వం 65 వేల మంది ఎస్జీటీలు, 10వేల మంది భాషా పండితుల కుటుంబాలను నిరాశ పరిచిందని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో 65 వేల ప్రాథమిక ఉపాధ్యాయుల మద్దతు మీకు అవసరం లేదా అని ప్రశ్నించారు. జీవో 317 అమలు చేయడం ద్వారా తెలంగాణ రాష్ట్ర ఉద్యోగుల జీవితాలను చిన్నాభిన్నం చేసిందని, ముఖ్యంగా ఈ జీవో వల్ల 20 వేలకు పైగా ఉపాధ్యాయులు దినదిన గండంతో బతుకుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రస్తుతం జరగనున్న బదిలీలకు జీరో సర్వీస్ అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించని పక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కె.బిక్షపతి, బుర్ర నాగరాజు, ఎస్.నరేష్, గఫూర్, రంగస్వామి, లక్ష్మీకాంతా రెడ్డి, వెంకటరమణ పాల్గొని ప్రసంగించారు. ఈ ధర్నాలో 13 జిల్లాల స్పౌజ్ బాధిత ఉపాధ్యాయులు హాజరయ్యారు.

స్పౌజ్ బదిలీలకు అనుమతిచ్చారు... మాకూ ఇవ్వండి

- సీఎం కేసీఆర్‌కు రాష్ట్ర స్పౌజ్ ఫోరం విజ్ఞప్తి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఉపాధ్యాయ స్పౌజ్ బదిలీలకు అనుమతిచ్చినందుకు సీఎం కేసీఆర్, విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డికి స్పౌజ్ ఫోరం కృతజ్ఞతలు తెలిపింది. అదే తరహాలో మాకు చేయాలంటూ 13 జిల్లాల ఎస్‌జీటీ, ఎల్పీ, పీఈటీ ఉపాధ్యాయులు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు హైదరాబాద్ సోమాజి గూడలోని ప్రెస్‌క్లబ్‌లో స్పౌజ్ ఫోరం అధ్యక్షులు వివేక్, నాయకులు విజయలక్ష్మి, మాధవి, మమతా, షబానాబేగం తదితరులు విలే కర్లతో మాట్లాడారు. సాంకేతిక కారణాలతో 13 జిల్లాల్లో ఉపాధ్యాయ దంపతులకు బదిలీలు నిలిచిపోయాయని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్, ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు చొరవ ఫలితంగా ఉపాధ్యాయ దంపతులకు బదిలీ ఉత్తర్వులు వెలువడ్డాయని తెలిపారు. ఉద్యోగులైన దంపతులు ఒకే చోట ఉంటే మంచి ఫలితాలు సాధించగలమని ఆశాభావం వ్యక్తం చేశారు.

దంపతులైన ఉద్యోగులు ఒకే క్యాడర్ పనిచేసేందుకు వీలుగా మెమో 1655 తీసుకొచ్చినన విషయాన్ని గుర్తు చేశారు. విద్యాశాఖ మంత్రిని కలిసి తమ సమస్యలను పరిష్కరించాలని కోరామనీ, అందుకు సానుకూలంగా స్పందించారని తెలిపారు. 13 జిల్లాల్లో స్పౌజ్ బదిలీల కోసం 2001 కుటుంబాలు గత ఏడాది కాలంగా ఎదురు చూస్తున్నామనీ, ప్రభుత్వం కేవలం 615 మంది స్కూల్ అసిస్టెంట్ క్యాడర్‌లో మాత్రమే అనుమతించారని ఇచ్చారని గుర్తు చేశారు. ఎస్జీటీ క్యాడర్ పోస్టులు ప్రతి జిల్లాలోనూ ఖాళీలున్నాయనీ, ప్రస్తుతం జరుగుతున్న ప్రమోషన్ల ప్రక్రియ ద్వారా ఎస్జీటీ పోస్టులు పెద్ద సంఖ్యలో ఖాళీలు ఏర్పడుతున్నాయని స్పష్టం చేశారు. ఎస్జీటీ, భాషా పండితులు, పీఈటీ స్పౌజ్ బదిలీలకు అనుమతించి న్యాయం చేయాలని కోరారు.

ప్రయివేటు కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలి

- డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేశ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కోచింగ్‌ల పేరిట వేలాది రూపాయలు వసూలు చేస్తున్న ప్రయివేటు కోచింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేశ్ డిమాండ్ చేశారు.

ఆదివారం నారాయణగూడలో డీవైఎఫ్ఐ నగర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లో గ్రూప్ 1,2,3,4, ఎస్ఐ, కానిస్టేబుల్ ఇతర పోటీ పరీక్షల శిక్షణ పేరిట విపరీత దోపిడీ జరుగుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. కనీస నిబంధనలు పాటించకుండా, ఫైర్ సేఫ్టీ లేకుండా. ఇరుకు గదులు, ఫంక్షన్ హాల్స్, ఇతర ప్రాంతాల్లో నిర్వహిస్తున్న తీరును వివరించారు. కనీసం తాగడానికి నీళ్లను కూడా అందుబాటులో ఉంచడం లేదనీ, టాయిలెట్స్ లేకుండా కోచింగ్ సెంటర్లు నడుపుతున్నారని తెలిపారు.

అలాంటి వాటిపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, ఎమ్‌డి.జావీద్, జిల్లా నాయకులు రవి, శృతి, హస్మిబాబు,భానుప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

ఎర్రజెండా

చిటపటల ధోరణికి
రెపరెపల నినాదమై
సమస్యల తీరుపై
నిరంతరం ఎగురుతూనే వుంటది

సగటు బతుకుల వేటుపై
జనజీవన సమైక్యతకై
అట్టడుగున పడిపోయిన
విలువలకు ఊతమౌతాది

ధరాఘాతపు అగాధంలో
మాయాజాల మార్మికాలను
ఏమార్చిన ఏలికల తీరుబడిపై
ఎర్రజెండా ఏకరువు

విప్లవ గీతమై ప్రజ్వలిస్తది

సమసమాజ నిర్మాణానికై
సమానత్వ సమన్వయానికై
అసమానతల రూపురేఖలపై
చైతన్యపు కిరణమై
విరుచుకు పడుతుంటది

ఎర్రజెండా సాక్షిగా
ఎలుగెత్తే ప్రతి నినాదం వెనుక
ఒక చీకటి కోణం
బద్దలౌతూనే వుంటది

మాటల గారడీల విన్యాసాలకు
ఎత్తుకు పై ఎత్తుల ఇంద్రజాలాలకు
ఉత్తుత్తి ఉపన్యాసాల
మభ్యపెట్టే ధోరణీల పాలిట
ఉక్కు పిడికిలై బిగుసుకుంటది

ఎర్రజెండా ఎగిరిన చోట
ఎర్రబడిన కళ్ళ నుంచి
ఒక పరిష్కారం ద్రవిస్తాది
ఒక సమన్యాయం ఉద్భవిస్తాది

- నరెద్దుల రాజారెడ్డి
9666016636

ఏకాంత మనో సంభాషణల 'డియర్ జిందగీ'

'థూ దీనె... జీవితం, దీనెబ్బ జీవితం...' ఆధునిక కాలంలో మనిషి ఎక్కువ తిట్టుకుంటున్నది ప్రభుత్వాల్నో, రాజకీయ నాయకుల్నో కాదు. తనతో తనకు సమన్వయం కుదరని జీవితాన్నే ఎక్కువగా తిట్టుకొంటున్నాడు. గ్రౌండులేని పాఠశాల కిటికీ చువ్వల మధ్య చిక్కుకొన్న బాలుడు నుంచి రెంట్, ఇంటరెస్ట్, ఈ.ఎం.ఐల భారంతో చెమటోడుస్తున్న వేతనజీవిదాకా అందరికీ జీవితంతో అంతర్యుద్ధం జరుగుతూనే వుంది. మరి ఈ కల్లోల కాలంలో శాంతి చర్చల బాధ్యతలెవరివి? ఖచ్చితంగా రచయితవే. 'బతుకు' బురదలో ఇరుక్కు పోతూ 'జీవించడా'న్ని అందుకోలేకపోతున్న తరుణాలే అందరివి. ఇటువంటి జీవితాలతో పొసగక 'అసలు జీవితమంటే ఏమిటి? వాస్తవానికి అదేలా ఉండాలి? మనకు దానికి మధ్యన ఎందుకంత రాపిడి?' అంటూ తనతో తాను జరిపిన మనో సంభాషణల్ని లేఖల రూపంలో 'డియర్ జిందగీ' కవిత్వంగా రచించారు మెర్సీ మార్గరెట్.

ఆధునిక తెలుగుసాహిత్యంలో తనదైన శైలి ఏర్పరు చుకుంటూ ప్రయాణిస్తున్న యువ రచయితల్లో మెర్సీ మార్గరెట్ ఒకరు. 'మాటలమడుగు'తో రచనారంభం చేసి 'కాలం వాలిపోతున్న వైపు' వంటి కవితా సంపుటాలతో పాఠకాదరణ పొందారు. ఫలితంగా 2017లో 'కేంద్ర యువపురస్కార సాహిత్యం' అందుకొన్నారు. ఒకవైపు రచనలు చేస్తూనే మరోవైపు ఏ కవితా గోష్ఠులు, కవి సంగమాలు రచయితగా ఎదగడానికి దోహదపడుతు న్నాయో అలాంటి వాతావరణం తనవంతుగా వర్తమాన రచయితలకు అందిచే ప్రయత్నాలు చేస్తుంది. 'దర్శన' ద్వారా రచయితలతో ముఖాముఖిలు, 'క్రియేటివ్ థియేటర్' అజయ్ మంకెనపల్లితో కలిసి రవీంద్రభారతి వేదికగా నాటకాలకు ప్రోత్సాహంగా నిలవడం వంటి కార్యక్రమాలు సైతం నిర్వహిస్తుంది.

'డియర్ జిందగీ' 43 లేఖలతో కూడుకొన్న కవిత్వం. తెలుగులో అన్ని కాలాల్లోను లేఖాసాహిత్యం వచ్చింది. అందివచ్చిన ఆధారాలను బట్టి చూస్తే 'సుహృల్లేఖ' మొదలుకొని చలం 'ప్రేమలేఖలు', గోపీచంద్ 'పోస్టు చేయని ఉత్తరాలు' వయా కుప్పిలి పద్మ 'అమృత వర్షిణి', 'ఎల్లో రిబ్బన్స్' నిన్నమొన్నటి కడలి సత్యనారాయణ 'లెటర్స్ టూ లవర్' వరకు తెలుగులో లేఖాసాహిత్య పరంపర కొనసాగుతూ వచ్చింది.

జీవితంలో అన్ని వేళలా ఒకేవిధమైన భావస్థితిని కలిగి ఏ మనిషి ఉండలేడు. సుఖ- దుఃఖ డోలనాలు సహజమైనవి. సంతోషంలో కలిగితే 'నిబిడాశ్చర్యంతో నింగికి... బాధలో ఎదురైతే 'నెత్తురు కక్కుతూ నేలకు... జారిపోయే పరిస్థితులు ఉంటాయి. అటువంటి నిరాశల్లో కురుకుపోయినప్పుడు జీవితం పట్ల ధైర్యం సన్నగిల్లి నప్పుడు ఏవో ఫిలాసఫీలు అందించే సహకారం కంటే తనకు తాను చేసుకొనే ఆత్మ ప్రోత్సాహం (Self-motivation) చాలా దృఢమైనది. ఇదే విషయాన్ని మెర్సీ లేచి ముఖం కడుక్కో రెండు కదిలించే వాక్యాలని తిను. శక్తి తెచ్చుకో... నా చేతిని వెలుగుతో కాల్చుకొచ్చా ఇప్పుడది కాగడా మనకి. ఇక మనం తడబడొద్దు అంటూ తిరిగి జీవితంతో భుజం కలపమంటున్నారు.

మత సంప్రదాయాల రీత్యా చూసుకొన్న, డార్విన్ సిద్ధాంత రీత్యా చూసుకొన్న ప్రస్తుతం ఉన్న మానవుడి జీవితం మును పటికంటే ఉన్నతమైనదే. ఎవో కొన్ని అలజడులను భూతద్దం లో పెట్టుకొని చూస్తూ జీవితాన్ని ఆస్వాదించే సోయిని కోల్పోతున్నాం. మనసు పెడితే జీవితంలో కన్నీరుని కూడా ప్రేమించవచ్చు. ఇదే భావనతో మెర్సీ **"ఎవరన్నారు ఎడవద్దని? ఏడువు గుండె బరువు దిగిపోయేదాకా ఏడువు. కావాలా? భుజంపై తలవాల్చుకొని ఏడ్చేయ్. కళ్ళ తలుపులు తేటపడు తాయ్. శ్వాసమీద ఘనీభవించిన బరువు మెల్లిగా కరిగిపోతుంది. ఆకాశం కింద ఏదైనా పవిత్రమైనదుందా? అంటే అది కన్నీరే జిందగీ"** అంటూ అశ్రుధారలో కూడా ఆనందం వెతికే స్థాయిప్రేమను జీవితమంపై వ్యక్తపరిచారు.

మనిషి ఎక్కువగా నలిగిపోయేది కష్టాల తోనో నష్టాలతోనో కాదు. తనలో తనకు రేగే భావ గాఢతల వాళ్ళ ఏ భావాన్ని ఎంతవరకు, ఎక్కడివరకు తీసుకో వాలన్న స్పష్టత కొరవడింది. వాటివల్లే అసలు సమస్య ఎక్కువవుతుంది. ఆ గందరగోళం గురించి మెర్సీ.. "ముఖాన్ని గుండెల్లో నాటుకొంటారు కొందరు. మెదుడులో నాటుకొంటారు కొందరు. ఎదురైనా జ్ఞాపకాన్ని నేను హృదయంలో లోలోతుల రక్తపు జల ఊరే దగ్గర దాచుకొంటాను నేను. జిందగీ దాచుకోవడం ఒక కళ"గా పేర్కొంటున్నారు.

ప్రతి కాగితంలో కవిత్వాన్ని సంగీతం లా ఆస్వాదిద్దాం.., కాలం దయలేనిది కసాయిది గుండె మీద పచ్చబొట్టు నిర్దయగా పొడిచి గుర్తుచేసుకోకుండా బతికేయమంటుంది... ఓ పాత జ్ఞాపకం నా గది ముందు గిటార్‌తో నిలిచి ఉంటుంది... రా జిందగీ తలుపులు మూయబడే లోపు చాలా పనులు చక్కబెట్టుకోవాలి... కాగితాల నడుమ కొన్ని కన్నీళ్లను ఒంపి దాచి పెడుదాం... కన్నీళ్ల మనిషి చుట్టూ సజీవంగా తొణికిస లాడే ఉమ్మనీళ్ళు మొదలైన పద చిత్రాల వంటి వాక్యాలు కవితా ప్రేమికులను ఆక ట్టుకొంటాయి. ఇవే కాక మనుషులు మాట్లాడు కోలేని పరిస్థితులు, గాయాల్ని, జ్ఞాపకాల్ని దాచుకో వాలనే మమత, ప్రకృతి అందించే ఉత్తేజం, మానవ సంబంధాల్లో కలుగు తున్న డిజిటల్ కాలుష్యం, నిద్రరాని రాత్రిళ్ళు మనతో మనం జరిపే మోనోలాగ్స్... మొదలైన వాటి గురించి మెటా ఫర్లతో కూడుకొన్న గట్టి గింజల్లాంటి కవితాలేఖలు ఉన్నాయి.



వాస్తవానికి ఏదో కొత్త పుస్తకం వచ్చిందన్న వేడిలో కాకుండా కొంతకాలం పాఠక సమాజంలో మాగినాక తర్వాత ఆ పుస్తకం విలువని లెక్కగట్టాలి. ఏ రచనకైనా పాఠకులే అంతిమ నిర్ణీతలు. ఆ కాల పరీక్షలో నెగ్గి పాఠకులతో పాస్ మార్కులు వేయించుకోగల రచనల కోవలో ఈ 'డియర్ జిందగీ' నిలుస్తుందనడంలో ఎటువంటి సందేహంలేదు.



'నిజానికి ఎవరి జీవితంతో వారైనా సరే సంభాషిం చుకోవాలంటే జీవన గణితం తెలిసుండాలి' అంటూ కుప్పిలి పద్మ గారి ముందుమాట విలువైనది. మెర్సీ నిరాశలో ఉన్న పుడు తోడు నిలిచిన మిత్రుడు హరి కృష్ణ బండారుకి న్యాయమైన అంకితమే ఇచ్చిందని చెప్పాలి.

ప్రతి పాఠకుడికి తనదైన పుస్తకం ఉంటుంది. ప్రతి పుస్తకానికి తనదైన పాఠకుడు ఉంటారు. ఈ పుస్తకం అన్ని వర్గ సహృదయ పాఠకులను ఆకట్టుకోగలదు. అలాగే ఈ 'డియర్ జిందగీ' కవిత్వానికి సాఫ్ట్ టార్గెట్ పాఠకులు కొందరు ఉన్నారు. తొందర గా ఇంటికి వెళ్ళాల్సి వుండి ట్రాఫిక్‌లో ఇరుక్కున్న మహిళా ఉద్యోగి, సంపా దిస్తున్నా పెళ్ళి చేసుకోవడంలో అభద్ర తాభావం ఎదుర్కొంటున్న టెకీ, మంచి సంబంధాల కోసం కొడుకు జీతాన్ని 'రౌండ్ ఫిగర్' చేసి చెప్పే తల్లి, పిల్లలకి ఉన్నత జీవితమివ్వడానికి జీతం చాలక జాబ్‌తో పాటు పార్ట్ టైం జాబ్‌లో కూడా నలుగుతున్న తండ్రి, సొంత నివాసం నుంచి వనవాసం ఎదుర్కొంటున్న వృద్ధులు... ఇలా మెట్రోపాలిటన్ సిటీలో అసహనపు గడియలు అను భవిస్తున్న వారంద రికీ మోనోలాగ్‌లా ఉంటుంది. ఒంటరి తనాన్ని ఏకాం తంగా మార్చుకొని జీవితాన్ని ఆస్వాదించమని గురి చూసి చెప్పే కవిత్వం ఇది.

గొప్ప కవిత్వానికి నిర్వచానాలు 'కలాన్ని కత్తిలా... పెన్నుని గన్నులా...' ఇలా ఏవైనా ప్రమాణాలు ఉండొచ్చుగానీ మంచి కవిత్వమంటే మనిషి అసహనంతో ఉన పుడు ఒక ఊరట, పరిస్థితులు భారంగా ఉన్నప్పుడు ఒక బాసట, మనోసంఘర్షణ రేగినపుడు ఒక స్వాంతన, కాలాన్ని వెచ్చించినందుకు న్యాయం చేసే పదచిత్రాలు... వాటినే ప్రమాణంగా చెప్పుకోవచ్చు. వాస్తవానికి నేటి మెట్రో పాఠకులు అలాంటి సాహిత్యమే కోరుకుంటున్నారు. అటువంటి సాహిత్యం చదివే తమ 'యాంత్రిక', 'శూన్య' గాయాల నుంచి కోలుకుంటు న్నారు. మనస్తా పాల్లో ఆత్మహత్య ఆలోచనలు ఎక్కువ చేస్తున్న నేటి తరానికి జీవితం విలువని, వినియోగాన్ని సెంటర్ చేస్తూ రాసే ఇటువంటి కవిత్వం ఎంతైనా అవసరం.

వాస్తవానికి ఏదో కొత్త పుస్తకం వచ్చిందన్న వేడిలో కాకుండా కొంతకాలం పాఠక సమాజంలో మాగినాక తర్వాత ఆ పుస్తకం విలువని లెక్కగట్టాలి. ఏ రచనకైనా పాఠకులే అంతిమ నిర్ణీతలు. ఆ కాల పరీక్షలో నెగ్గి పాఠకులతో పాస్ మార్కులు వేయించుకోగల రచనల కోవలో ఈ 'డియర్ జిందగీ' నిలుస్తుందనడంలో ఎటువంటి సందేహంలేదు. చివరగా ఈ 'డియర్ జిందగీ' కవిత్వం గురించి ఏకవాక్య తీర్మానంగా పేర్కొంటే 'నువ్వు ఎవరితోనైనా గలాట పెట్టుకో నీతో నీకొద్దు, ఎవరినీ ప్రేమించకుండానైనా ఉండు కానీ నీతో నువ్వు ప్రేమలో పడు'. ఇదే ఈ పుస్తకానికి ట్యాగ్ లైన్.

- బి. మదన మోహన్ రెడ్డి, 998989 4308.

సాహితీ వార్తలు

నేడు 'ఎదురీత' ఆవిష్కరణ

కె.శాంతారావు రచించిన 'ఎదురీత' పిల్లల కథలు నేడు సాయంత్రం 6 గం॥లకు హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రం షోయబ్ హాల్‌లో తెలంగాణ సాహితి ఆధ్వర్యంలో ఆవిష్కరించనున్నారు. తెలంగాణ సాహితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఆనందాచారి సభాధ్యక్షతన నిర్వహించే ఈ కార్యక్రమంలో సుప్రసిద్ధ నవలా రచయిత పి.చంద్రశేఖర్ ఆజాద్ పుస్తకావిష్కరణ చేయనున్నారు. వివరాలకు 9959745723, 8897765417 నంబర్ల నందు సంప్రదించవచ్చు.

రేపు పెళ్ళిపాటలు పుస్తకావిష్కరణ

జొన్నాభట్ల నరసింహశాస్త్రి రచించిన పెళ్ళిపాటలు (మంగళహారతులు) పుస్తకాన్ని జన్నాభట్ల నరసింహ ప్రసాద్ సంకలనం చేసి రేపు (జనవరి 31న) సాయంత్రం సాహితీ కిరణం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని శ్రీ త్యాగరాయ గానసభ కళావేదికపై ఆవిష్కరించనున్నారు. డా॥ అనంతలక్ష్మి అధ్యక్షతన నిర్వహించే ఈ సభలో డా॥ వోలేటి పార్వతీశం పుస్తకావిష్కణ చేయనున్నారు. కార్యక్రమానికి ఆచార్య ముదిగొండ శివప్రసాద్, గుదిబంది వెంకటరెడ్డి, పొత్తూరి సుబ్బారావు, పెద్దూరి వెంకటదాసు, జమ్మలమడక జయలక్ష్మి తదితరులు పాల్గొన నున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

కవి జయరాజు, కె శ్రీనివాస్‌లకు మఖ్దూమ్ జాతీయపురస్కారం

సిటీ కాలేజ్ మఖ్దూమ్ మొహియుద్దీన్ జాతీయ పురస్కర ప్రదానోత్సవం ఫిబ్రవరి 4 శనివారం ఉదయ10.30 గంలకు కళాశాల గ్రేట్ హాల్లో నిర్వహించనున్నారు. 2022 కుగాను జయరాజుకు, 2023కు గాను కె శ్రీనివాస్‌కు పురస్కారాన్ని ప్రదానం చేయనున్నారు. సిటీ కళాశాల ప్రిన్సిపాల్ డా.బాలభాస్కర్ అధ్యక్షతన నిర్వహించే ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా శాసనమండలి సభ్యులు గోరటి వెంకన్న, అతిథులుగా మీడియా అకాడమీ ఛైర్మన్ అల్లం నారాయణ, తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య తంగెడ కిషన్‌రావు, డా.యాకూబ్ పాల్గొంటారు.

కె రామచంద్రమూర్తి, కుప్పిలి పద్మలకు అరుణ్‌సాగర్ పురస్కారాలు

ప్రముఖ పాత్రికేయులు కె రామచంద్రమూర్తికి అరుణ్‌సాగర్ పాత్రికేయ పురస్కారం, ప్రముఖ కవయిత్రి కుప్పిలి పద్మకు అరుణ్‌సాగర్ సాహితీ పురస్కారం అందించనున్నట్టు అరుణ్‌సాగర్ ట్రస్ట్ నిర్వాహకులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఫిబ్రవరి 12న ఉదయం 10:30లకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలోని వీరభద్ర ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే కార్యక్రమంలో అందించనున్నారు. మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ అధ్యక్షతన నిర్వహించే ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, గౌరవ అతిథులుగా తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీ శంకర్, ప్రముఖ వాగ్గేయకారుడు గోరటి వెంకన్న హాజరుకానున్నారు.

కొలకలూరి పురస్కారాల గ్రహీతలు

2023 ఏడాదికిగానూ అందిస్తున్న కొలకలూరి పురస్కారాలను పలు విభాగాల్లో అందించనున్నారు. కొలకలూరి భాగీరథీ కవితా పురస్కారాన్ని యార్లగడ్డ రాఘవేంద్రరావు 'పచ్చికడుపు వాసన', కటుకోజ్వల ఆనందాచారి 'ఇక ఇప్పుడు'; కొలకలూరి విశ్రాంతమ్మ నాటక పురస్కారాన్ని ఆకెళ్ల వెంకట సూర్యనారాయణ 'ఆకెళ్ల నాటికలు'; కొలకలూరి రామయ్య పరిశోధనా పురస్కారాన్ని డా॥ ఎం. దేవేంద్ర 'తెలంగాణ కథ - వర్తమాన జీవన చిత్రణ', డా॥ ఎ.నాగేంద్ర 'రాచపాళెం సాహిత్య విమర్శ - సమగ్ర అధ్యయనం' లకు అందించనున్నారు. వివరాలకు 9441923172, 9963564664 నంబర్ల నందు సంప్రదించవచ్చు.

వీరే సఫాయి కార్మికులు

నిత్యం ఉదయం వీధుల్లో
విధి నిర్వహణలో ఉదయిస్తుంటారు
చెత్తాచెదారంతో ముద్దుముద్దుగా
ముచ్చటిస్తుంటారు..

నగరం నిద్రలేవగానే దర్శనమిస్తారు
దుమ్ము ధూళితో అస్పష్టంగా
సూర్యోదయం కంటే ముందే
వీధులను దర్శించుకుంటారు
అందుకే ఓ తల్లిగా ఆదరిస్తూ
చీపుర్ల ఊడ్పుతో నిట్టూర్పు సెగలతో
చెలరేగిన దుబ్బుతో అందరికీ
చేయూతకు చేరువై ఉంటారు

కరువు వచ్చినా
కాలం మారినా,కడుపు కాలినా
తప్పని తిప్పలు ఈ కార్మికులు
మైలపడ్డ వీధులన్నీ కొత్త వ్యాధులకు
దారితీసే దారుల్లో మురిపించే
విధంగా చేసి
ముప్పై ఏడేళ్ల విధి నిర్వహణలో
వీధులకు అంకితమై
అనుభవాల్ని,అనుబంధాల్ని పెంచుకొని
వీధులతో పంచుకొని వ్యాధులన్నీ తొలిగించే
డాక్టర్ గా తమలోని సహనంతో ఓర్పుతో
సాగుతారు..

స్వచ్ఛంగా వీధులన్నీ
పులకించిపోయేది
ఎందరు చీదరించుకున్నా
చీపురుతో సమాధానం
ఎందరు ఈసడించుకున్నా
చూపులతో సమాధానం
సహృదయ సంపన్నులు..

వీరివలనే ఓ కొత్తలోకం స్వచ్ఛత దేశం
ఏ చౌరస్తాలోనైనా చైతన్యగా కనిపిస్తారు
అస్తవ్యస్తమైన వీధులన్నీ
స్వచ్ఛంగా మారుతాయి
మానసికంగా మధనపడే వీధులన్నీ
అంతరంగమంతా ఓ కాంతిమయమే
ఓ కాంతి పుంజమే

వీరిని ఎంత ప్రశంసించినా తక్కువే..
తెలియని లక్ష్య సాధనవైపే..
అకుంఠిత మనోదీక్షకు నమస్కరించాలి
అసలైన సేవాతప్తహృదయాలు
నిత్యం ఓ ఉక్కు సంకల్పబలంతో
అనునిత్యం యుద్ధానికి సిద్ధంగా ఉంటారు

దిగజారిన దారుల్లో నైనా
ఎన్ని ప్రతిబంధకాలు ఎదురైనా
సమగ్ర ఆయుధాలతో సాగుతారు
అందుకే వీరిలోనే స్వచ్ఛత
వీరిలోనే అందమైన ఊహలు
నిండుకున్నాయి
ఒక్కరోజు వీరు వీధుల్లోకి వెళ్లకపోతే
రోజురోజుకు రోడ్లపై కొత్తపోకడతో
కుళ్ళు కుతంత్రాల చెత్తాచెదారం
నిండుతుంది
నిత్యమనుషులను కలుషితం చేస్తాయి
మురికితనంతో ఉరకలేస్తాయి
దుర్భర దుర్వాసనతో నిండిపోతాయి
నిజమైన నగర సేవకులు
ఈ కార్మికులు!!..

- అంబటి నారాయణ
7386699113

ఎండమావిలో ఈత

రెండు కాళ్లు, రెండు చక్రాలు, నాలుగు చక్రాల నుండి
రెక్కల విమానం మీదగా...!
మనిషి కాని మనిషిలోకి నడుస్తున్నామా?
కొత్త మానవుడు వాడు
అయినా
అడుగుల్ని లెక్కలేసుకొని మెతుకుల్ని ఏరుకొనే ప్రయాణం మొదలు
మేఘాల్లో సెల్ఫీ దాకా ఆకలి పొట్లమే కదా విప్పుతాము
బౌండరీ దాటని బంతిలా ఓ ఆలోచన అపుడపుడూ
కపాళం గోడల్ని బద్దలు కొడుతుంది

సిగ్నల్ పడింది
ఆయువు అరవైకి పడిపోయినట్లు అక్కడినుండే మొదలైంది కౌంట్
60,59,58,57,56,55....
నా కాళ్ల చక్రాలకు, నగరం రహదారులకు అనదికారిక పరుగు పందెం

సుదీర్ఘమైన సంచారం
విచారవదన సన్నివేశాల్లో ఇష్టంలేని సహాయక పాత్రల నడుమ దుఖించడం
కూడా నటించడమే అవుతుంది
క్లైమాక్స్ దాకా రీటేక్ ఉంటే బాగుండనిపిస్తుంది
నవ్వుని నవ్వులాగే నవ్వడానికి
శోకాన్ని శోకంలాగే శోకించడానికి

ఏవో చేసేసాం అనుకొని ఎన్నో దాటేసామని ఓ అర్ధరాత్రి రోడ్డు పక్కన సిటీ లైట్ వెలుగులో....
ఏమీ చేయలేకపోయాము, ఏదీ దాటలేకపోయామనే నిర్వేదనలో అదే అర్ధరాత్రి,
ఆ రోడ్డు పక్కనే సిటీ లైట్ వెలుగులో
ఓ సిగరెట్టుని ఆస్వాదిస్తాము, ఓ టీ ని స్వాగతిస్తాము
దూరంగా చిగురాకుమందం గాలి చిత్తు కాగితాలను పాత్య గ్రంథాల్లా ఎగరేస్తుంది
వాటినేరుకునే నడి వయసు ఆడమనిషి జుట్టు రాగిలీగ రంగులో మెరుస్తుంది,
నాట్యంలా రేగుతుంది. ఆ క్షణానికి అదే దృశ్యకావ్యం
మన పక్కగా వచ్చి నిల్చున్న కుక్కపిల్ల కొత్తగా స్నేహలతని అల్లుతుంది
మిగిలిపోయిన ఆఖరి అగ్గిపుల్ల మనతో కాసేపు సంభాషిస్తుంది
కొత్త గీతని బోధిస్తుంది , శోధిస్తుంది ఎంతోకొంత మనల్ని మండిస్తుంది

మిగిలేవి ఇవే!
చివరికి మిగిలేవి కూడా ఇవే!
మధ్యన మనం నడిచేవి, దాటేవి, ఈదేవి ఎండమావి కాలవలేనని కొంత
ఆలస్యంగా తెలుసుకొని నవ్వుకుంటాము
అంతే.........!!

- వెంకటేష్ పువ్వాడ, 7204709732

హేతువాద ఉద్యమాద్రి రావిపూడి


నివాళి



- కె శ్రీనివాసాచారి, 7780664115
ఉపాధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర హేతువాద సంఘం

హేతువాద, మానవవాద తత్వవేత్త రావిపూడి వెంకటాద్రి మరణం మానవాళికే తీరని లోటు. ఎందుకంటే "హేతువాదం" అనే ఒక్క పదంపైన ఆయన రాసినంత విస్తృతంగా, లోతుపాతులతో - వాసిలోనే కాదు, రాశిలోనూ విస్తారంగా రాసిన రచయిత, నిత్య గమనశీల కార్యకర్త వెంకటాద్రి కాకుండా ప్రపంచంలో మరెవ్వరూ లేరు. వారు హేతువాద ఉద్యమానికి మానవవాద మలుపును ఇచ్చిన తాత్వికులు. కేవలం హేతువాదం అంటే నాస్తికత్వం అని, ప్రతి విషయాన్ని నిర్ధ్వందంగా వ్యతిరేకించే వారని, మూఢనమ్మకాల నిర్మూలనకు మాత్రమే పరిమితమైనవారని అప్పటివరకు ఉన్న అపోహను, అపార్థాలను తొలగించడం కోసం వారు పడ్డ "శ్రమ" అసామాన్యమైనది. రచయితగా, కార్యకర్తగా, ఉద్యమ సారథిగా, పబ్లిషర్‌గా ఇలా రావిపూడి వెంకటాద్రి అనేక ఇబ్బందులతో అనేకమైన బాధ్యతలు దశాబ్దాలుగా మరణానికి 20 రోజుల ముందు వరకూ నిర్వహిస్తూనే వచ్చారు.

రావిపూడి వెంకటాద్రి ఫిబ్రవరి 9,1922 జన్మించారు. 1943 ఏప్రిల్ 5న కవిరాజాశ్రమం - నాగండ్లలో స్థాపించి, 1946 నుంచి హేతువాద మానవవాద రచయితగా, ఉపన్యాసకులుగా కొనసాగారు.



1956-96 మధ్య నాగండ్ల గ్రామ సర్పంచ్‌గా గ్రామస్తుల కోరిక మేరకు పని చేశారు. 1979 - 1989 మధ్య ఆంధ్రప్రదేశ్ హేతువాద సంఘ వ్యవస్థాపక అధ్యక్షులుగానూ భారత హేతువాద సంఘ అధ్యక్షులుగా పనిచేశారు. తానే వ్యవస్థాపకుడిగా ప్రారంభించిన మాస పత్రిక "హేతువాది"కి 1982 సెప్టెంబరు నుంచి 2023 జనవరి వరకు ప్రధాన సంపాదకులుగా ఉన్నారు. అంతేకాకుండా హేతువాద మానవవాద ఉద్యమానికి ఒక చిరునామా కోసం 1991లో రాడికల్ హ్యూమనిస్ట్ సెంటర్, ఇంకొల్లులో స్థాపనకు మార్గదర్శిగా నిలిచి ఉద్యమకారులకు ఒక గొడుగుగా మారారు. అమెరికా, యూరప్‌లలో పర్యటించిన అంతర్జాతీయ హేతువాది, రావిపూడి వెంకటాద్రి. 1993లో "హేమా పబ్లికేషన్స్" స్థాపించిన ఆయన ఇప్పటి వరకు 200 పుస్తకాలు ప్రచురించారు. అందులో వంద పుస్తకాలు తనవి కావడం ఒక విశేషమైతే తోటి ఉద్యమకారులను రచనా వ్యాసంగం వైపు మళ్ళించి వారి రచనలకు అవసరమైన సూచనలు చేసి, స్వయంగా తానే ప్రూఫులు దిద్ది పుస్తకాలు ప్రచురించడం మరో విశేషం.

పేరు కోసం ప్రాకులాటలు, అవార్డుల కోసం ఆరాటం ఎంతమాత్రం లేని వెంకటాద్రికి 1996లో కవిరాజు త్రిపురనేని ట్రస్టు నుంచి కవిరాజు త్రిపురనేని రామ స్వామి స్మారక జీవిత సాఫల్య అవార్డుతో మరెన్నో అవార్డులు వరించాయి. 1999లో ముంబాయిలో జరిగిన అంతర్జాతీయ మాన వవాద నైతిక సంఘ అంతర్జాతీయ సదస్సులో "బుద్ధుడు- హ్యూమనిస్ట్ దృక్పథం" అంశం మీద ఉపన్యాసం చేసి అంతర్జాతీయ వేదికలపై ఎందరినో ఆలోచింపజేశారు.

వందలాది అధ్యయన తరగతుల్లో ఉపన్యాసకు లుగా, పర్యవేక్షకులుగా శిక్షణ ఇచ్చిన ఉద్యమ మార్గదర్శి రావిపూడి. హేతువాద, మానవవాద సాహిత్యం పరిచయ మయ్యాక, యం.యన్.రాయ్ భావాల ప్రభావంతో వచన రచనకు ఉపక్రమించాడు.

"అనంత విశ్వం" పేరుతో ఐదు భాగాల పుస్తక రచ నను ఆరంభించి "విశ్వాన్వేషణ" "విశ్వతత్వం" గ్రంథాలు పూర్తి చేశారు. విశ్వాన్వేషణ గ్రంథ రచనతో ఆరంభించి "పురాణం - ధృవుడు", "జీవమంటే ఏమిటి?", "మార్క్సిస్టు భౌతిక వాదం", "మానవుడు- సమాజం- ప్రకృతి" తదితర హేతువాద మానవవాద గ్రంథ రచనలను యుక్త వయసులోనే పూర్తి చేసి ప్రచురించాడు. ఎం.ఎన్.రాయ్ - భారత కమ్యునిజం, శాస్త్రం - అశాస్త్రం, ఆది శంకరా చార్య వ్యక్తిత్వం - తత్వం, మార్క్సిజం, హ్యూమనిజం, నాస్తికత్వం, ఔనా! వేదాల్లో అన్నీ ఉన్నాయా?, మత జాఢ్యాల మచ్చు తునకలు, మనుస్మృతి మైనస్ అశుద్ధం, హ్యూమనిస్ట్ సమీక్షలు, వాస్తువు శాస్త్రమా?, అడుగు జాడలు, మనం ఏమి చేయాలి?, స్వామినేని - త్రిపురనేని, హేతువాదం - నైతిక విప్లవం, నేను నా రచన వ్యాసంగం... ఇలా వారి రచన వ్యాసంగం కొనసాగింది. తన చాలా పుస్తకాలను ఇంగ్లీషులోకి అనువాదం కూడా చేసుకున్నారు.

నిజానికి వెంకటాద్రి గొప్పతనం ఏమిటంటే వారు నిరంతరం తనకు ఉన్న జ్ఞానస్థాయిని అప్డేట్ చేసుకుంటూ జీవితాంతం హేతువాద, మానవవాద ఉద్యమానికి లైట్ హౌస్ గా వేలాది మందికి స్ఫూర్తిని కలిగించారు, ప్రేరణ రగిలించారు. ఆయన కలం తాకని అభ్యుదయ అంశం లేదంటే అతిశయోక్తి కాదు. ఆయన వ్రాసిన రచనలు దాదాపు 7000 పేజీల ప్రింట్ రూపంలోని సాహిత్యం రాడికల్ హ్యూమనిస్ట్ సెంటర్ - ఇంకొల్లు ప్రాంగణంలో ఉంది. ఆయన భౌతికంగా మన మధ్య లేకున్నా "ప్రపంచ భావగమన చరిత్ర"లో ఆయన మస్తిష్కం వెలువరించిన భావాలు చిరంతరంగా నిలిచే ఉంటాయి.

బక్రా

విలువలు ఆదర్శాలు బోధించాలని
గొప్ప గొప్ప కొటేషన్లు గుప్పించి
ఉపన్యాసం తయారు చేసుకున్నాను
మైక్ ముందు నిల్చుని మొదటి వాక్యం వినిపించగానే
'దిగిపో దిగిపో' అన్న అరుపులతో హాలు దద్దరిల్లింది
నా చేతిలోని కాగితాలను ఎవడో లాగేసుకున్నాడు
నాకు నేనే డూప్‌నని అనిపించసాగింది
అయినా ఆదర్శవ్యక్తి పాత్రలో జీవించటానికే ప్రయత్నించాను
కాని 'నటించు నటించు' అని ఒకటే లొల్లి
ఇటు హీరోను కాక, అటు విలన్ను కాక
జోకర్‌గా మిగిలిపోయాను
హాలులో ఉన్న నూరు మందికి నేనొక్కణ్ణే టార్గెట్
కుళ్ళిపోయిన టమాటాలతో నన్ను కొట్టసాగారు
దెబ్బతిన్న ఇగోతో స్టేజి దిగి
ఆ నూరు మందిలో కలిసిపోయాను
....
ఇప్పుడు ఎవడో ఒక బక్రాగాడు వస్తాడు స్టేజి పైకి
కుళ్ళిపోయిన టమాటాలతో నేను కూడా సిద్ధంగా ఉన్నాను

- అమ్మంగి వేణుగోపాల్, 9441054637

నానీలు

ఇద్దరి మధ్య
గొడవ మామూలే
తర్వాతి నిశ్శబ్దమే
భయంకరం

కలంలోంచి
పువ్వులు రాలుతున్నాయి
మొక్కలు మాత్రం
మనసులోనే

పెన్ను
రెండు రూపాయలదే
రాలిన అక్షరాలు మాత్రం
అమూల్యం

మా పాత టీవి
నాన్న బహుమతి
తీయలేను
పెట్టుకోలేను.

ఒంటరితనం
చాలా బరువు
ఒక రకంగా అది
జీవితానికి గురువు


ఓడిపోయావా?
బాధపడకు
గెలుపుకది
తొలి మెట్టు మరి!

మాటలు
మంచిగానే వున్నాయి
మనసులోనే
కనిపించని మలినం

రాయి కూడా
పాఠం చెబుతుంది
తాను వ్యర్థం కాదని
శిల్పం దాగుందని

అతడు
నిత్య సంతోషి
జేబుకన్నీ చిల్లులే
చిరునవ్వయితే చెరగదు.

- ఎన్. లహరి
9885535506



ఎండుతున్న పైరు



నవతెలంగాణ-కల్లూరు

రబీలో వరి సాగు చేసిన పైరు సాగు నీరందక్క ఎండిపోతుందని సాగునీరు అందించి పంటను కాపాడాలంటూ ఆయకట్టు రైతులు అధికారులను వేడుకుంటున్నారు. కల్లూరు పెద్ద చెరువు నిండా సాగునీరున్న తూము షటరు మరమ్మతులకు గురైంది. ప్రత్యమ్నాయ మార్గాల ద్వారా సాగునీరు అందించి పంటను కాపాడాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయంపై ఎన్ఎస్పిడిఈ రత్నాకర్ ను వివరణ కోరగా తూము షటర్‌కు మరమ్మతులు చేయడానికి వీలు లేకనే చేయలేదని రైతుల నష్టం నష్టపోకుండా ఉండేందుకు అలుగు కాలువ ద్వారా సాగునీరు సరఫరా చేస్తున్నామని అన్నారు. ప్రస్తుతం సాగర్ నీరు మూడో జోన్‌కు సరఫరా చేస్తున్నామని, ఒకటి రెండు రోజుల్లో సరఫరా అవుతుందని రైతులకు అందిస్తామని తెలిపారు.



విద్యా, వైద్యం, ఉపాధికి బడ్జెట్ పెంచాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు

నవతెలంగాణ-ఖమ్మం

కేంద్ర బడ్జెట్‌లో ఉపాధి, రాష్ట్ర బడ్జెట్లో విద్యా, వైద్యం, ఉపాధికి బడ్జెట్ పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం ఖమ్మంలోని సుందరయ్య భవన్లో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఖమ్మం జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం మెరుగు సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో అయన మాట్లాడుతూ వ్యవసాయ కార్మికులకు ఉపాధి పెంచాలని, కేంద్ర బడ్జెట్లో రెండు లక్షల అరవై మూడు వేల కోట్లు కేటాయించాలని, ఉపాధి పనిని కార్పొరేషన్, మున్సిపల్ పట్టణాల్లో, విస్తరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఉపాధి పనిని రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందని అందులో భాగంగానే కుల విభజన, కొలతల పద్ధతి, తెచ్చి స్వచ్ఛందంగా ఉపాధి కూలీలే పనికిరాకుండా చేయడం కోసం కేంద్ర ప్రభుత్వం పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కూడా లేకుండా చేస్తుందని ఆయన విమర్శించారు. రోజు కూలి రూ.600 ఇచ్చి సంవత్సరంలో 200 రోజులు పని కల్పించాలని, తక్షణం పని ప్రదేశాల్లో ఉపాధి చట్టంలో పేర్కొన్న అన్ని సౌకర్యాలను చేకూర్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా, వైద్యంకు బడ్జెట్లో 30 శాతం కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. కేరళ తరహాలో పట్టణ ప్రాంతాల్లో ఉపాధి పనికి రాష్ట్ర ప్రభుత్వం కూడా 20వేల కోట్లు కేటాయించాలని, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని పేదలందరికీ, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, స్థలం ఉన్న వారికి ఐదు లక్షల సాయం, 57 సంవత్సరాల నిండిన వారందరికీ వృద్ధాప్య పెన్షన్ 5 వేలకు పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా నాయకులు ఎర్ర శ్రీనివాస్, పి సంగయ్య, కేవీరెడ్డి, వడ్లమూడి నాగేశ్వరరావు, వత్సవాయి జానకి రాములు, బంధం రాజ్యం, గద్దల రత్తమ్మ, తన్నేరు కృష్ణార్జునరావ్, టీ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ పార్లమెంటరీ సమావేశంలో రవిచంద్ర

నవతెలంగాణ-ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు, బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కె. కేశవరావు ఆదివారం ప్రగతి భవన్ లో నిర్వహించిన పార్టీ పార్లమెంటరీ సమావేశానికి లోక్ సభ పక్ష నేత నామ నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర హాజరయ్యారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 31వ తేదీ నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో.. పార్లమెంటులో బీఆర్ఎస్ పార్టీ పరంగా అనుసరించాల్సిన వ్యూహం, విధానాలపై పార్టీ అధినేత, ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర రావు ఎంపీలకు దిశా నిర్దేశం చేశారు. సీఎం కేసీఆర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నామ, రవిచంద్రతో పాటు జోగినపల్లి సంతోష్ కుమార్, దీవకొండ దామోదర్ రావు, బండి పార్థసారథి రెడ్డి, బడుగుల లింగయ్య యాదవ్, కే.ఆర్.సురేష్ రెడ్డిలతో పాటు లోక్ సభ ఎంపీలు పాల్గొన్నారు.



అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం జిల్లా నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-ఖమ్మం

అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం ఖమ్మం జిల్లా కార్యవర్గాన్ని ఆదివారం ఖమ్మంలోని మంచికంటి భవన్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా డాక్టర్ యలమంచిలి రవీంద్రనాద్, కె.శరత్ బాబు, సమన్వయ ప్రధాన కార్యదర్శిగా గడల భాస్కర్ రావును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షవర్గం జి.రఘుపాల్, రాష్ట్ర సమన్వయ కార్యదర్శి కె.వి.ఎల్ మాట్లాడుతూ ప్రపంచంలో యుద్ధోన్మాద శక్తులు ప్రబలుతున్నాయని, వాటిని అడ్డుకోవటానికి అన్ని దేశాలలోని శాంతి కాముకులు ఐకమత్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. దేశంలో కూడా మతోన్మాదం పేట్రే గిపోతున్నదని దాన్ని అడ్డకోవటానికి విద్యార్థులు, యువత నడుంబిగించాలని కోరారు. ఫిబ్రవరి 11న హైదరాబాద్ లోని వనస్థలిపురంలో జరిగే ఏఐపిఎస్వో 3వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కరపత్రంను ఆవిష్కరించారు. జిల్లా ఉపాధ్యక్షులుగా పోటు కళావతి, డాక్టర్.హెచ్ ప్రశాంతి, భారతిరాణి, వి.శ్రీకాత్, ఆర్.శివరామక్రిష్ణ, టీ.రామాంజనేయులు, ప్రధానకార్యదర్శులుగా యం.సుబ్బారావు, కమర్తపు మురళీ, పరిశ పుల్లయ్య, కార్యదర్శులుగా ఇటుకుల రామక్రిష్ణ, దాసరి రాము, జి . వెంకటేశ్వర్లు, పి.సుబ్బారావు, లెనిన్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మరో 15 మంది కార్యవర్గ సభ్యులుగా ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో కల్యాణపు నాగేశ్వరరావు, బండారు రమేష్, కె.కుమార్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు బస్ పాసులు పంపిణీ

నవతెలంగాణ-కల్లూరు

ఆర్టీసీ దివ్యాంగులకు అందజేసే రాయితీ బస్సు పాసులు కూడా తీసుకునే స్థోమత లేని నిరుపేదలకు న్యూ ప్రతాప్ ల్యాబ్ అధినేత, కల్లూరు మండల బీఆర్ఎస్ యువనేత పెడకంటి రామకృష్ణ ఆర్థిక సహాయంతో అర్హులైన దివ్యాంగులకు ఉచితంగా బస్సు పాసులను ఆదివారం పంపిణీ చేసి తన ఉదారతను చాటుకున్నారు. కల్లూరు మండల పరిధిలోని రఘునాధగూడెం గ్రామపంచాయతీలో అర్హులైన దివ్యాంగులు అందరికీ రాయితీతో కూడిన బస్ పాస్ లను సర్పంచ్ కె.అంజారావు ద్వారా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చల్లగుండ్ల. వెంకటేశ్వరరావు, ఆర్టీసీ సిబ్బంది కిన్నెర ఆనందరావు పాల్గొన్నారు.

వెంకన్న కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యేలు

తిరుమలాయపాలెం : మండల పరిధిలోని పిండిప్రోలు గ్రామానికి చెందిన తిరుమలాయపాలెం సొసైటీ వైస్ చైర్మన్ చామకూరి రాజు తండ్రి అయిన చామకూరి చిన్న వెంకన్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆదివారం ఇల్లందు, మునుగోడు ఎమ్మెల్యేలు బానోత్ హరిప్రియ నాయక్, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డిలు పరామర్శించారు. చామకూరి చిన్న వెంకన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యంగా ఉండాలని కోరారు ఈ కార్యక్రమంలో మండల సోషల్ మీడియా ఉపాధ్యక్షులు దూదిమెట్ల శ్రీనివాస్, టీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు పరికిపల్లి శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

చదువు భవిష్యత్తును అందంగా మారస్తుంది

- వ్యక్తిత్వ వికాస బోధకులు పసుపులేటి

సత్తుపల్లి : చదువు మాత్రమే ప్రతీఒక్కరి భవిష్యత్తును అందంగా తీర్చిదిద్దగలదని ప్రముఖ వ్యక్తిత్వ వికాస బోధకులు పసుపులేటి నాగేశ్వరరావు అన్నారు. తెలంగాణా ప్రభుత్వ షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆదేశాల మేరకు సత్తుపల్లి ప్రాంత సంక్షేమాధికారి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక వసతిగృహ పదవ తరగతి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ జీవితంలో ప్రతీ ఒక్కరికీ ప్రతీ దశలో సవాళ్ల ఎదురవుతూనే ఉంటాయని వాటిని ఎదుర్కొని నిలబడిన వారే విజయాన్ని చేరకోగలరన్నారు. అనంతరం ఎస్సీ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ కస్తాల సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంపై ప్రత్యేక దృష్టి సారించి అనేక సదుపాయాలు కల్పించిందని విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పొత్తు పొత్తే - పోరాటం పోరాటమే

- అదానీ ఆర్థిక అరాచకం వెనుక మోడీ

- రాజ్యాంగంలోకి మనువాదాన్ని చొప్పించే కుట్ర

- విలేకరుల సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

నవతెలంగాణ-ఖమ్మం



భారతదేశంలో అనతికాలంలోనే ఆర్థికంగా ఎదిగి ఆర్థిక అరాచకం సృష్టిస్తున్న అదానీ వెనుక ప్రధాని మోడీ ఉన్నారని మొత్తం అదానీ వ్యవహారానికి సంబంధించి విచారణ జరిపించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. ఆదివారం ఖమ్మం గిరిప్రసాద్ భవన్లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో అయన మాట్లాడుతూ అనేక ప్రభుత్వ రంగ సంస్థలకు చెందిన ధనాన్ని ఆదానీ సంస్థల్లో పెట్టుబడి పెట్టేలా మోడీ ప్రోత్సాహించారని అదానీని అరెస్టు చేసి విచారణ జరిపితే అనేక విషయాలు వెలుగులోకి వస్తాయని ఆయన తెలిపారు. అదానీ సంపాదన, ఆర్థిక ఎదుగుదల అంతా దొల్ల అని తేలిపోయిందని సత్యం రామలింగరాజు కంపెనీల మాదిరి అదానీ కంపెనీల వ్యవహారం నకలుగా మారిందన్నారు. ఆర్థిక దుర్వినియోగానికి అదానీ సంస్థలు పాల్పడ్డాయని, నిజమైన వ్యాపారాలు లేకుండానే ప్రజలను నమ్మించి మోసం చేశారని, ఒక్క రోజే నాలుగు లక్షల కోట్ల రూపాయల మేర వివిధ సంస్థలు నష్టాన్ని చవి చూశాయని, ఇందులో ఎల్బిసి రూ.1800 కోట్ల మేర నష్టపోయిందని తెలిపారు. కమ్యూనిస్టులుగా ఈ దేశాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ విచ్ఛిన్నం కానివ్వమని భిన్నత్వంలో ఏకత్వం అనే నినాదంతో కృషి చేస్తామన్నారు. బీఆర్ఎస్ అంశాల వారీ పొత్తు మాత్రమే ఉంటుందని పొత్తు పొత్తే పోరాటం పోరాటమేనన్నారు. ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తే మౌనంగా ఉన్న అధికార యంత్రాంగం పేదలు ఆక్రమిస్తే అనవసర కేసులు పెడుతున్నారని 123(బి) లాంటి కేసులు నమోదు చేయడం సహేతుకం కాదన్నారు. పోలీస్ నియామకాలకు సంబంధించి అభ్యర్థుల ఆలోచనలను, డిమాండ్లను పరిగణలోకి తీసుకోవాలని, ఆర్టిసి, పోడు సమస్యలను కూడా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. డబ్బుతో అరాచకం సృష్టించాలనుకునే వారికి ప్రజలే తగు సమాధానం చెబుతారన్నారు. ఈ విలేకరుల సమావేశంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, జిల్లా కార్యవర్గ సభ్యులు తాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఏపీ సైంటిఫిక్ అడ్వైజరీ కమిటీ సమావేశానికి దశరధ రావు

- నేరుగా వరి వెదజల్లే విధానంపై సూచనలు

- ప్రత్యేక ఆహ్వానితునిగా హాజరు కానున్నరైతు 'దశరధ రావు'

- గతంలోనూ సీఎం కేసీఆర్ ప్రశంసలు అందుకున్న కలకోట రైతు

నవతెలంగాణ-బోనకల్



ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమగోదావరి జిల్లాలో సోమవారం జరుగనున్న సైంటిఫిక్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో పాల్గొనాలని మండల పరిధిలోనే కలకోట గ్రామానికి చెందిన ఆదర్శ రైతు పైడిపల్లి దశరధ రావుకి ఆదివారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి ఆహ్వానం అందింది. వైరాలోని కృషి విజ్ఞాన కేంద్రం సహకారంతో వరి సాగులో ఎన్నో వినూత్న ప్రయోగాలు చేసి దశరధరావు విజయం సాధించారు. ఈ క్రమంలోనే ముఖ్యమంత్రి కేసీఆర్ సైతం ఆయనను స్వయంగా పిలిపించుకొని దశరధరావు చేసిన సాగు విధానాలను అడిగి తెలుసుకున్నారు. కేసీఆర్ వ్యవసాయ క్షేత్రంలో దశరధరావు స్వయంగా పాల్గొని కెసిఆర్‌కి వరి విత్తనాలు వెదజల్లే విధానంపై అవగాహన కల్పించారు. ఈ క్రమంలో పశ్చిమగోదావరి జిల్లాలో జరగబోయే ఎస్ఏసీ సమావేశంలో నేరుగా వెదజల్లే వరిసాగు చేయడంలో ఆయన అనుభవాలను రైతులతో, శాస్త్రవేత్తలతో కలిసి పంచుకోనున్నారు. వైరాలోని కృషి విజ్ఞాన కేంద్రంలో పనిచేస్తున్నప్పుడు దశరధ రావు గురించి తెలిసిన శాస్త్రవేత్త డాక్టర్ మల్లికార్జున్‌రావు ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్లోని శాస్త్రవేత్తగా విధులు నిర్వహిస్తున్నారు. అక్కడ రైతుల ప్రయోజనాల కోసం ఎస్ఏసీ సమావేశానికి ఆహ్వానించారు. గతంలోనూ నేరుగా వరిని వెదజల్లి సాగు చేసే విధానం గురించి రశరధ రావు ద్వారా తెలుసుకున్న రైతు తోటపల్లి జాషువా 'తెలంగాణ సోనా' రకంతో అధిక దిగుబడులు సాధించారు. అప్పటికే ఆ విధమైన వరిసాగులో విజయం సాధించిన దశరధ రావు సాగు విధానాలను తెలుసుకున్న ముఖ్యమంత్రి కేసీఆర్.. 'వరి నాటులో నేరుగా వెదజల్లే పద్ధతి ద్వారా వరిపంట సాగుచేస్తే ఎకరానికి రెండు క్వింటాళ్లు దిగుబడి ఎక్కువ వచ్చే అవకాశం ఉంది. ఇదే పద్ధతిలో పంట పండిస్తే తెలంగాణ రైతాంగానికి సుమారు రూ.10వేల కోట్లపైనే పెట్టుబడి ఆదా అవుతుందని 29, మే, 2021న వ్యవసాయశాఖపై జరిపిన ఉన్నతస్థాయి సమీక్షలో తెలిపారు. అంతటి ఘనత వహించిన దశరధ రావు మరిన్ని విజయాలు అందుకోవాలని కలకోట రైతులు, మండల రైతాంగం ఆశాభావం వ్యక్తం చేశారు.



తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ తో దశరధరావు (ఫైల్)

కార్పొరేటర్ యల్లంపల్లి వెంకట్రావుకు మాతృవియోగం



-నివాళులర్పించిన పలువురు

-ప్రజాప్రతినిధులు, పలు పార్టీల నాయకులు

నవతెలంగాణ-ఖమ్మం రూరల్

ఖమ్మం నగర 35వ డివిజన్ కార్పొరేటర్ యల్లంపల్లి వెంకట్రావు మాతృమూర్తి యల్లంపల్లి నారాయణమ్మ (72) శనివారం రాత్రి ఖమ్మం రూరల్ మండలంలోని తెల్దారుపల్లిలో మృతి చెందారు. నారాయణమ్మ మృతదేహాన్ని ఆదివారం పలువురు ప్రజాప్రతినిధులు, పలు పార్టీల నాయకులు సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ రావు మాట్లాడుతూ నారాయణమ్మ మృతి బాధాకరమన్నారు. వారి కుటుంబానికి సిపిఎం పార్టీ తరపున ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు వెంకట్రావు కార్పొరేటర్ గా ఉన్నారు. నారాయణమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించిన వారిలో సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, జిల్లా నాయకులు యర్రా శ్రీకాంత్, మాదినేని రమేష్, వై.విక్రమ్, కల్యాణం వెంకటేశ్వరరావు,షేక్ బషీర్, లింగయ్య యర్రా శ్రీనివాసరావు, తుమ్మ విష్ణు, ఆంధ్రబ్యాంక్ సొసైటీ చైర్మన్ తమ్మినేని విజయ లక్ష్మి, తమ్మినేని ఉమ, కమలమ్మ, ఖమ్మం నగర మేయర్ పూనుకొల్లు నీరజ, టిఆర్ఎస్ నాయకులు పగడాల నాగరాజు, బోజెడ్ల రాం మోహన్ రావు, సూడా చైర్మన్ బచ్చు విజయకుమార్, ప్రముఖ పారిశ్రామికవేత్త గరికపాటి వెంకట్రావు, దనాల కొండయ్య, సిపిఎం నాయకులు తమ్మినేని వెంకట్రావు, సీపీఎం ఖమ్మం రూరల్ మండల కార్యదర్శి నండ్ర ప్రసాద్, పి.మోహన్ రావు, తెల్దారుపల్లి సర్పంచ్ సిద్ధినేని కోటయ్య, షేక్ రంజాన్, యర్రా నర్సింహా రావు, జక్కంపూడి కృష్ణ, యల్లంపల్లి నాగయ్య, షేక్.బాబు, ఖాసీం, దరిపల్లి కోటయ్య, ఉప్పెర్ల వాసుదేవ రావు, కల్వకుంట్ల గోపాల్ తదితరులు నివాళులర్పించారు.

కార్యకర్తల కుటుంబాలకు భరోసా బీఆర్ఎస్ ప్రమాద బీమా

- సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

నవతెలంగాణ- సత్తుపల్లి



కార్యకర్తల కుటుంబాలకు భరోసా నేనంటూ ముఖ్యమంత్రి కేసీఆర్ బీఆర్ఎస్ ద్వారా పార్టీ కార్యకర్తలకు ప్రమాద బీమా వర్తించేలా చర్యలు తీసుకోవడమే గాక ఇప్పటి వరకు వివిధ రకాలుగా మృత్యువాతకు గురైన కార్యకర్తల కుటుంబాలను ప్రమాద బీమా పథకం ద్వారా భరోసా ఇవ్వడం జరుగుతోందని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. ఇటీవల కాకర్లపల్లికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్తల హెచ్చు వెంకటేశ్వరరావు ప్రమాదవశాత్తు చెరువులో పడి మరణించిన నేపథ్యంలో పార్టీ ద్వారా మంజూరైన రూ. 2లక్షల బీమా సొమ్ముకు సంబంధించిన చెక్కును స్థానిక క్యాంపు కార్యాలయంలో ఆదివారం మృతుడి భార్య జయమ్మకు ఎమ్మెల్యే సండ్ర అందించారు. ఈ సందర్భంగా సండ్ర మాట్లాడుతూ బీఆర్ఎస్ సభ్యత్వం తీసుకున్న ప్రతి కుటుంబానికి ఈ బీమా పథకం భరోసా ఇస్తోందన్నారు. ఈ విధంగా పథకం దేశంలో మరెక్కడా లేదన్నారు. ఇతర రాష్ట్రాల్లో అనేక సంక్షేమ పథకాలు తెలంగాణలో ఉండటం మన అదృష్టమన్నారు. ప్రతి పథకాన్ని ప్రజల ముగింటకు తీసుకెళ్తున్న ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, మున్సిపల్ చైర్మెన్ కూసంపూడి మహేశ్, ఎంపీపీ దొడ్డా హైమవతిశంకరరావు, ఆత్మ ఛైర్మెన్ శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, నాయకులు దొడ్డా శంకరరావు, కంచర్ల నాగేశ్వరరావు, కౌన్సిలర్ మట్టా ప్రసాద్ పాల్గొన్నారు.

పంటల సమగ్ర బీమా పథకాన్ని ప్రవేశపెట్టాలి

- 31న రైతు మహా ధర్నా, ప్రదర్శన జయప్రదం చేయండి

- రైతు సంఘం రాష్ట్ర నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు పిలుపు

నవతెలంగాణ-నేలకొండపల్లి

సమగ్ర పంటల బీమా పథకాన్ని ప్రవేశపెట్టాలని, రైతాంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 31న ఖమ్మంలో జరిగే రైతాంగ మహాధర్నా ప్రదర్శనను జయప్రదం చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక రావెళ్ళ భవనంలో విలేకరులతో మాట్లాడుతూ రైతాంగ సమస్యల పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. వ్యవసాయానికి బడ్జెట్లో నిధుల కేటాయింపులో కోతలు విధిస్తుండడంతో చేసిన అప్పులు తీర్చలేక రైతాంగం ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతాంగ ప్రయోజనాల కోసం అంటూ వ్యవసాయాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే దుర్మార్గపు చర్యలను వేగవంతం చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుబంధు ఇస్తున్నామంటూ ఇతర సబ్సిడీలను పూర్తిగా కుదించిందన్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన లక్ష రూపాయలు రుణమాఫీని నేటికీ అమలు చేయకపోవడం దారుణమన్నారు. బ్యాంకుల్లో రైతుల అప్పులు అసలు కంటే వడ్డీలు అధికంగా పెరగడంతో రైతాంగం అవస్థలు పడుతున్నారన్నారు. గత రెండు సీజన్లలో మిర్చి రైతులకు వేలాది ఎకరాల్లో తామర పురుగు, వైరస్, వేరు కుళ్ళుడు ఆశించడంతో తీవ్ర నష్టం వాటిల్లి అప్పుల పాలయ్యారన్నారు. అధిక వర్షాలు, తెగుళ్ల వల్ల పంట దిగుబడులు పూర్తిగా తగ్గిపోవడంతో పాటు అరకొరగా పండిన పంట ఉత్పత్తులకు సరైన గిట్టుబాటు ధరలు లేకపోవడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. ఇంత జరుగుతున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగానికి ఒక్క రూపాయి కూడా నష్టపరిహారం అందించకపోవడం అన్యాయం అన్నారు. సాగర్ జలాలను వారబంధి లేకుండా నిరంతరాయంగా సరఫరా చేయాలన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ రైతు సంఘం నాయకులు రచ్చ నరసింహారావు, ఇంటూరి అశోక్, ప్రజాసంఘాల నాయకులు కె.వి రామిరెడ్డి, ఏటుకూరి రామారావు, పగిడికత్తుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సమస్యల పరిశీలించాలి

పాలేరు ఎమ్మెల్యే కందాళ కు వినతి

నవతెలంగాణ-కూసుమంచి



అంగన్వాడి టీచర్లు, హెల్పర్లు మినీ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని, తమ డిమాండ్లను శాసనసభలో వినిపించాలని ఆదివారం పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డికి అంగన్వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంగన్వాడి టీచర్లకు మరియు హెల్పర్స్ యూనియన్ సిఐటియు రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.కోటేశ్వరి, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి పెరుమాళ్ళపల్లి మోహన్ రావు మాట్లాడుతూ.. అంగన్వాడీలకు ఉద్యోగ భద్రత లేదని కనీస వేతనం అమలు కావడం లేదని, పియఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యం లేదని రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెన్షన్స్ సౌకర్యం లేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్ళామని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని పదవి విరమణ చేసిన ప్రతి టీచర్లకు ఐదు లక్షల రూపాయలు, విని వర్కర్‌కు నాలుగు లక్షల రూపాయలు హెల్పర్ కు మూడు లక్షల రూపాయలు పెన్షన్ దిగిపోయే నాటికి వేతనంలో సగ జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 14న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఈ సందర్భంగా అంగన్వాడీలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు తిరుమలాయపాలెం మండల కన్వీనర్ వషపొంగు వీరన్న, కొండపల్లి మండల కన్వీనర్ పకిడికత్తుల నాగేశ్వరరావు, అంగన్వాడి వర్కర్లు నాయకులు అన్నపూర్ణ, పద్మ కుమారి, వెంకటమ్మ లక్ష్మి, దుర్గ, లలిత, నాగమణి, పాలేరు నియోజకవర్గంలో ఉన్న నాలుగు మండలాల సంబంధించిన అంగన్వాడి టీచర్లు హెల్పర్లు మిని వర్కర్లు పాల్గొన్నారు.

రాష్ట్ర రైతులనే ఆదుకోలేని సీఎం దేశాన్ని ఎలా ఆదుకుంటారు

టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం

నవతెలంగాణ-మధిర

రాష్ట్ర రైతులనే ఆదుకోలేని సీఎం దేశాన్ని ఎలా ఆదుకుంటారని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం విమర్శించారు. మధిర నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్రం ప్రభుత్వం రైతులను దగా చేస్తుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన వాగ్దానాల్లో ముఖ్యంగా 24 గంటలు కరెంటు ఇస్తున్నామని ప్రగల్బాలు పలుకుతున్న ప్రభుత్వం కనీసం 10 గంటలు కరెంటు ఇవ్వటం లేదని ఆ ఇచ్చే కరెంటులో కూడా గంటకొకసారి కటింగ్ చేసి ఇస్తున్నారని రాత్రులు రెండు మూడు గంటలకి త్రీఫేస్ ఇస్తున్నారని అందువల్ల రైతులు ఇబ్బందులు పడటమే కాకుండా పంటలు ఎండిపోతున్నాయని అన్నారు. నష్టపోయిన మిర్చి పంటలకు నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మల్లాది హనుమంతరావు, మండల అధ్యక్షుడు మారేన్ను పుల్లారావు, జిల్లా నాయకులు వంగలా రామకోటి, 16వ వార్డు కౌన్సిలర్ వీరమాచినేని నాగ సులోచన, శివాజీ గారు, నాగేశ్వరరావు, చట్టు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నూతన భవన ప్రారంభోత్సవంలో పాల్గొన్న మల్లు నందిని

నవతెలంగాణ-మధిర

మధిర మున్సిపాలిటీ పరిధిలో శివాలయం దేవాలయం వద్ద నూతనంగా నిర్మించిన బ్రాహ్మణ పరిషత్ కార్యాలయం ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు అమ్మ ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని విక్రమార్క హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలంటే మీరు దేవాలయంలో చేసే పూజలు చాలా ఆదర్శమని అన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ పరిషత్తు అధ్యక్షులు వేమవరపు వెంకటేశ్వర శర్మ మాజీ మార్కెట్ చైర్మన్ రంగా హనుమంతరావు, మాజీ శివాలయం చైర్మన్ పాటిబండ్ల సత్యంబాబు మాజీ సర్పంచ్ బొమ్మకంటి హరిబాబు, మధిర మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు దారా బాలరాజు పాల్గొన్నారు.



హార్వెస్ట్ స్ప్రింగ్ లీఫ్ పాఠశాలలో 'చదరంగం పోటీలు

నవతెలంగాణ-ఖమ్మం

నగరంలోని హార్వెస్ట్ స్ప్రింగ్ లీఫ్ పాఠశాలలో 'చదరంగం పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను హార్వెస్ట్' గ్రూప్ విద్యాసంస్థల కరస్పాండెంట్, పి.రవిమారుత్, ప్రిన్సిపాల్ ఆర్. పార్వతీరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులలో క్రీడా నైపుణ్యాలను వెలికితీసి సుశిక్షితులుగా, తయారు చేయడమే లక్ష్యంగా హార్వెస్ట్ విద్యాసంస్థల్లో 17- 'చదరంగం' పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. పాఠశాలలో 6వ తరగతి నుండి 9వ తరగతి విద్యార్థినీ, విద్యార్థులకు చదరంగం పోటీలలో 5 రౌండ్‌లుగా నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థులకు చదువుతోపాటు, క్రీడా నైపుణ్యాలను వెలికితీయడానికి ప్రతీరోజు పాఠశాలలో సుశిక్షితులైన ఉపాధ్యాయులనే సి.సి ఏ, కరాటే, యోగా, డ్రాయింగ్, ఆర్ట్ రికార్డు శిక్షణా తరగతులను తమ విద్యాసంస్థల్లో నిర్వహిస్తున్నామని, వారి అభిరుచికి అనుగుణంగా ఎంచుకున్న రంగాల పట్ల శిక్షణను ఇస్తూ పోటీలు నిర్వహించడం జరుగుతుందని, ఈ నెల 22, 29వ తేదీలల్లో తమ విద్యాసంస్థల్లో విద్యార్థులకు (హార్వెస్ట్ పబ్లిక్ స్కూల్, టెండర్ రూట్స్, పింగోలీఫ్ 5 రౌండ్లుగా చదరంగం టోర్నమెంట్స్ నిర్వహిస్తున్నామని, విజేతలయిన విద్యార్థినీ, విద్యార్థులకు బహుమతుల అందజేశామని తెలిపారు.



మిర్చి రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

నవతెలంగాణ-పెనుబల్లి

మిరప సాగు రైతులకు నష్టపరిహారం చెల్లించాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు చలమాల విఠల్ రావు అన్నారు. సిపిఎం మండల కమిటీ సభ్యుడు కండె సత్యం అధ్యక్షతన మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మండలంలో అనేక గ్రామాల్లో చిన్న, సన్న, కారు రైతులు, మిర్చి సాగు చేసుకుంటున్నారన్నారు. కానీ గత రెండు సంవత్సరాల నుండి ప్రకృతి వైపరీత్యాల వల్ల, సీజనల్ వైరస్, వేరుకు ళ్ల తెగుళ్లతో, పంటలు దిగుబడి రాక, చాలా నష్టాపోయారని వారిని తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు గాయం తిరుపతిరావు, మిట్టపల్లి నాగమణి, మామిళ్ళ సోమయ్య, చిలక రామ చంద్రుడు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేసిన మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-కొణిజర్ల

మండల పరిధిలోని సింగరాయపాలెం గ్రామానికి చెందిన మడుపల్లి క్రిష్ణ ఆదివారం ఉదయం మృతి చెందాడు. స్థానిక బీఆర్ఎస్ నాయకులు మాజీ ఎమ్మెల్యే బాణోత్ మదన్ లాల్ కి విషయాన్ని తెలియజేయడంతో క్రిష్ణ మృతదేహానికి మదన్ లాల్ నివాళులర్పించి ఐదువేలు ఆర్థిక సహాయాన్ని క్రిష్ణ భార్యకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఆనుమోలు శ్రీనివాస్ రావు, దుగ్గినేని శ్రీనివాస్ రావు, సొసైటీ డైరెక్టర్ రావుల వెంకయ్య, పాముల వెంకటేశ్వర్లు, చల్లా నరసింహ రావు తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

చిన్నారులను ఆశీర్వదించిన సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య

నవతెలంగాణ-తల్లాడ

మండలంలోని మల్లారం గ్రామానికి చెందిన మూలగుండ్ల నాగేశ్వరరావు అనూష దంపతుల కుమార్తెలు వర్షిత, జశ్విత ఓణీల అలంకరణ వేడుక కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య చిన్నారులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు ఆర్ వీర మోహన్ రెడ్డి, రైతు బంధు మండల అధ్యక్షులు దొబ్బిదేవర వెంకటలాల్, సర్పంచ్ శీలం కోటిరెడ్డి, బద్దం కోటిరెడ్డి, మేడి సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

సహాయక గురువు నిఖిల్ గురుపట్టాభిషేక వారోత్సవాలు

నవతెలంగాణ-తల్లాడ

మండలంలోని నూతనకల్ విచారణ లాస్ లేటు మాత దేవాలయంలో ఆదివారం విచారణ సహాయక గురువులైన నిఖిల్ తొలి గురు పట్టాభిషేక వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆరాధన దివ్య బలి పూజా కార్యక్రమం ప్రారంభించారు. వివిధ గ్రామాల నుండి భక్తులు విశ్వాసులు సంఘస్తులు ప్రజలు పాల్గొని వారి కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.



ఠాగూర్ దూరవిద్యా కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కో ఆర్డినేటర్

నవతెలంగాణ-వైరాటౌన్

ఠాగూర్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం ద్వారా నిర్వహిస్తున్న ఓపెన్ ఇంటర్ తరగతులను ఆదివారం జిల్లా కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు సందర్శించారు. ఈ సందర్భంగా కరెస్పాండెంట్ సంక్రాంతి రవికుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు విద్యార్థుల ఉద్దేశించి మాట్లాడుతూ చదువు మధ్యలో మానివేసిన వారు చదువును కొనసాగించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఓపెన్ ఇంటర్ అవకాశాన్ని కల్పించిందని అన్నారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓపెన్ ఇంటర్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, విద్యార్థులు సక్రమంగా తరగతులకు హాజరు కావాలని కోరారు. గత విద్యా సంవత్సరంలో 87శాతం ఫలితాలు సాధించినందుకు ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణారావు, అధ్యాపకులు లింగారావు, ముకుందరావు, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గుత్తికొండ ఆదాం మృతికి గుడిమెట్ల రజిత నివాళి

నవతెలంగాణ-తల్లాడ



తల్లాడ మండలం పాత మిట్టపల్లి గ్రామం నివాసి గుత్తికొండ ఆదాం (35) తలసేమియా వ్యాధితో బాధపడుతూ శనివారం రాత్రి మరణించారు. ఆదాం మరణవార్త తెలుసుకున్న మార్పు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు గుడిమెట్ల రజిత ఆదివారం పాత మిట్టపల్లి గ్రామంలోని వారి స్వగృహానికి వెళ్ళి గుత్తికొండ ఆదాం భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ధైర్యంగా ఉండాలని ఓదార్చారు. ఈ కార్యక్రమంలో మార్పు స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి గుడిమెట్ల మోహనరావు, సభ్యులు బూర్గు లాలయ్య, గుత్తికొండ నిర్మల, గుత్తికొండ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

చంద్ర నాగేశ్వరరావుని పరామర్శించిన 'దయాకర్ రెడ్డి'

నవతెలంగాణ-బోనకల్

మండల పరిధిలోని చిన్నబీరవల్లి గ్రామంలో చంద్ర నాగేశ్వరరావు సతీమణి చంద్ర ఝాన్సీ ఇటీవల మరణించారు. ఈ విషయం తెలిసిన పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంప్ కార్యాలయ ఇంచార్జ్ తుంబూరి దయాకర్ రెడ్డి, ప్రముఖ వైద్యులు, జిల్లా నాయకులు కోట రాంబాబు ఆదివారం చిన్న బీరవల్లిలోనే సండ్ర నాగేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ఉమ్మినేని కృష్ణ, చంద్ర కిరణ్, ఎంపిటీసి చంద్ర శ్రీ లక్ష్మీ, వాసిరెడ్డి చంద్రశేఖర్, తోటకూర వెంకటేశ్వరావు, కోయినేని ప్రదీప్, కరివేద శ్రీహరి, యార్లగడ్డ రాఘవ రావు తదితరులు పాల్గొన్నారు.

1న మాదాపురానికి మంత్రులు రాక

ముదిగొండ : మండల పరిధిలో మాదాపురం గ్రామంలో రాష్ట్ర వ్యవసాయ, రవాణా శాఖ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, పువ్వాడ అజయ్ కుమార్, జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజులు ఫిబ్రవరి 1న పర్యటించనున్నారు. ఈ సందర్భంగా మంత్రులు గ్రామంలోని రైతు వేదిక ప్రారంభంతో పాటు, కళ్యాణలక్ష్మి, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేయనున్నారు. బీఆర్ఎస్ పార్టీ మండల ముఖ్యకార్యకర్తలు సమావేశం మాదాపురంలో ఆదివారం నిర్వహించారు. పర్యటనను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షులు వాచేపల్లి లక్ష్మారెడ్డి కోరారు.

యాదవ కురుమ ఐక్యవేదిక క్యాలెండర్ ఆవిష్కరణ

ముదిగొండ : యాదవ సంఘం ఆధ్వర్యంలో యాదవ కురుమ ఐక్యవేదిక క్యాలెండర్‌ను ముదిగొండలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చిర్రా లింగయ్య యాదవ్, గౌరవ అధ్యక్షులు పోతురాజు పురుషోత్తం, మండల అధ్యక్షకార్యదర్శి ధనియాకుల వీరస్వామియాదవ్, అమరబోయిన వీరబాబుయాదవ్, న్యూలక్ష్మీపురం, పండ్రేగుపల్లి గ్రామ సర్పంచ్‌లు వాగదాని కన్నయ్య యాదవ్, ఒబెనబోయిన అమరయ్య యాదవ్, పాల్గొన్నారు.

రేపు విద్యుత్ చార్జీలపై నిరసన

కారేపల్లి : ఏసీడీ, డెవలప్‌మెంట్ చార్జీల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ ఈనెల 31న సబ్ స్టేషన్ల ముందు నిరసన కార్యక్రమాలను చేపట్టనున్నట్లు సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా కారేపల్లి, కామేపల్లి మండలాల కార్యదర్శి ఎన్వీ రాకేష్ తెలిపారు.

కరెంటు కోతలు ఎత్తివేయాలి

- పగటిపూట విద్యుత్ 12 గంటలు సరఫరా చేయాలి
- 31న ఖమ్మంలో రైతు మహాధర్నా ప్రదర్శన జయప్రదం చేయండి
- తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు

నవతెలంగాణ-కొణిజర్ల

గత వారం రోజుల నుంచి విద్యుత్ సరఫరాలో తెలంగాణ రాష్ట్రంలో ఏర్పడిన గందరగోళ పరిస్థితిని వెంటనే సరిదిద్ది పగటి పూట 12 గంటలు వ్యవసాయానికి విద్యుత్ సరఫరా చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. విద్యుత్ సరఫరా సమస్యలు పరిష్కారం కోసం జనవరి 31న ఖమ్మం జిల్లా కేంద్రంలో రైతు ప్రదర్శన ధర్నాను రైతులు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం కొణిజర్ల మండలంలో తనికెళ్ల, అమ్మపాలెం, చిన్న గోపతి, పెద్ద గోపత, చిన్న మునగాల గ్రామాల్లో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతు ప్రదర్శన ధర్నా జయప్రదం చేయాలని విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు జిల్లా కమిటీ సభ్యులు చెరకు మల్లి కుటుంబరావు మాట్లాడుతూ.. విద్యుత్ కోతలు లేకుండా పగటిపూట సరఫరా చేయాలని రెండు వరస సీజన్‌లో వైరస్ వేరుకుల్లుడుతో దెబ్బ తిన్న మిర్చి పంట కు నష్టపరిహారం అందించాలని, సమగ్ర పంటల బీమా పథకం ప్రవేశ పెట్టాలని, రుణమాఫీ డబ్బులు రైతుల ఎకౌంటుకు జమ చేయాలని, నిధులు రాష్ట్ర బడ్జెట్లో కేటాయించాలని, అధిక వర్షాలు వల్లన తెగుళ్ల సోకి పత్తి దిగుబడి తగ్గి నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం అందించాలని, మార్కెట్ ధర తక్కువ కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ జనవరి 31న ఖమ్మం జిల్లా కేంద్రంలో రైతు ప్రదర్శన జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయరంగాన్ని నిర్లక్ష్యం చేస్తూ బడ్జెట్లో కోతలు విధిస్తూ రైతులను అప్పుల ఊబిలోకి నడుపుతున్నాయన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం రైతుల కోసమని మాటలు మాట్లాడి చేతల్లో కార్పొరేట్ కంపెనీలకు వ్యవసాయాన్ని అప్పగించే చర్యలు వేగవంతం చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు బంధు ఇస్తున్నాం అనే పేరుతో ఇతర సబ్సిడీలు కుదించడం జరిగిందని, 2018 నవంబర్ అసెంబ్లీ ఎన్నికల హామీగా ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష రూపాయల వరకు రైతు రుణమాఫీ చేస్తామని వాగ్దానం చేసి నేటికీ అమలు చేయలేదన్నారు. రైతులు బ్యాంకుల్లో అప్పుల వడ్డీలు పెరిగి అసలు కంటే వడ్డీ ఎక్కువైందన్నారు. ఖమ్మం జిల్లాలో గత రెండు వరుస



సీజన్లలో మిర్చి వేలాది ఎకరాల్లో తామర వైరస్ వేరుకుల్లుడుతో నాశనమైందని, ఎకరాకు రెండు లక్షల రూపాయల పెట్టుబడి పెట్టి రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. అధిక వర్షాలు తెగుళ్ల వల్ల పత్తి దిగుబడి దారుణంగా పడిపోయిందన్నారు.

జనవరి 31న ఖమ్మం కేంద్రంలో ఆర్‌డీవో ఆఫీస్ నుంచి రైతు ప్రదర్శన ధర్నాకు ఉదయం 10 గంటలకు వందలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు దారగాని రాములు, బోయినపల్లి శ్రీనివాసరావు, బండారు మల్లయ్య, ఆదినారాయణ, కోండయ్య, ప్రతాపనేని లక్ష్మయ్య, చింతనిప్పు నరిసింహారావు వీరభద్రం, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



పంట బీమా వర్తింప చేయాలి

దగ్ధమైన మిర్చిని పరిశీలించిన సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్

నవతెలంగాణ -కూసుమంచి

మండలం నేలపట్ల గ్రామంలో జాల బిక్షం అనే రైతు సుమారు 20 క్వింటాల మిర్చి మార్కెట్ కు తరలించడానికి గ్రేడింగ్ చేసిన మిర్చి కుప్పకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించిన కారణంగా 8 క్వింటాలు పూర్తిగా బుగ్గి పాలయింది. మరో ఎనిమిది క్వింటాళ్లు పొగసూరి అమ్మటానికి వీలు కాకుండా కాలిపోయింది. విషయం తెలుసుకున్న సీపీఐ(ఎం) బృందం ఆదివారం కాలిన పంటను పరిశీలించింది. ఈ రైతు కుటుంబాన్ని తక్షణమే ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని, కాలిన మిర్చి పంటకు పంట బీమా వర్తింప చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్ తో కలిసి పంటను పరిశీలించి, రైతు కుటుంబాన్ని ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సంవత్సరం మొత్తం కష్టపడ్డ పండించిన పంట దగ్ధం కావడం, రైతుకి ఇలాంటి నష్టం జరగటం బాధాకరమని, మిర్చి పంటకు నిప్పు అంటించిన వ్యక్తులను పోలీసులు గుర్తించి కఠినంగా శిక్షించాలని, అనేక కష్టనష్టాలు ఎదుర్కొని పండించిన రైతుకు పంట ఫలితం లేకుండా పోయినందుకు రైతు కుంగిపోకుండా, తిరిగి వ్యవసాయం చేసే విధంగా ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని అందించాలని డిమాండ్ చేశారు. అలాగే ఈ విధంగా రైతులు అనేక సందర్భాలలో ప్రకృతి వైపరీత్యాలు చీడపీడల కారణంగా అనేకమంది రైతులు లక్షల పెట్టుబడి పెట్టిన, పెట్టుబడి రాకపోవడం కారణంగా వ్యవసాయానికి దూరమవుతూ కూలి పనులకు వెళ్తున్నారని అన్నారు. కావున రైతాంగాన్ని ఆదుకోవడానికి వ్యవసాయం చేసుకోవడానికి ప్రతి పంటకు బీమా పథకం వర్తించే విధంగా ప్రభుత్వమే ప్రీమియం చెల్లించి బీమా వచ్చే విధంగా బీమా పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరారు. వ్యక్తులుగా సంస్థలుగా కొంత ఆర్థిక సహాయం చేయటం కొంత ఉపశమనంగా ఉండొచ్చు కానీ రైతుకు పూర్తి ప్రయోజనం కలగదని, పంటల బీమా పథకాన్ని అమలు చేసే విధంగా స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీలు గ్రామ మండల స్థాయి ప్రజాప్రతినిధులు తీర్మానం చేసి ప్రభుత్వానికి అందించాలని, పథకం అమలయ్యే విధంగా చూడాలని అప్పుడు మాత్రమే రైతుకి పూర్తి రక్షణ కలుగుతుందని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతుల సంఘం జిల్లా నాయకులు మల్లెల షణ్ముత్ రావు, గ్రామ సర్పంచ్ రెంటాల ధనమ్మ, సిపిఎం మండల నాయకులు రెంటాల శ్రీను, సంగయ్య, రైతు సంఘం మండల కార్యదర్శి గంగాధర్, మిర్చి రైతులు పాల్గొన్నారు.

మందిరాలకు మాజీ ఎంపీ పొంగులేటి విరాళాలు

నవతెలంలణ-ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజక వర్గంలోని పలు మండలాల్లో నూతనంగా నిర్మిస్తున్న ఆలయాలు, మసీదులు, చర్చిల నిర్మాణానికి ఖమ్మం మాజీ పార్లమెంటు సభ్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి విరాళాలను అందజేశారు. ఈ మొత్తాన్ని అశ్వారావుపేట నియోజక వర్గ నాయకులు జారె ఆదినారాయణ చేతుల మీదుగా పొంగులేటి క్యాంపు కార్యాలయంలో ఆదివారం అందజేశారు. దమ్మపేట మసీదుకు రూ.30వేలు, అంకంపాలెం గ్రామంలోని ముత్యాలమ్మ గుడికి రూ.25వేలు, ఆర్లపెంట గ్రామంలోని రామాలయానికి రూ.25వేలు, కొడిసెగట్టు గ్రామంలోని చర్చి నిర్మాణానికి రూ.20వేలు, ఒడ్డుగూడెం గ్రామంలోని రామాలయానికి రూ. 20వేలను విరాళంగా ఇచ్చారు.

చిన్నమునగాల చర్చి నిర్మాణానికి పొంగలేటి విరాళం

కొణిజర్ల మండలంలోని చిన్నమునగాల గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న చర్చి నిర్మాణానికి ఖమ్మం మాజీ పార్లమెంటు సభ్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి రూ. 15 వేలను విరాళంగా ఇచ్చారు. ఈ మొత్తాన్ని పొంగులేటి క్యాంపు కార్యాలయంలో ఆదివారం స్థానిక గ్రామ సర్పంచ్ కాంపల్లి స్వప్న సురేష్ చేతుల మీదుగా కమిటీ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గోసు మధు, సర్పంచ్ పరికపల్లి శ్రీను, కన్నెగంటి రావు, గడల నరేందర్ నాయుడు, పాపగంటి జనార్ధన్, కాంపల్లి చుక్కయ్య, పాపగంటి బెంజి, చిన్నబాబు, కత్తి ప్రభాకర్, పాపగంటి సురేష్, పాపగంటి అబ్బులు, ఊటుకూరి రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మాజీ ఎంపీ పొంగులేటి పర్యటన

ఖమ్మం మాజీ పార్లమెంటు సభ్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం క్లబ్ లో జరిగిన దివ్యాంగ మిత్రుల ఆత్మీయ సమ్మేళనంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగ ఆదర్శ దంపతుల వివాహం జరగ్గా నూతన దంపతులను ఆశీర్వదించారు. పట్టు వస్త్రాలను కానుకగా



సమర్పించారు. జూలురుపాడులోని గుండెపూడి గ్రామంలో ఎ.బి.ఎస్. రాజు ఇటీవల చనిపోగా వారి కుటుంబాన్ని, వెంకటేశ్వర్లు ఇటీవల చనిపోగా వారి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరంలో ఇటీవల వివాహం చేసుకున్న ఓ జంటను ఆశీర్వదించారు. ఏన్కూర్ మండలం రేపల్లెవాడలో గోళ్ల బేబి చనిపోయినందున వారి కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. అదేవిధంగా ఖమ్మం నగరంలోని పలు ప్రాంతాల్లో జరిగిన పలు వివాహ వేడుకల్లో పొంగులేటి పాల్గొని నూతన జంటలను ఆశీర్వదించారు.

నేడు 'పొంగిలేటి' ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-బోనకల్

మండల కేంద్రంలోని ఎస్సార్ ఫంక్షన్ హాల్ నందు మాజీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి మధిర నియోజకవర్గ వ్యాప్తంగా ఆత్మీయ సోదరులు, అభిమానులు, నాయకులు, కార్యకర్తలతో సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నాయకులు బోయినపల్లి మురళి, భాగం నాగేశ్వరరావు, తోటకూర వెంకటేశ్వరావు తెలిపారు. ఈ సమావేశం ఉదయం పది గంటలకు ప్రారంభమవుతుందని వారు తెలిపారు. ఈ సమావేశం జయప్రదం కోసం ఎస్సార్ ఫంక్షన్ హాల్ లో ఆ పార్టీ నాయకులు భారీగా ఏర్పాటు చేస్తున్నారు. పొంగిలేటి అభిమానులు, సానుభూతిపరులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

దాబాల్లో మద్య నిషేధం.. ఫ్లెక్సీల ఏర్పాటు

నవతెలంగాణ-ఖమ్మం రూరల్

దాబాల్లో మద్యం సేవించరాదంటూ మండల పరిధిలోని దాబాల్లో ఆదివారం పోలీసులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. గతంలోనే దాబాల్లో మద్యం విక్రయాలను, మద్యం సేవించడాన్ని పోలీసు అధికారులు నిషేధించారు. అయినా అది పూర్తిస్థాయిలో అమలు కాకపోవడం వల్ల తాజాగా అన్ని దాబాల్లో పోలీసు అధికారులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన దాబాల యజమానులపై చట్టపరంగా చర్యలు ఉంటాయని ఎస్ఐ వెంకటకృష్ణ తెలిపారు.

రెండు లారీలు ఢీ డ్రైవర్ మృతి

నవతెలంగాణ-కల్లూరు

మండల పరిధిలోని రామకృష్ణాపురం సమీపంలో ప్రధాన్ రహదారిపై వెనక నుండి లారీని ఢీకొనడంతో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం నుండి ధాన్యం రోడ్డుతో ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేటకు ధాన్యం లోడ్ తో వెళుతుండగా కృష్ణాపురం సమీపంలో చేరుకోగానే ముందు వెళుతున్న లారీ సడన్ బ్రేక్ వేయడంతో వెనక వస్తున్న లారీ ఢీకొనడంతో లారీ డ్రైవర్ షేక్ జాన్ పాషా (31) క్యాబిన్‌లో ఇరుక్కుపోయి మృతి చెందాడు. లారీ ముందు భాగం మొత్తం నుజ్జునుజ్జు అయిది. డ్రైవర్ క్యాబిన్ లో ఇరుక్కుపోయాడు. ఈ సమాచారం తెలుసుకున్న ఎస్ఐ కొండలరావు, సీఐ హనుక్ సంఘటన స్థలానికి చేరుకొని క్యాబిన్ ఇరుకుపోయిన డ్రైవర్‌ను బయటకు తీశారు. అనంతరం అప్పటివరకు నిలిచిపోయిన ట్రాఫిక్ స్తంభించింది. శవ పరీక్షనిమిత్తం పెనుబల్లి ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మతుడు ఖమ్మం అర్బన్ మండలం కోటపాడు గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు.

బీజేపీతో గిరిజన హక్కులకు ప్రమాదం

- పోరాటాలు ప్రతిబింబేలా మహాసభలు జరగాలి
- ఫిబ్రవరిలో కారేపల్లిలో జిల్లా మహాసభలు
- గిరిజన సంఘం

నవతెలంగాణ-కారేపల్లి

బీజేపీ 9ఏండ్ల కాలంలో గిరిజనాభివృద్ధి పైసా విధిలించక పోగా ప్రభుత్వ విధానాలతో హక్కులకు ప్రమాదం ఏర్పడిందని గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ శ్రీరాంనాయక్ విమర్శించారు. తెలంగాణ గిరిజన సంఘం 3వ జిల్లా మహాసభలు కారేపల్లిలో ఫిబ్రవరి చివరి వారం జరగనున్న క్రమంలో మహాసభల విజయవంతానికి ఆదివారం ఆహ్వాన సంఘంను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉసిరికాయలపల్లి సర్పంచ్ బానోత్ బన్సీలాల్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో శ్రీరాంనాయక్ మాట్లాడుతూ అడవులపై ఆధారపడి జీవిస్తున్న గిరిజనులకు అడవిని దూరం చేయటానికి అటవీ సంరక్షణ నియమావళి-2022 తీసుకవస్తుందన్నారు. గనులను లీజు పేరుతో అడవులను తన కార్పొరేట్ మిత్రులు అదాని, అంబానీలకు అప్పగించాలని



చూస్తుందన్నారు. అటవీ హక్కుల చట్టాన్ని 2018 వరకు సాగు చేసే గిరిజనులకు అమలు చేయాలని, గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్ల అమలుపై రాష్ట్రం అసెంబ్లీ తీర్మానం కేంద్రానికి పంపిన మోడీ ప్రభుత్వం స్పందించలేదన్నారు. తెగల మధ్య చిచ్చు రేపుతూ బీజేపీ ఆడుతున్న నాటకాలను గిరిజన సోదరులు అర్థం చేసుకోవాలని కోరారు. రాష్ట్రంలో గిరిజనులు సాధించుకున్న రిజర్వేషన్లకు చట్టబద్ధం కల్పించి 9వ షెడ్యూల్లో చేర్చాలన్నారు. టీఆర్ఎస్ మ్యానిఫెస్టోలో గిరిజనులకు ఇచ్చిన హామీలను కొంత అమలు చేసినా గిరిజన బంధు, పోడుకు హక్కులు కల్పనపై త్వరితగతిని చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పోడుకు హక్కు కల్పనకు వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. గిరిజన సంఘం జిల్లా మహాసభలు ఫిబ్రవరిలో కారేపల్లిలో, రాష్ట్ర మహాసభలు మార్చి 1,2, 3 తేదిల్లో నల్గొండలో జరగనున్నాయన్నారు. మహాసభలు దిశనిర్దేశంను చేయనున్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శులు బానోత్ బాలాజీ, భూక్య వీరభద్రం, జిల్లా నాయకులు మూడు గన్యానాయక్, తేజావత్ కృష్ణ, అజ్మీర శోభన్‌నాయక్, భూక్య లక్ష్మణ్, గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షులు బానోత్ భరత్‌నాయక్, వైఎస్సార్‌టీపీ నాయకులు ధర్మసోత్ రాములు నాయక్, ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు వజ్జా రామారావు, సర్పంచ్‌లు కుర్సం సత్యనారాయణ, ఎట్టి రజిని రామారావు, మాలోత్ రాంజీ పాల్గొన్నారు.

తాటిపూడి గ్రామంలో ప్రజల వద్దకు ఆర్టీసి కార్యక్రమం

నవతెలంగాణ-వైరాటౌన్

ప్రజలను ఆర్టీసికి మరింత చేరువ చేసేందుకు మధిర డిపో మేనేజర్ ఎస్.దేవదానం వైరా మండలం తాటిపూడి గ్రామంలో ప్రజల వద్దకు ఆర్టీసి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ ఎస్.దేవదానం మాట్లాడుతూ ప్రైవేటు వాహనాలలో ప్రయాణం చాలా ప్రమాదకరంగా ఉంటుందని, ఆర్టీసి బస్సులలో ప్రయాణం సురక్షితంగా, సుఖవంతంగా ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో వైరా స్టేషన్ మేనేజర్ ఎ.వెంకటేశ్వర్లు, ఆర్టీసి సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు సబ్ స్టేషన్ల ముందు ధర్నాలు

31న విద్యుత్ ఎస్సీ కార్యాలయం ఎదుట ధర్నా

ఎంఎల్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఆవునూరి మధు


నవతెలంగాణ ఖమ్మం

ఏసిడి పేరుతో విద్యుత్ చార్జీల భారాన్ని నిరసిస్తూ సోమవారం సబ్ స్టేషన్ల ముందు చేపట్టిన ధర్నాను జయప్రదం చేయాలని రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఆవునూరి మధు పిలుపునిచ్చారు. ఆదివారం ఖమ్మంలోని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కార్యాలయంలో డివిజన్ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అయన మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యుత్ శాఖ ఏసిడి పేరుతో రైతాంగాన్ని, ప్రజలపై మోపడం విరామించుకోవాలని డిమాండ్ చేశారు. అదనంగా వసూలు చేయడానికి ఖండిస్తుందని, సోమవారం జిల్లా వ్యాప్తంగా సబ్ స్టేషన్ల ఎదుట ధర్నాలు, 31న జిల్లా విద్యుత్ సూపరింటెంట్ ఇంజనీరింగ్ కార్యాలయం ఎదుట ధర్నాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో న్యూడెమోక్రసీ ఖమ్మం డివిజన్ కార్యదర్శి కోలా లక్ష్మీనారాయణ, డివిజన్ నాయకులు ఖాసిం పాముల మోహన్ రావు, షేక్ సుభాహన్ మురళి, పాల్గొన్నారు.

మిమ్మల్ని మీరు చదువుకోవటమే సిసలైన విద్య

ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు అట్లూరి వెంకటరమణ

నవతెలంగాణ-ఖమ్మం



మనలోని లోపాలను గుర్తించి బలాబలాలు బేరీజు వేసుకుంటూ జీవితాన్ని ఉన్నత స్థితికి చేర్చుకోవటమే నిజమైన చదువని ప్రముఖ కవి, రచయిత, వ్యక్తిత్వ వికాస నిపుణులు అట్లూరి వెంకటరమణ స్పష్టం చేశారు. ఆదివారం ఖమ్మం ఎన్ఎస్‌పి కాలనీలోని గిరిజన కళాశాల వసతి గృహ ప్రాంగణంలో వసతి గృహ సంక్షేమ అధికారిని సిహెచ్.నాగమణి అధ్యక్షతన వసతి విద్యార్థినులకు ఏర్పాటు చేసిన వ్యక్తిత్వ వికాస తరగతిలో ఆయన మాట్లాడుతూ ప్రపంచ గమనంలో యువతకు ఉన్న అవకాశాలు జీవితంలో విజయం సాధించడానికి కావలసిన ఆయుధాల సమీకరణ అనే అంశంపై ఉత్తేజిత ప్రసంగం చేశారు. నాలుగు వందల మంది విద్యార్థులు హాజరైన ఈ సమావేశంలో ఎవరైతే పుస్తకం, సమాజం, జీవితాలను సునిశితంగా అధ్యయనం చేస్తారో వారిదే విజయమని అంటూ దేశానికి స్వేచ్ఛను సాధించటానికి తమ సర్వస్వం ఒడ్డిన ఎంతో మంది నారీమణుల స్ఫూర్తి మన శ్వాసగా చేసుకుని ఎదగటానికి ప్రయత్నం చేయాలని అన్నారు. తెలంగాణ వసతి గృహ సంక్షేమ అధికారుల ఫోరం, ఖమ్మం జిల్లా అధ్యక్షులు కోటపాటి రుక్మారావు, మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ జీవిత లక్ష్యాన్ని ఏర్పరచుకొని ఆ లక్ష్యసాధనకు ప్రణాళికలు రూపొందించుకొని జీవితంలో గొప్ప పౌరులుగా, ప్రయోజకులుగా నిలవాలని ఆకాంక్షించటం జరిగింది.

గోదావరిలో సత్తుపల్లి వాసి గల్లంతు

నవతెలంగాణ-సత్తుపల్లి

సత్తుపల్లి మండలం రుద్రాక్షపల్లి పంచాయతీ సత్యంపేటకు చెందిన వ్యక్తి మణుగూరు వద్ద గోదావరి నదిలో గల్లంతయిన ఘటన ఆదివారం జరిగింది. సింహాద్రి శ్రీనివాసరావు, భార్య కృష్ణవేణి దంపతులు తమ ఇద్దరు పిల్లలు అనురాధ, చిన్నులతో కలిసి మణుగూరులో బంధువుల ఇంట్లో శుభ కార్యక్రమ వేడుకలకు వెళ్లారు. వేడుకల అనంతరం పిల్లలతో కలిసి అక్కడి గోదావరి నది ఒడ్డున ఉన్న శివాలయాన్ని దర్శించుకొనేందుకు వెళ్లారు. దర్శనానికి ముందు గోదావరి స్నానం చేసేందుకు వెళ్లిన శ్రీనివాసరావు (42) నీటిలో దిగిన వెంటనే ప్రవాహ వేగానికి భార్య, పిల్లలు చూస్తుండగానే కొట్టుకుపోయాడు. ఎప్పుడూ అందుబాటులో ఉండే గజ ఈతగాళ్లు అశ్వారావుపేట సమీపంలో ఉన్న గుబ్బల మంగమ్మ గుడి వద్ద జరిగే ఫంక్షన్‌కు వెళ్లారు. దీంతో ప్రవాహంలో కొట్టుకుపోయే శ్రీనివాసరావును కాపాడేందుకు ఎవరూ లేకుండా పోయారు. మణుగూరు పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహం కోసం గాలిస్తున్నట్లు తెలిసింది.

అంగరంగ వైభవంగా దివ్యోత్సవం

- ఆదర్శ వివాహం అభినందనీయం



నవతెలంగాణ-కొత్తగూడెం

తెలంగాణ విభిన్న ప్రతిభావంతుల సంఘం (టివిపిఎస్) వ్యవస్థాపక అధ్యక్షులు సతీష్ గుండపునేని ఆధ్వర్యంలో కొత్తగూడెం క్లబ్‌లో వికలాంగుల దివ్యోత్సవం (వికలాంగు మిత్రుల ఆత్మీయ సమ్మేళనం) నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, ఖమ్మం జిల్లా మాజీ పార్లమెంటు సభ్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి విచ్చేసి నూతన ఆదర్శ దంపతులకు దీవించారు. అనంతరం వికలాంగుల కళా కారులతో కళా ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీవీపీఎస్ కార్యక్రమాలు నేటి యువతకు ఆదర్శం అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి, చుంచుపల్లి ఎంపీపీ బాదావత్ శాంతి, కాంగ్రెస్ నాయకులు నాగ సీతారాములు, బీజేపీ నాయకులు రంగా కిరణ్, ఎంపీటీసీ భద్రమ్మ, టీబీజీకే నాయకులు రజాక్, జర్నలిస్టు సంఘం టీయూడబ్ల్యూజే అధ్యక్షులు కల్లోజి శ్రీనివాస్, నాగమణి, నాగరాజు, ప్రమీల దంపతులు, లగడపాటి రమేష్, మొక్కల వెంకటయ్య, నుర్వి రాజశేఖర్, పల్లపోతు వాసు, ప్రముఖ న్యాయవాది అరికాల రవి కుమార్, పాల్వంచ వర్తక సంఘం చదలవాడ ప్రకాష్, యంగ్ ఇండియా బ్లడ్ డొనరస్ క్లబ్ బాలు తదితరులు పాల్గొన్నారు.



సంతు సేవాలాల్ మహారాజ్ జయంతిని ఘనంగా నిర్వహించాలి

నవతెలంగాణ-పాల్వంచ

ఫిబ్రవరి 15న బంజారాల ఆరాధ్య దైవమైన శ్రీ సంతు సేవాలాల్ మహారాజ్ జయంతిని పురస్కరించుకొని ఘనంగా నిర్వహించాలని కమిటీ అధ్యక్షులు బానోతు బాలు నాయక్ పిలుపునిచ్చారు. ఆదివారం పాల్వంచ పట్టణంలో బొల్లోరుగూడెంలో గల బంజారా భవన్లో కమిటీ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ జె.మోతిలాల్, డిప్యూటీ స్థపతి రానున్నారని చెప్పారు. భోగి బండారు పూజ ఘనంగా నిర్వహించాలని కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ భూక్య చందు నాయక్, ప్రధాన కార్యదర్శి కోర్ర రాములు, ట్రెజరర్ సక్రం పాటల బంజారా నాయకులు, ప్రముఖులు కలసి విజయవంతం చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో బానోత్ రాముల నాయక్, విజయ్, మంగీలాల్, వెంకన్న, రాందాస్, తేజావత్ మనోహర్, బవ్ సింగ్, ఎంపీటీసీ శంకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

పీవైఎల్ నూతన అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక



నవతెలంగాణ-ఆళ్ళపల్లి (గుండాల)

ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) మండల అధ్యక్ష, కార్యదర్శులుగా తాటి రమేష్, ఎనగంటి లాజర్‌లను ఆ సంఘం నాయకులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు ఆదివారం పివైఎల్ మండల ఏడవ మహాసభ మండల పరిధిలోని చీమల గూడెం గ్రామంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ.. నీళ్లు, నిధులు నియామకాల కోసం ప్రత్యేక తెలంగాణ ఉద్యమం జరిగిందని అన్నారు. ఈ ఉద్యమంలో 1400 మందికి పైగా అమరులయ్యారని చెప్పారు. రాష్ట్రం ఏర్పడితే ఇంటికో ఉద్యోగం ఇస్తానన్న ముఖ్యమంత్రి మాట నీటి మూటగానే మిగిలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ నిరుద్యోగ భృతిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభలో 23 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు.



ప్రజలు ఆశీర్వదిస్తే ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తా

- ముఖ్య కార్యకర్తల సమావేశంలో దనసరి సూర్య

నవతెలంగాణ-మణుగూరు

ప్రజలు ఆశీర్వదిస్తే కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తానని దనసరి సీతక్క తనయుడు దనసరి సూర్య అన్నారు. ఆదివారం తొగ్గూడెం గ్రామపంచాయతీ పరిధిలోని సమ్మక్క సారక్క ఆలయం ప్రాంగణంలో నిర్వహించిన పినపాక నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఎలాంటి విభేధాలు లేకుండా పనిచేయాలని ఆయన కార్యకర్తలకు సూచించారు. రాహుల్‌గాంధీ నిర్వహించే జోడో యాత్రకు కొనసాగింపుగా ఫిబ్రవరి 6వ తారీకున రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే హత్ సే హత్ జోడో యాత్రలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అంతర్గత వర్గ విభేదాలు లేకుండా అధిష్టానం ఎవరికి బిఫాం ఇచ్చి ఎమ్మెల్యే అభ్యర్థిగా నియమించిన స్వచ్ఛందంగా కార్యకర్తగా పనిచేసి ఎమ్యెల్యే అభ్యర్థిని గెలిపించే విధంగా కృషి చేస్తానన్నారు. అనంతరం ఆయనను కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గూడెంలో వికేర్ మల్టీస్ స్పెషలిస్ట్ హాస్పిటల్

- ప్రారంభించిన ఎమ్మెల్యే వనమా



నవతెలంగాణ-కొత్తగూడెం

కొత్తగూడెం లక్ష్మీదేవి పల్లి మండలంలోని మొరేడు బ్రిడ్జి వద్ద 'వి కేర్ ' మల్టీస్ స్పెషలిస్ట్ హాస్పిటల్‌ను ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ఆదివారం ప్రారంభించి, మాట్లడారు. పేదలకు, మధ్యతరగతి ప్రజానికానికి మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు ఎమ్మెల్యే హరిప్రియ నాయక్, మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి, గ్రంథాలయ కమిటీ చైర్మన్ దిండిగల రాజేందర్, పట్టణ సీనియర్ వైద్యులు డాక్టర్ ఏ.నాగరాజు, ఉర్దూఘర్ కమిటీ చైర్మన్ అన్వర్ పాషా, డైరెక్టర్లు యాకూబ్, జానీ, శేషాద్రి వినోద్, రైతు సమన్వయ కమిటీ సభ్యులు కృష్ణార్జున రావు, అజయ్, స్థానిక టిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, వి కేర్ హాస్పిటల్ యాజమాన్యం, సిబ్బంది పాల్గొన్నారు.

కాళ్ళూరు కుటుంబాన్ని పరామర్శించిన పొంగులేటి



నవతెలంగాణ-జూలూరుపాడు

మండలంలోని అనంతారం గ్రామంలోని బండారు వెంకటేశ్వర్లు కుమారుని వివాహం అనంతరం వారి ఇంటికి వెళ్లి నూతన వధూవరులను ఆశీర్వదించి వారికి కానుకగా నూతన వస్త్రలను మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి బహుకరించారు. అదేవిధంగా మండలం గుండుపూడి గ్రామానికి చెందిన కాళ్లూరు యతిరాజ్ కుమార్ (ఎబిఎస్ రాజు) ఈ నెల 23వ తేదీన మృతి చెందారు. విషయం తెలుసుకుని పొంగులేటి ఏబీఎస్ రాజు స్వగృహానికి వెళ్లి రాజ్ కుమార్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. అనంతరం అదే గ్రామానికు చెందిన మాజీ పంచాయతీ గుమ్మస్తా వెంకటేశ్వర్లు కుటుంబాన్ని పరామర్శించి వారికి తనవంతు సహాయంగా ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో జూలూరుపాడు ప్రాథమిక సహకారం అధ్యక్షుడు లేళ్ళ.వెంకటరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు మధుసూదనరావు, పొంగులేటి అభిమానులు, పాల్గొన్నారు.

ముత్యాలమ్మ జాతరకు సిద్ధం

ఫిబ్రవరి 6 నుండి 14 వరకు

22వ జాతర మహోత్సవములు

- వివిధ రాష్ట్రాల నుండి వేలాదిగా తరలి రానున్న భక్తులు
- తొమ్మిది రోజుల పాటు నిండు జాతర ఉత్సవాలు
- ప్రతి రోజు భక్తులకు నిత్య అన్నదాన కార్యక్రమం
- రాత్రి పూట సాంస్కృతి కార్యక్రమాలు



నవతెలంగాణ-దుమ్ముగూడెం

మండల కేంద్రమైన దుమ్ముగూడెం గ్రామంలో తర తరాలుగా వెలసిన గ్రామ దేవత శ్రీ ముత్యాలమ్మ తల్లి మహిమలు కలిగిన గ్రామ దేవతగా దిన దినాభివృద్ధి చెందుతోంది. కోరిన భక్తులకు కొంగు బంగారంగా వరాలిచ్చే తల్లిగా శ్రీ ముత్యాలమ్మ అమ్మవారు తెలుగు రాష్ట్రాలతో పాటు చత్తీష్‌ఘడ్ రాష్ట్రంలో తెలియని వారు ఉండరనే చెప్పవచ్చు. అంతటి మహిమలు కలిగిన శ్రీ ముత్యాలమ్మ జాతర ఉత్సవాలను ప్రతి రెండేళ్లకు ఒక సారి అంగరంగ వైభవంగా నిర్వ హించుకోవడం అనవాయితీగా వస్తోంది. అంతటి విశిష్టత కలిగిన శ్రీ ముత్యాలమ్మ జాతర మహోత్స వాలకు జాతర ఘడియలు దగ్గర పడుతున్నాయి. ఫిబ్రవరి 6వ తేదీ నుండి 14 వరకు 22వ జాతర ఉత్సవాలను తొమ్మిది రోజుల పాటు నిర్వహించేం దుకు ఆలయ కమిటీ వారు సర్వ సిద్ధం చేస్తున్నారు.



వేలాదిగా తరలి రానున్న భక్తులు

దుమ్ముగూడెం గ్రామంలో తర తరాలుగా వెలసిన గ్రామ దేవత శ్రీ ముత్యాలమ్మతల్లి 22వ జాతర మహోత్సవాలకు భక్తులు వేలాదిగి తరలి రానున్నారు. తొమ్మిది రోజుల పాటు జరిగే జాతర ఉత్సవాలకు రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలతో పాటు చత్తీష్‌ఘడ్, మధ్యప్రదేశ్, ఒరిస్సా తదితర రాష్ట్రాల నుండి భక్తులు ఇక్కడకు అమ్మవారిని దర్శించుకోవడం కోసం రానున్నారు. దీంతో పాటు అమ్మవారికి పదుల సంఖ్యలో ఎన్నారైలు కూడా కలిగి ఉన్నారనే చెప్పవచ్చు. జాతర సమయంలో సుమారు లక్ష మంది భక్తులు అమ్మవారిని దర్శించుకోనున్నట్లు ఆలయ కమిటీ వారు తెలుపుతున్నారు.

తొమ్మిది రోజుల పాటు నిండు జాతర

ఫిబ్రవరి 6వ తేదీ నుండి 14వ తేదీ వరకు తొమ్మిది రోజుల పాటు శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి 22వ నిండు జాతర కొనసాగనుంది. తొమ్మిది రోజుల పాటు అమ్మవారికి ఉదయం సాయంత్రం విశేష పూజలతో పాటు భక్తులు అందజేసిన పట్టు చీరలతో రెండు పూటలా ప్రత్యేక అలంకరణ నిర్వహిస్తారు. దర్శనం కోసం వచ్చిన భక్తులకు తీర్థ, ప్రసాదాలతో ఉచిత అన్నదానం అందజేస్తారు. భక్తులకు ఎటు వంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీతో పాటు దుమ్ముగూడెం పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు తీసుకోనుంది. తొమ్మిది రోజుల పాటు రాత్రి పూట సినీ ఆర్టిస్టులచే సంగీత విభావరి, బుర్రకథ, హరికథా కాలక్షేపం వంటి అబ్బురపరచే సాంస్కృతిక కార్యక్ర మాలు వినోదం కోసం నిర్వహిస్తారు. అఖరి రోజు అమ్మవారి నిండు ఊరేగింపుతో పాటు పెద్ద ఎత్తున బాణసంచా, విచిత్ర వేషధారణలు వంటి కార్యక్ర మాలు ఏర్పాటు చేస్తారు. ఏది ఎమైన శ్రీ ముత్యాల మ్మ అమ్మవారి నిండు జాతర తొమ్మిది రోజుల పాటు అత్యంత వైభవంగా సాగనుందనే చెప్పవచ్చు.

ముమ్మరంగా ఏర్పాట్లు : చుక్కా గణేష్ రెడ్డి (ఆలయ కమిటీ చైర్మన్)



దుమ్ముగూడెం గ్రామంలో వెలసిన గ్రామ దేవత శ్రీ ముత్యాలమ్మ 22వ జాతర మహోత్సవములకు ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ చుక్కా గణేష్ రెడ్డి నవతెలంగాణకు తెలిపారు. ఆలయ ప్రదాన గోపురంతో పాటు ఆలయం మొత్తం రంగులతో అలంకరణ, చలువ పందిళ్లు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. దీంతో పాటు కళా వేదిక, ఆలయ కమ్యూనిటీ హాలును సైతం రంగులతో సిద్ధం చేయడం జరిగిందన్నారు. భీమవరం వారిచే విద్యుత్ లైటింగ్ పనులు ప్రారంభించడం జరిగిందన్నారు. జాతరకు వచ్చే భక్తుల కోసం క్యూ లైన్లు సిద్ధం చేశామని, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీతో పాటు జాతర కమిటీ వారు అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. జాతరలో ఎటు వంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకో కుండా సీఐ దోమల రమేష్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. జాతరకు వచ్చే భక్తులకు తీర్థ, ప్రసాదాలు, అన్నదానం అందజేయడం జరుగుతుందన్నారు. రాత్రి పూట వినోదం కోసం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

కార్మికుల సమస్యలు పోరాటాల ద్వారా సాధించాలి



నవతెలంగాణ-కొత్తగూడెం

కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పోరాటాల ద్వారనే సాధించాలని సిఐటియూ పట్టణ కార్యదర్శి డి.వీరన్న అన్నారు. ఆదివారం కొత్తగూడెం కెఎస్ఎం మెడికల్ కాలేజ్ కాంట్రాక్టర్ కార్మికుల సిఐటియూ యూనియన్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కార్మికుల ఉద్దేశించి వీరన్న మాట్లాడారు. మెడికల్ కాలేజ్ కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు, ఇఎస్ఐ, పీఎఫ్ అమలు చేయాలని, వేతనాలు సకాలంలో అందజేయాలని, మెడికల్ కాలేజి నిబంధనలకు అనుగుణంగా కార్మికులకు పని ప్రదేశాల్లో రక్షణ చర్యలు, పరికరాలు అందజేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న 3 నెలల వేతనాలు వెంటనే అందజేయాలని లేని పక్షలంలో ఆందోళన తప్పదని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో సిఐటియూ యూనియన్ నాయకులు శ్రావణ్, మమత, సంతోష్, సాయి తదితరులు పాల్గొన్నారు.



సెంట్రల్ లైటింగ్ కోసం హైవే రోడ్‌పై ధర్నా

నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి

మండల పరిధిలోని గుంపెన కాలనీ నుండి శాంతినగర్ వరకు సుమారు 2 కిలోమీటర్లు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసిన అధికారులు గత 7 నెలలు నుండి వెలగడం లేదని సమస్య సంబంధిత అధికారులు దగ్గరకు, స్థానిక ప్రజలు తీసుకు వెళ్ళినా స్పందించక పోవడంతో టీపీసీసీ మెంబర్ సున్నం నాగమణి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వనమా గాంధీతో కలిసి యర్రగుంట హైవే రోడ్ పై బయటయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం 24 గంటలు కరెంట్ అని చెపుతూ హైవే రోడ్‌పై సెంట్రల్ లైటింగ్ వెలగక 7 నెలలు గడుస్తున్నా ప్రజలు చీకటిలో ప్రయాణాలు చేస్తూ తరుచూ రోడ్డు ప్రమాదాలకు గురి అవుతూ ప్రాణాలు పోతున్నాయన్నారు. లైటింగ్ ఏర్పాటు చేయకపోవడం చాలా దురదృష్టకరమని అని అన్నారు. విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని లేకపోతే దీపాలతో సబ్ స్టేషన్ ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, కాలం చెల్లిపోతున్న పార్టీ బీఆర్ఎస్ పార్టీ అని విమర్శించారు. గ్యాస్, డీజిల్, పెట్రోల్ వంటివి సామాన్యులు కొనలేని స్థితిలో వున్నారని, పేదలు కోసం ఉండే పార్టీ కాంగ్రెస్ అని నియోజక వర్గంలో వచ్చే ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం నల్లేరు మీద నడక అని ప్రజలు అంత కాంగ్రెస్ వైపు వున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరక్ట్ వెంకటరామయ్య, ప్రసాద్, జమలయ్య, పుల్లయ్య, కోటేశ్వరరావు, అహ్మద్, శ్రీను, పద్మశ్రీ ముత్తయ్య, బాలు, రవి తదితరులు పాల్గొన్నారు.



యువత క్రీడల్లో ముందుండాలి

నవతెలంగాణ-మణుగూరు

యువత క్రీడల్లో ముందుండాలని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు అడప అప్పారావు అన్నారు. ఆదివారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విప్, ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆదేశాల మేరకు వాలీబాల్ కిట్స్ పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్న రేగా కాంతారావు 2023 ఎన్నికల్లో గెలవడం ఖాయం అన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు, పట్టణ కార్యదర్శి నవీన్, సీనియర్ నాయకులు యాదగిరి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ మాల మహానాడు ఆధ్వర్యంలో బియ్యం అందజేత



నవతెలంగాణ-బూర్గంపాడు

మండల పరిధిలోని మోరంపల్లి బంజర గ్రామానికి చెందిన బొజ్జ పద్మ, పుట్టి ముత్తమ్మ, దాసరి జానులు కుటుంబాలకు ఆదివారం జాతీయ మాల మహానాడు ఆధ్వర్యంలో వితరణ అందజేశారు. పినపాక నియోజకవర్గ ఇన్చార్జ్, మండల అధ్యక్షుడు పిల్లి రవివర్మ, జిల్లా జాతీయ మాల మహానాడు మహిళా అధ్యక్షురాలు బోడ దివ్యల ఆధ్వర్యంలో వారి నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులకు 25, 75 కేజీల బియ్యం బ్యాగులను అందజేసి మానవత్వం చాటుకున్నారు. ఈ సందర్భంగా రవివర్మ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి సహకరించిన దాతలు తాటి రవి, పెరుమళ్ళ సురేష్, మీసాల సురేష్, కొట్టే రమేష్, ఆర్ఎంపీ గోవింద్, గడేసుల రమేష్, తుమ్మల బాలకృష్ణ, బత్తుల రమేష్, పర్వ ప్రవీణ్, గడేసుల లాజర్, తాటి శేఖర్, దారావత్ రాంబాబుల సహకారంతో బియ్యంను అందజేశామని ఆయన తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

సీఎం కేసీఆర్‌తోనే దేశ రాజకీయాలలో వెలుగులు

- నియోజవర్గాన్ని నెంబర్ వన్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం
- విప్, ఎమ్మెల్యే రేగా



నవతెలంగాణ-మణుగూరు

కేసీఆర్‌తోనే దేశ రాజకీయాలలో వెలుగులు వస్తాయని విప్, ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. ఆదివారం శేషగిరి నగర్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ కేసీఆర్‌తో దేశ రాజకీయాలలో వెలుగులు ఖాయమని, దేశ ప్రజల ఆకాంక్షితోనే బీఆర్ఎస్ ఉద్భవించినదని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీలో భారీ సంఖ్యలో వివిధ పార్టీల నుంచి చేరారన్నారు. పార్టీలో చేరిన అందరికీ సమ ప్రాధాన్యత ఇస్తామన్నారు. తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధినే దేశమంతా ఆచరిస్తుంది అన్నారు. గ్రామాలు పట్టణాలు అని తేడా లేకున్నా తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతుంన్నారు. ప్రతి గులాబీ సైనికుడిని గుండెల్లో పెట్టుకొని కాపాడుకుంటామన్నారు. పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని అన్నారు. పార్టీలో చేరిన వారందరికీ ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. పినపాక నియోజకవర్గ ప్రజలు ప్రశాంతమైన పాలనను కోరుకుంటున్నారని ఆయన అన్నారు. గ్రామాలలో అంతర్గత రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఆయన అన్నారు. పినపాక నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని వారన్నారు. మారుమూల ఏజెన్సీ ప్రాంతంలోని గ్రామాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ సారథ్యంలో అభివృద్ధి చేస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాలలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నదని గ్రామాల అభివృద్ధి కోసం మన ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తుందని తెలిపారు. సీసీ రోడ్ల నిర్మాణం, బీటీ రోడ్ల నిర్మాణం అంతర్గత రహదారుల నిర్మాణం వంటి పనులు చేపడుతున్నామని వారన్నారు. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఇప్పటివరకు దేశంలో ఎక్కడా అమలు చేయడం లేదని అన్నారు. దళిత బంధు పథకం ద్వారా దళితులు స్వయం సమృద్ధి సాధిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పోషణ నరసింహారావు, పీఏసీఎస్ చైర్మన్ కోడి నాగేశ్వరరావు, మణుగూరు అధ్యక్ష, కార్యద ర్శులు ముత్యం బాబు, రామిడి రామిరెడ్డి, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు అడపా అప్పారావు, నవీన్, బూర్గుల సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి రవాణా చేస్తున్న యువకుల అరెస్టు

- రూ.66 వేల విలువైన గంజాయి స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సీఐ అబ్బయ్య



నవతెలంగాణ-కొత్తగూడెం

అక్రమంగా గంజాయి రవాణ చేస్తున్న యువకులను త్రీ టౌన్ పోలీసులు అరెస్టు చేసి వారి నుండి సుమారు రూ.66 వేల విలువైన గంజాయి స్వాదీనం చేసుకన్నట్లు పట్టణ 3 టౌన్ సీఐ అబ్బయ్య తెలిపారు. శనివారం సాయంత్రం 3వ పట్టణ ఎస్ఐ సోమేశ్వర్ తన సిబ్బందితో రైతు బజారు వద్ద వహనాలు తనిఖీలు నిర్వహిస్తున్నారని, భద్రాచలం వైపు నుండి ఖమ్మం వైపు 2 బైకులపై వస్తూ పోలీసులను చూసి పారిపోవడానికి నలుగురు ప్రయత్నించగా పోలీసులు పట్టుకొని వారి వద్దనున్న బ్యాగులు తనిఖీ చేయగా అందులో 3 కెజిల ఎండు గంజాయిని స్వాదీనం చేసుకున్నారు. దాని విలువ రూ.66 వేలు ఉంటుందని చెప్పారు. వారిని విచారించగా సీలేరు నుండి ఖమ్మంకి తరలిస్తున్నట్లు, కాలేజ్ స్టూడెంట్స్‌కి అమ్మడానికి తీసుకువేళు తున్నారని ప్రాథమిక విచారణలో తేలిందని చెప్పారు. పట్టుబడ్డ నలుగురిలో జయశంకర్ జిల్లా కాటారం, ఇబ్రహీంపేట గ్రామస్థుడు అయిలపురం రఘుపతి, ఖమ్మం పాండురంగపురంకు చెందిన పొడకంటి హేమాన్ జీవన్ కుమార్, ఇబ్రహీంపేట గ్రామం, జయశంకర్ జిల్లాకు చెందిన గంధం అనిల్‌లు ఒక ముఠాగా ఏర్పడి అక్రమ రవాణా చేస్తున్నారని చెప్పారు. వీరు గతంలో ఖమ్మం, పెద్దపల్లి జిల్లాలో గంజాయి కలిగి ఉన్న కేసులలో జైలుకు వెళ్లి వచ్చారని తెలిపారు. జైలుకు వెళ్లిన వారి ప్రవర్తన మార్చుకోకుండా మళ్ళీ గంజాయి అమ్మాలనే ఉద్దేశ్యంతో కొత్తగూడెం లక్ష్మీదేవిపల్లి మండలంలో శ్రీనగర్‌లో జీవన్‌కు సంబంధించిన మరొక ఇంట్లో ఉంటూ అదే కాలనీలో రాత్రిపూట తాళం వేసి ఉన్న ఇంట్లో తాళం పగులగొట్టి ఇంట్లోకి దూరి బంగారు, వెండి నగలను దొంగిలించారని చెప్పారు. ఈ నెల 16న రాత్రిపూట సారపాకలో ఇంటి ముందు పార్క్ చేసిన ఒక బైక్‌ని, 21న భద్రాచలం సిఆర్‌పీఎఫ్ కాంప్ దగ్గర ఒక బైక్ ని దొంగిలించి అవే 2 బైక్‌ల మీద సీలేరు వెళ్లి అక్కడ కరణం సాయి అనే వ్యక్తి దగ్గర గంజాయి కొన్నారని, తిరగి అవే 2 బైక్ లపై నలుగురు ఖమ్మం వెళ్తుండగా కొత్తగూడెంలో పట్టు బడ్డారని వివరించారు. అదుపులోకి తీసుకున్న నలుగురిని వైద్య పరీక్షల అనంతరం కొత్తగూడెం కోర్ట్ లో హాజరు పరచినట్లు తెలిపారు. వారు ఇచ్చిన సమాచారం మేరకు కొత్తగూడెంలో గంజాయి సేవించే వాళ్ళ జాబితా తయారు చేయబడిందని, త్వరలోనే వారందరిపై చట్టపరంగా తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సీఎం కేసీఆర్ రోషమున్నోడు

- ప్రెస్ మీట్‌లో మాజీ ఎంపీ సీతారాం నాయక్



నవతెలంగాణ-భద్రాచలం

సీఎం కేసీఆర్ రోషమున్నోడని, అందుకే తెలంగాణ ఉద్యమంలో విజయకేతనం ఎగురవేశాడని, లక్ష్యాన్ని సాధించారని, దేశం అల్లకల్లోల పరిస్థితుల్లో...మళ్లీ దేశ ప్రగతిని కాంక్షిస్తూ జాతీయ రాజకీయాల్లో అడుగు పెడుతున్నారని, జాతీయ రాజకీయాల్లో సునామీ సృష్టించటం ఖాయమని మహబూబాబాద్ పార్లమెంటు మాజీ ఎంపీ అజ్మీరా సీతారాం నాయక్ వ్యాఖ్యానించారు. భద్రాచలంలో ఆదివారం ఆయన పాత్రికేయ సమావేశంలో మాట్లాడారు. దేశంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు స్వప్రయోజనాలకే ప్రాధాన్యమిచ్చి, దేశ ప్రగతిని నీరుగార్చారని, తద్వారా యావత్ భారత దేశ ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతూ దారుణమైన జీవితాలను అనుభవిస్తున్నారన్నారు. ఈ రెండు పార్టీలపై ప్రజలకు ఏమాత్రం నమ్మకం లేదని అన్నారు. ఈ విలేకర్ల సమావేశంలో టీఆర్ఎస్ పార్టీ భద్రాచలం మండల అధ్యక్షులు అరికెళ్ల తిరుపతిరావు, సీనియర్ నాయకులు తిప్పనసిద్దులు, పార్టీ మాజీ భద్రాచలం నియోజకవర్గం ఇంచార్జి మానే రామకృష్ణ, భద్రాచలం గ్రంథాలయం చైర్మన్ మామిడి పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.



"రేగా" మాట తీరు మార్చుకో

- చులకనగా మాట్లాడితే మూల్యం చెల్లించక తప్పదు
- సీపీఐ నియోజక వర్గ సమావేశంలో సాబీర్‌పాషా హెచ్చరిక

నవతెలంగాణ-కొత్తగూడెం

విప్, ఎమ్మెల్యే రేగా కాంతారావు మాట తీరు మార్చుకోవాలని లేకుంటే తగిన మూల్యం చెల్లించక తప్పదని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా హెచ్చరించారు. రేగా కాంతారావు వైఖరి ఏరు దాటి తెప్ప తగలేసేవిధంగా ఉంటుందని అదే దృష్టితో ఇప్పుడు కూడా చులకనగా మాట్లాడితే సహించబోమన్నారు. ఆదివారం స్థానిక శేషగిరి భవనంలో కొత్తగూడెం నియోజక వర్గ సిపిఐ కౌన్సిల్ సమావేశం జరిగింది. వీసంశెట్టి పూర్ణచంద్రరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాష మాట్లాడుతూ రేగా కాంతారావు కమ్యూనిస్టులతో పొత్తు కుదిరిందని రాజ్యసభ, ఎంఎల్సీలు ఇచ్చేస్తే సరిపోతుందని చులకనగా మాట్లాడడం సరైంది కాదన్నారు. ఎంఎల్సీల కోసమో, రాజ్యసభ పదవుల కోసమో లేక మార్కెట్ కమిటీల కోసమో బీఆర్ఎస్‌కు మద్దతునివ్వడం లేన్నారు. విశాల దృక్పథంతో బిజెపి ముప్పును గ్రహించి బిజెపిని కట్టడి చేసేందుకు మాత్రమే అంశాల వారీ మద్దతునిస్తున్నామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బందెల నర్సయ్య, ముత్యాల విశ్వనాథం, గుత్తుల సత్యనారాయణ, వై. శ్రీనివాసరెడ్డి, వీరస్వామి, వెంకట్, శేషయ్య, కుమారి హన్మంతరావు, రత్నకుమారి, సంపూర్ణ, పద్మజ, రాము తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి విద్యుత్ స్తంభాలపై వేసిన కేబుల్స్ తొలగించాలి

నవతెలంగాణ-ఇల్లందు

ఈఅండ్ఎం ఆదేశానుసారం ఇల్లందు ఏరియాలో సింగరేణి సంస్థ ఏర్పాటుచేసిన విద్యుత్ స్తంభాలపై ఉన్న ఇంటర్నెట్/కేబుల్ టీవీల కేబుల్స్ తొలగించాలని జీఎం ఆదేశించారు. కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఏరియా జీఎం యం.షాలెం రాజు మాట్లాడుతూ తరచూ జరుగుతున్న తనిఖీలలో భాగంగా ఒక ఇంటర్నెట్ ప్రొవైడర్ కే.వి ఇండస్ట్రియల్ ఫీడర్ పై (ఓఎఫ్‌సీ) కేబుల్ వేస్తున్నట్లు గుర్తించామన్నారు. ఆ పనిని వర్క్ షాప్ సిబ్బంది అడ్డుకున్నారు, ఆ కేబుల్ బండిల్‌ను భద్రత సిబ్బందితో తొలగించి నిర్బంధించినట్లు తెలిపారు. అంతేకాకుండా కాలనీలో 33 కె.వి, 3.3 కె.వి స్తంభాలపై టీవీ నెట్వర్క్ కేబులు వేసినట్లు గుర్తించామన్నారు. 33 కె.వి, 3.3 కె.వి కరెంటు స్తంభాలు చాలా ప్రమాదకరమన్నారు.

అనుదినం...జనస్వరం
www.praja.khammam@gmail.com
నవతెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
సోమవారం 30 జనవరి 2023

నేడే కలెక్టరేట్‌లో ప్రజావాణి

పాల్వంచ : నేడు ప్రజావాణి కార్యక్రమం సమీకృత జిల్లా అధికారుల సముదాయపు కార్యాలయం, కలెక్టరేట్ నూతన సముదాయంలో నిర్వహించనున్నట్లు డీఆర్‌ఓ అశోక్ చక్రవర్తి తెలిపారు. ప్రజలు వారి ఫిర్యాదుకు సంబంధించిన అంశంపై లిఖిత పూర్వకంగా అందచేయాలని ఆయన చెప్పారు. ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమవుతుందని అన్ని శాఖల జిల్లా అధికారులు సకాలంలో హాజరు కావాలని ఆయన సూచించారు.

మూడో రోజు కోటి సంతకాల సేకరణ

ఇల్లందు : బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో 3వ రోజు ఆదివారం బీసీ రిజర్వేషన్లకు పెంపుదలకు మద్దతుగా కోటి సంతకాల సేకరణ ఇల్లందులోని జగదాంబ సెంటర్లో నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎస్పీ ఇల్లందు నియోజకవర్గ అధ్యక్షులు బాదావత్ ప్రతాప్ మాట్లాడుతూ దేశ జనాభాలో బీసీల శాతం 52శాతం కంటే ఎక్కువగా ఉన్నారు, కావున బీసీలకు 52శాతం రిజర్వేషన్లు పెంచాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే బీసీ కుల గణన చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మూడు రోజులపాటు జరుగుతుంది అన్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ఇదే కార్యక్రమంను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి లేతాకుల కాంతారావు, జిల్లా నాయకులు రాయల శ్రీనివాసరావు, పప్పుల గోపీనాథ్, నియోజకవర్గ ఇన్చార్జి తచ్చడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మించండి

- తేలిన కంకరపై సీపీఐ(ఎం) నిరసన



నవతెలంగాణ-చండ్రుగొండ

చండ్రుగొండ నుంచి గుర్రాయి గూడెం వెళ్లే రోడ్డు నిర్మించాలని సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో కంకర తేలిన రోడ్డుపై ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు మిరియాల మోహన్ రావు మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్ట్, రైల్వే లైన్ నిర్మాణం భారీ భవనాలు అధిక లోడ్లతో తిరగటం వల్ల రోడ్డు గుంటలే పడి, కంకర్ తేలి ప్రమాదకరంగా మారింది. కంకర్ తేలిన రోడ్డుపై స్కిడ్ ఐ పడటంతో వాహనదారులు క్షతగాత్రులుగా మారుతున్నారన్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) నాయకులు షేక్ నాగుల మీర, అబ్దుల్ రెహమాన్, షేక్ బాబు, జె.రాము, నందూరి వినోద్, వీధివాసులు జనార్ధన్, రాము తదితరులు పాల్గొన్నారు.

కార్మిక పక్షపాతి రజాక్ పాషా



నవతెలంగాణ-మణుగూరు

కార్మిక పక్షపాతిగా రజాక్ పాషా తమ సేవలందించారని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కోడిశాల రాములు అన్నారు. ఆదివారం ఎస్ఎంఎస్ ప్లాంట్ ప్రాజెక్ట్ మేనేజర్ ఎండి రజాక్ పాషా సన్మాన కార్యక్రమంలో సీపీఐ(ఎం), సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు. ఎస్ఎంఎస్ ప్లాంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ రజాక్ పాషా రిటైర్డ్ అవుతున్న సందర్భంగా ప్లాంట్ ఆవరణంలో సూపర్వైజర్లు కార్మికులు కలిసి వారికి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలుపుతూ సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ ఉప్పుతల నరసింహారావు, గుర్రం నరసయ్య, సీఐటీయూ నాయకులు బింగి మాదారావు, కృష్ణయ్య, నిరంజన్, లక్ష్మణ్, పుల్లయ్య, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న ఫార్మా కంపెనీలు

నవతెలంగాణ-కొత్తగూడెం

ఫార్మా కంపెనీలు కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నాయని సీఐటీయూ జిల్లా సభ్యులు భుక్యా రమేష్, లిక్కి బాలరాజు అన్నారు. ఆదివారం కొత్తగూడెం తెలంగాణ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్ యూనియన్ కొత్తగూడెం శాఖ 9వ మహాసభ కొత్తగూడెం మంచి కంటి భవన్‌లో జరిగింది. ఈ సమావేశంలో 2022కు సంబంధించిన నివేదికను ఎస్‌కే.ఎ.సి. పాషా ప్రవేశపెట్టారు. ఈ మహాసభలో టీఎంఎస్ఆర్‌యూ రాష్ట్ర కార్యదర్శి ఎం.ఎ.సిద్ధిక్ హాజరయ్యారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న కార్మిక వ్యతిరేక విధానాలు, ఫార్మా కంపెనీలు అవలంబిస్తున్న పని గంటల విధానాల గురించి తెలిపారు. సీఐటీయూ జిల్లా సభ్యులు భుక్యా రమేష్, లిక్కి బాలరాజు పాల్గొని మాట్లాడారు. సభ అనంతరం నూతన కమిటీ ఎన్నిక జరిగింది.

నూతన కమిటీ : తెలంగాణ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్ యూనియన్ కొత్తగూడెం నూతన కార్యవర్గంలో నూతన అధ్యక్షునిగా సిహెచ్.కిరణ్ కుమార్, (హెటరో కంపెనీ) కార్యదర్శిగా ఎస్‌కెఏ.సి.పాష (అల్కెంలాబొరేటరీస్) కోశాధికారిగా జె.మధు బాబు, (అరబిందో ఫార్మా సిటికల్స్) ఎనిమిది మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

ఉద్యోగులందరూ ప్లాంట్ అభివృద్ధికి కృషి చేయాలి

- 2023 డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణలో బీటీపీఎస్ సీఈ

మణుగూరు : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో పనిచేస్తున్న ఉద్యోగులందరూ పవర్ ప్లాంట్ అభివృద్ధికి కృషి చేయాలని బీటీపీఎస్ సీఈ బిచ్చన్న అన్నారు. ఆదివారం టీఆర్‌వికెఎస్ యూనియన్, బీటీపీఎస్ రీజియన్ ఆధ్వర్యంలో 2023 డైరీ, క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఓ అండ్‌ఎం, అకౌంట్స్ ఉద్యోగుల సమస్యలను తెలుపగా త్వరలోనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. షిఫ్ట్ అలవెన్స్, ఓ అండ్ ఎం శాంక్షన్ పోస్టులకై మేనేజ్‌మెంట్ దృష్టికి తీసకెళ్తానని తెలిపారు. అనంతరం ఎస్ఈలు పార్వతి, సూర్యనారాయణ, రామ్మోహన్ రాంప్రసాద్, ఇంచార్జి శ్రీనివాస్, మురళీకృష్ణ, రవీందర్, చంద్రశేఖర్‌లకు యూనియన్ 2023వ సంవత్సర డైరీని, క్యాలెండర్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఆర్‌వికెఎస్ రీజనల్ నాయకులు, జెన్కో నాయకులు, యూనియన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పాము కాటుతో వ్యక్తికి అస్వస్తత

ఆళ్ళపల్లి (గుండాల) : పాము కాటేయడంతో వ్యక్తి అస్వస్థతకు గురైన సంఘటన గుండాల మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. బాధితుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... సాయనపల్లి గ్రామ పంచాయతీ ఘనాపురం గ్రామానికి చెందిన వూకె బుచ్చయ్య ఆదివారం పత్తి చేను దగ్గరకి వెళ్ళాడు. అక్కడ తనకు పాము కాటు వేయటంతో అస్వస్థతకు గురయ్యాడు. అది గమనించి 108 వాహనానికి సమాచారం ఇచ్చాము. దీనికి ముందు వేరే పేషెంట్‌ను తీసుకుని స్థానిక 108 వాహనం ఇల్లందు వెళ్లడంతో మరోదారి లేక ట్రాక్టర్‌పై గుండాల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకుని వచ్చామని బుచ్చయ్య కుటుంబీకులు తెలిపారు. అక్కడ చికిత్స అందించిన వైద్య సిబ్బంది బుచ్చయ్య పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం ఇల్లందు వెళ్లాల్సిందిగా సూచించారు. వైద్య సిబ్బంది సమాచారం మేరకు వచ్చిన ఆళ్లపల్లి 108 వాహనంలో ఇల్లందు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతని ఆరోగ్యం నిలకడగా ఉందని అక్కడి వైద్యులు తెలిపారు.

సేవ్ కాంగ్రెస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

నవతెలంగాణ-కొత్తగూడెం

సేవ్ కాంగ్రెస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, త్వరలో ప్రారంభం కానున్న టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి పాదయాత్ర విజయవంతం చేయాలని జిల్లా కాంగ్రెస్ నాయకులు లక్కినేని సురేందర్, డాక్టర్ శంకర్ నాయక్ అన్నారు. ఆదివారం కొత్తగూడెం నియోజకవర్గం చుంచుపల్లి మండలం విద్యానగర్ కాలనీలో ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ...సేవ్ కాంగ్రెస్ కార్యక్రమం ఉమ్మడి జిల్లా ముఖ్య నాయకుల అందరితో కలిపి ఖమ్మంలో ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ నాయకులు అందరూ పాల్గొని కాంగ్రెస్ పార్టీని రక్షించుకొనే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. డీసీసీ అధ్యక్షులు పోదెం వీరయ్య వ్యవహరిస్తున్న తీరు గెలిచే సీట్లు కూడా ఓటమికి గురయ్యేలా ఉందని వాపోయారు. 'హత్ సే హత్ జోడో యాత్ర' భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో మణుగూరు, ములకపల్లి, బూర్గంపాడు మండల అధ్యక్షులు గురజాల గోపి, పేటేటి నరసింహారావు, సుధాకర్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు దల్ సింగ్ నాయక్, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు 24 గంటల కరెంటు సౌకర్యం కల్పించాలి



నవతెలంగాణ-ములకలపల్లి

రైతులకు 24 గంటల కరెంటు సౌకర్యం కల్పించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని సంఘం కార్యాలయంలో జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. వేసంగి రైతులు కరెంటు సౌకర్యం లేక ఆందోళన చెందుతున్నారని అన్నారు. ప్రతి ట్రాన్స్ఫారానికి ఏపీ స్విచ్ బోర్డును అమర్చాలని డిమాండ్ చేశారు. రైతులకు ఒకే దఫాలో రైతు రుణాలను వెంటనే మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు కేరళ తరహాలో క్వింటాకు రూ.2800 గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి ఊకంటి రవికుమార్, గోపగాని లక్ష్మీ నరసయ్య, గడ్డం వెంకటేశ్వర్లు, గోగ్గల ఆదినారాయణ, వర్షా శ్రీరాములు, భూక్య శ్రీదేవి, గూగులోతు హేమని, జగ్గు, పోడియం రాంమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

నవతెలంగాణ-కొత్తగూడెం

కార్మికులకు క్రీడలలో మానసిక ఉల్లాసం కలుగుతుందని సింగరేణి ఏరియా అధికారులు అన్నారు. సింగరేణి కొత్తగూడెం ఏరియాలో వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ అన్యువల్ డే సెలబ్రేషన్ ఏరియా జీఎర్ జక్కం రమేష్ ఆదేశాల మేరకు రుద్రంపూర్ ఆర్‌సిఓఏ, క్లబ్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏరియా డివైజియం పర్సనల్ సామ్యూల్ సుధాకర్, టీబీజీకేస్ కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఎండి.రజాక్ పాల్గొని మాట్లాడారు. డిపార్ట్మెంటల్ స్పోర్ట్స్, గేమ్స్‌లలో విజయం సాధించిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పివీకే గ్రూప్ ఏజెంట్ రవీందర్, మేనేజర్ పాలడుగు శ్రీనివాస్, అధికారులు రామకృష్ణ, సీనియర్ పీవోస్ మురళి, సుధాకర్, సెక్రెటరీ అజయ్ స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ రాజశేఖర్, నిమ్మల రాజేశ్వరరావు, ప్రేమ్ కుమార్, బన్ను, టీఆర్ఎస్ రాజు, పాల్గొన్నారు.

పంప్ హౌస్ నిర్మాణ పనులకు శంకుస్థాపన

- 17వేల ఎకరాలకు సాగునీరు
- విప్, ఎమ్మెల్యే రేగా కాంతారావు



నవతెలంగాణ-అశ్వాపురం

మండల పరిధిలోని బిజీ కొత్తూరు గ్రామంలో సీతారామ ప్రాజెక్టు పంప్ హౌస్ అనుబంధంగా మండలంలోని ఆయకట్టుకు నీరు అందించేందుకు సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ అదనపు ఆయకట్టు పంప్ హౌస్‌కు రూ.సుమారు 25 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న పనులకు ఆదివారం ప్రభుత్వ విప్, పినపాక శాసనసభ్యులు రేగా కాంతారావు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మారెళ్ళపాడు ఎత్తిపోతల పథకంతో మండలం సస్యశ్యామలం కానున్నదన్నారు. మండలాన్ని సస్యశ్యామలం చేసేందుకు సీఎం కేసీఆర్ కృషితో మండలంలో 17 వేల ఎకరాలకు సాగునీరు అందించే గొప్ప లక్ష్యంతో లిఫ్టుకు రూపకల్పన చేసి నిధులు మంజూరు చేసి నేడు శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. సీతారామ ప్రాజెక్టు ప్రధాన కాలువకు అనుబంధంగా పంప్ హౌస్ నిర్మించనున్నారు. గొందిగూడెం గ్రామంలో డెలివరీ సిస్టం ఏర్పాటు చేసి పంప్ హౌస్ నుంచి పైప్ లైన్ ద్వారా డెలివరీ సిస్టంకు తరలిస్తారన్నారు. అక్కడ నుండి గ్రావిటి ద్వారా ఎడమ కాలువ కుడి కాలువ ద్వారా మండలంలోని ప్రధాన సాగునీటికి అవసరమైన మండలంలోని అన్ని చెరువులలోకి, కుంటలకు నీరు చేరు తుందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సూది రెడ్డి సులక్షణ, వైస్ ఎంపీపీ కంచుకట్ల వీరభద్రం, ఎంపీటీసీ తాటి పూజిత, మొండికుంట సర్పంచ్ మర్రి మల్లారెడ్డి రామ చంద్రపురం, నెల్లిపాక బంజరు, సీతారాంపురం, గొల్లగూడెం సర్పంచులు అశోక్, వెంకటరమణ, సుజాత, కొల్లు మల్లారెడ్డి, తుమ్మలచెరువు ఆయకట్టు రైతులు పాల్గొన్నారు.





నిష్పక్ష వార్తలకు నిదర్శనం 'నవతెలంగాణ' : సీఈ

- ప్రజలు మెచ్చిన మంచి పత్రిక : జీఎం

నవతెలంగాణ-మణుగూరు

నిష్పక్షవార్తలకు నిదర్శనంగా నవతెలంగాణ ప్రజల గుండెల్లో స్థిర స్థాయికి నిలిచిందని బీటీపీఎస్ సీఈ బి.బుచ్చన్న అన్నారు. విమర్శలను ప్రశంసలుగా చేసుకొని ముందుకు సాగుతున్న నిజమైన తెలుగు దినపత్రిక నవతెలంగాణ అని, ప్రజలు మెచ్చిన మంచి పత్రిక ప్రజా సమస్యలపై రాజీ పడకుండా వార్తలు ప్రచురించే ఏకైక పత్రిక అని సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్ జి.వెంకటేశ్వర్ రెడ్డి, ఎస్ఓటు జీఎం లలిత్ కుమార్ అన్నారు. ఆదివారం 2023 నూతన క్యాలెండర్‌ని ఆవిష్కరించిన అనంతరం వారు మాట్లాడుతూ నవతెలంగాణలో విశ్లేషణాత్మక వ్యాసాలు ఉంటాయన్నారు. ప్రజలను రాజకీయ పరచడంలో నవతెలంగాణకు ప్రత్యేక స్థానం ఉన్నదన్నారు. నూతన క్యాలెండర్ ఎంతో ఆకర్షణీయంగా అందంగా ఉందన్నారు. ఏడాదికి ఏడాది నూతన ఆకర్షణలతో పాఠకులను ఆకట్టుకుంటున్నది అన్నారు. ఈ కార్యక్రమంలో దామల్ల వెంకన్న, గాజులవరపు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ముస్లింల సంక్షేమమే ధ్యేయంగా పనిచేయాలి

- నూతన కమిటీ ప్రమాణ స్వీకారంలో జిల్లా అధ్యక్షుడు ఎండి యాకుబ్ పాషా



నవతెలంగాణ-అశ్వాపురం

ముస్లిం-మైనారిటీల సంక్షేమమే ధ్యేయంగా నూతనంగా ఎన్నికైన కమిటీ పనిచేయాలని ముస్లిం మైనార్టీల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండి యాకుబ్ పాషా అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని దోసపాటి రంగారావు-భారతి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ముస్లిం-మైనారిటీల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మండలంలోని ముస్లింల గ్రామాల్లో ఉన్న మసీదుల అభివృద్ధితో పాటు మండల కేంద్రంలో నూతన షాదీకాణ నిర్మాణానికి కృషి చేయాలని కోరారు. అదే విధంగా ఈద్గా, కబ్రస్తాన్ అభివృద్ధి కోసం స్థానిక ప్రజా ప్రతినిధులను కలిసి వారిచే అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టే విధంగా పూనుకోవాలన్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించి వారికి సన్మానాలు చేశారు.

నూతన కమిటీ : అధ్యక్ష-ప్రధాన కార్యదర్శులుగా ఎస్.కే.బషీర్, ఎమ్.డీ.అబ్దుల్ అజీజ్, గౌరవ అధ్యక్షు లు ఎస్డీ. మస్తాన్, ఉపాధ్యక్షులు అబ్దుల్ బారీ, జా యింట్ సెక్రటరీ జానీ బాషా, ఆర్గనైజింగ్ కార్యదర్శి బాజీ బాబా, వెల్ఫేర్ సెక్రటరీ ఎస్.కే.సత్తార్, ఆఫీస్ బ్యారర్ ఎమ్.డీ.అమర్, కోశాధికారి ఎమ్.డీ.అబ్దుల్ అహ్మద్, సలహాదారులుగా ఏడుగురు సదర్లు, పదహా రు మందితో కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్ర మంలో ఎస్.కే.ఖాజా, ఎమ్.ఏ.గఫార్, ఎస్.కే. ఇమా మ్, ఎస్.కే.ఖలీల్, యాకుబ్ ఆలీ, జానీ షాహిద్, దస్తగిరి, గంజిబాబు, ఖదీర్, షబ్బార్ పాల్గొన్నారు.



మండల అధ్యక్షులు ఎస్‌కే.బషీర్



ప్రధానకార్యదర్శి అజీజ్

మాట నిలబెట్టుకోవాలి : సీపీఐ(ఎం)

నవతెలంగాణ-కరకగూడెం

వ్యవసాయానికి 24 గంటలు కరెంటు ఇచ్చే విషయంలో తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని విద్యుత్ కోతలు ఎత్తివేసేలా చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కొమరం కాంతారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులు విస్తృతంగా యాసంగి సీజన్లో వరి సాగు చేస్తూ నాట్లు వేస్తున్నారని నీటి కోసం మోటార్ల వినియోగంతో పెద్ద ఎత్తున సాగు విస్తీర్ణం పెరిగిందని అన్నారు. కరెంటు కోతలతో రైతాంగం మొత్తం దిగాలు చెందుతున్నారని వాపోయారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి కోతలు లేకుండా నిరంతరాయంగా కరెంట్ సరఫరా జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని లేనియెడల పార్టీ ఆధ్వర్యంలో రైతులతో విద్యుత్ సబ్ స్టేషన్ ముట్టడిస్తామని అన్నారు.

కార్మికుల పట్ల యాజమాన్యం చిన్నచూపు విడనాడాలి

- కార్మికులకు మద్దతు తెలిపిన సీపీఐ

మణుగూరు : ప్రీమియర్ ఎక్స్ ప్లోజివ్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీపీఐ మండల కార్యదర్శి జంగం మోహన్‌రావు డిమాండ్ చేశారు. ఆదివారం కార్మికుల సమ్మెకు మద్దతు తెలిపి ఆయన మాట్లాడుతూ గిరిజనులు భూనిర్వాసితులైన కార్మికుల పట్ల యాజమాన్యం చిన్న చూపు వీడాలని, లేకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సింగరేణి ఓసీ నిర్వాసితులైనటువంటి గిరిజన పేద బడుగు బలహీన వర్గాలకు చెందిన కార్మికులు గత 30 ఏండ్లుగా ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ కంపెనీలో పనిచేస్తున్నారని, వారికి కనీస అవసరాలు కల్పించకుండా జీతభత్యాలు చట్టప్రకారం ఇవ్వకుండా, వారిని వెట్టి చాకిరి చేపిస్తూ ఇబ్బందులు గురి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సమైక్య రాష్ట్ర ఉపాధ్యక్షులు సోందే కుటుంబరావు, వార్డు మెంబర్లు వజ్జా వెంకటేశ్వర్లు, కార్మికులు ఎర్రయ్య యాకయ్య, బుచ్చి రాములు, అశోక్, బాబురావు, నరసింహారావు, మాధవరావు బాబురావు, కార్మికులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా జాతర జరుపుకోవాలి : కోరం

నవతెలంగాణ-ఆళ్ళపల్లి

కొమరం వంశీయుల ఆరాధ్య దైవమైన రెక్కల రామక్క జాతరను కన్నుల పండువగా జరుపుకోవాలని జెడ్పీ ఛైర్మన్ కోరం కనకయ్య, పినపాక ఏఈఓ కొమరం లక్ష్మణరావు, స్థానిక కొమరం వంశీయులతో చెప్పారు. ఈ మేరకు ఆదివారం మండల పరిధిలోని పెద్దూరు గ్రామంలో ఆయన కుల దైవమైన రెక్కల రామక్కను దర్శించుకున్నారు. అనంతరం ఆయన ఆలయ ప్రాంగణంలో ఆలయ కమిటీ, కుల పెద్దలతో దేవత మూర్తులైన పడగల తయారీ, జాతర ఉత్సవాల విధి విధానాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో స్థానిక జెడ్పీటీసీ కొమరం హనుమంతరావు, కొమరం రాంబాబు, ఆత్మ కమిటీ అధ్యక్షుడు వెంకన్న, మర్కోడు సర్పంచ్ శంకర్ బాబు, సత్యనారాయణ, ముత్తయ్య, సతీష్, కృష్ణం రాజు, నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే తీరు మారకపోతే మా నిర్ణయం త్వరలో ప్రకటిస్తాం



నవతెలంగాణ-చండ్రుగొండ

ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు తీరు మారకపోతే మా నిర్ణయం త్వరలో ప్రకటిస్తామని ఎంపీపీ బానోత్ పార్వతి అన్నారు. ఆదివారం మండలంలోని లక్ష్యా గార్డెన్‌లో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం ఎంపీపీ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశంలో ప్రజా ప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు సుమారు 500 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు వైఖరిపై తీవ్రంగా ధ్వజమెత్తారు. ఎమ్మెల్యే టీడీపీ నుండి బీఆర్ఎస్ పార్టీలో చేరిన నాటి నుండి బీఆర్ఎస్ పార్టీలో గెలిచిన ప్రజాప్రతినిధులను, సీనియర్ నాయకులను పక్కనపెట్టి ఆయనతో వచ్చిన కొందరి నాయకులకు పట్టం కట్టి బీఆర్ఎస్ పార్టీకి తీవ్రమైన నష్టం జరిగే విధంగా ప్రవర్తిస్తున్నారన్నారు. పార్టీ కార్యక్రమంలోనూ ప్రభుత్వ పథకాలలోనూ బీఆర్ఎస్ పార్టీ కారు గుర్తుపై గెలిచిన ప్రజాప్రతినిధులను విస్మరించి ఆయన విష్టానుసారంగా ప్రవర్తించడం సరికాదన్నారు. ఎన్ని మార్లు తనకు విన్నవించినా తనలో ఎటువంటి మార్పు లేదన్నారు. పార్టీకి, పార్టీ క్యాడర్కు నష్టపెట్టే విధానాన్ని పలుమార్లు జిల్లా నాయకత్వానికి మంత్రి, ఎంపీ, ఎమ్మెల్సీకి జిల్లా ముఖ్య నాయకులకు తెలియజేసినట్టు తెలిపారు. అయినా తనలో ఎటువంటి మార్పు రాలేదన్నారు. ఇకనైనా ఎమ్మెల్యే తీరు మారకపోతే మా నిర్ణయం త్వరలోనే ప్రకటిస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో ఎంపీపీ బానోత్ పార్వతి, వైస్ ఎంపీపీ నరుకుళ్ళ సత్యనారాయణ, సర్పంచులు, ముగ్గురు ఎంపీటీసీలు, ఆరుగురు సొసైటీ డైరెక్టర్లు, జిల్లా రైతు కోఆర్డినేటర్ మండల రైతు కోఆర్డినేటర్ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, జిల్లా నాయకులు, ముఖ్య కార్యకర్తలు గ్రామ శాఖ అధ్యక్షులు కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై రైతులు కన్నెర్ర

- సబ్ స్టేషన్ ముందు గంట సేపు ధర్నా
- ఏఈకి వినతి అందజేత



నవతెలంగాణ-దుమ్ముగూడెం

ఇటీవల త్రీ ఫేస్ విద్యుత్ సరఫరాలో ఏర్పడుతున్న అంతరాయానికి మండల రైతులు కన్నెర్ర చేశారు. వ్యవసాయం ఆధారపడి జీవిస్తున్న మండల రైతాంగానికి 24 గంటలు నాణ్యమైన విద్యుత్ అందజేయాలంటూ రోడ్డెక్కారు. సీపీఐ(ఎం), సీపీఐ పార్టీల అనుబంధ రైతు సంఘాల ఆధ్వర్యంలో సుమారు 100 మంది రైతులు ఆదివారం దుమ్ముగూడెం సబ్ స్టేషన్ ముందు గల భద్రాచలం, చర్ల ప్రధాన రహదారి పై గంట సేపు ధర్నా నిర్వహించారు. దీంతో పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. రైతులు చేస్తున్న దర్నా వద్దకు ఏఈ మోహన్ రెడ్డి రావడంతో రైతులు విద్యుత్ సమస్యలపై నిలదీసి వినతి పత్రం అందజేశారు. ఏఈ మోహన్ రెడ్డి మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో ఏర్పడుతున్న అంతరాయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళతానన్నారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర నాయకులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు యలమంచి వంశీకృష్ణ మాట్లాడుతూ....మండలంలో చాలా మంది రైతులు విద్యుత్ మోటార్ల పై ఆధారపడి వ్యవశాయం సాగు చేస్తున్నారని ఆయన అన్నారు. ఇటీవల విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం ఏర్పడడం వలన వేసిన పంటలు ఎండి పోయే ప్రమాదం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రైతు నాయకులు కొడాలి లోకేష్ బాబు, సున్నం నర్సింహాచారి, బొల్లి సత్యనారాయణ, తాళ్లూరి ఆదినారాయణ, వేమన వెంకటేశ్వరరావు, కొండపల్లి కృష్ణ, కల్లూరి వెంకటేశ్వరరావు, నోముల రామిరెడ్డి, రావులపల్లి పృధ్వి ప్రసాద్, శంకర్, రాంబాబు, రాజు, అన్నెం శ్రీను, కొల్లి శ్రీను, రాజేష్, గోపాల్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల్లో మనోధైర్యం నింపాలి

- టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు



నవతెలంగాణ-కొత్తగూడెం

వికలాంగులకు చేయూత నిచ్చేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు అన్నారు. ఆదివారం ఆయన జన్మదినం సందర్భంగా కొత్తగూడెం క్లబ్‌లో వికలాంగుల దినోత్సవం, దివ్యాంగుల ఆదర్శ వివాహం సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలకు నాగా సీతారాములు హాజరయ్యారు. పోటీలలో పాల్గొన్న వారికి తన సొంత ఖర్చులతో ప్రత్యేక బహుమతులను అందజేశారు. ఇదే వేదికపై కేక్ కట్‌చేసి ఆయన పుట్టిన రోజు వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగవైకల్యం ఉన్న వారిని మన పిల్లలుగా భావించి వారిలో మనోధైర్యాన్ని నింపాలని సూచించారు. మైనార్టీ జిల్లా ఉపాధ్యక్షులు కరీం పాషా, సుజాతనగర్ ఓబీసీ మండల అధ్యక్షుడు కసనబోయిన లక్ష్మణ్, యువజన కాంగ్రెస్ జిల్లా సెక్రెటరీ తేజావత్ శ్రీనివాస్, తేజావత్ సాయి పాల్గొన్నారు.

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సేవలు అభినందనీయం



నవతెలంగాణ-భద్రాచలం

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో క్షయ వ్యాధి, తల సేమియా, రక్తహీనతతో బాధపడుతున్న 75 మందికి ఆదివారం రెడ్ క్రాస్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో బ్లాంకెట్స్ పంపిణీ చేశారు. తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళ సై సౌందర్య రాజన్ జిల్లాలో రెడ్ క్రాస్ చేయాలను గుర్తించి అందజేసిన మెడల్స్ సంస్థలకు, సభ్యులకు అందజేశారు. భద్రాచలంలో బ్లడ్ బ్యాంక్ ఏర్పాటుకు ఎంపీ నిధుల నుంచి రూ.20 లక్షలు ఆనాడు అందజేసిన మాజీ ఎంపీ అజ్మీరా సీతారాం నాయక్ సేవలను గుర్తించి గోల్డ్ మెడలను బహుకరించారు. అదేవిధంగా ఆర్థిక సహకారాన్ని అందజేసిన ఐటీసీ పీఎస్పీడీ అధికారులకు, డాక్టర్ జి.వి.సుదర్శన్‌లకు గోల్డ్ మెడల్స్ అందించి సత్కరించారు. ఇతర సభ్యులకు కూడా మెడల్స్ అందించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో భద్రాచలం ఏఎస్పీ రోహిత్ రాజు, మాజీ ఎంపీ డాక్టర్ అజ్మీర సీతారామ నాయక్ మాట్లాడుతూ.. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సేవలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కన్వీనర్ డాక్టర్ ఎస్ ఎల్ కాంతారావు, ఈవి శ్రీనివాస్, పాకాల దుర్గాప్రసాద్, బిపిఎల్ హెచ్‌ఆర్ డిపార్ట్మెంట్ చంగల్ రావు, వై.సూర్యనారాయణ, వల్లంటి దేశప్ప, బి.వెంకటరెడ్డి, తిప్పన సిద్ధులు, రాజారెడ్డి, హరిచంద్ర నాయక్, కల్వకూరి అబ్రహం, గోళ్ళ భూపతిరావు, చావా లక్ష్మీనారాయణ, డాక్టర్ సుదర్శన్, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ చంద్ర ప్రసాద్, డాక్టర్ భాను ప్రసాద్, డాక్టర్ జయ భారతి, వెంకటాచారి, చారు గుల్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బలమైన కార్మికోద్యమాలు నిర్మిద్దాం

- రాష్ట్ర 7వ మహాసభలో ఐఎఫ్‌టీయూ ఆల్ ఇండియా కార్యదర్శి బూర్గుల ప్రదీప్

నవతెలంగాణ-కొత్తగూడెం

బలమైన కార్మికోద్యమాలు నిర్మిద్దామని, సింగరేణి కాంట్రాక్టు కార్మిక హక్కులకై పోరాడుదామని ఐఎఫ్‌టీయూ ఆల్ ఇండియా కార్యదర్శి బూర్గుల ప్రదీప్ అన్నారు. సింగరేణి కాలరీస్ కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ 7వ, రాష్ట్ర మహాసభలు జిల్లా కేంద్రంలోని ఉర్దూఘర్ షాది ఖానాలో ఆదివారం జరిగాయి. రాష్ట్ర మహాసభలకు సింగరేణి వ్యాప్తంగా 11 డివిజన్లకు చెందిన సింగరేణి కాంట్రాక్టు కార్మికులు హాజరయ్యారు. సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులను ఉద్దేశించి ప్రదీప్ ప్రసంగించారు. ఒకనాడు దేశ బొగ్గు పరిశ్రమ జాతీయ పరిశ్రమగా ఉండేదని, ఈరోజు దేశ ప్రయోజనాలను కార్పొరేట్లకు తాకట్టు పెడుతూ, కార్మికులు పోరాడి సాధించుకున్నటువంటి అనేక హక్కులను, సౌకర్యాలను మోడీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతుందన్నారు. ఈ మహాసభలకు అమరవీరుల జెండాను రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మానందం ఎగరవేశారు. అమర సంతాపాన్ని రాష్ట్ర కార్యదర్శి ఏ.వెంకన్న ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమంలో కందగట్ల సురేందర్, గౌని నాగేశ్వరరావు, మోతుకూరి మల్లికార్జున్, అశోక్, మొగిలి, యధగిరి, మల్లేష్, కోటిలింగం, అంజయ్య, శోభ, బుచ్చమ్మ, తదితరులు పాల్గొన్నారు.



వారిని అర్థం చేసుకోవాలంటే..?



టీనేజీ పిల్లలు... పెద్దలు చెప్పిన మాట ఓ పట్టాన వినరు. స్వేచ్ఛగా ఆలోచించాలి అనుకుంటారు. సొంతంగా పనులు చేయాలనుకుంటారు. వారిని అర్థం చేసుకోవాలంటే తల్లిదండ్రులు ఈ సూచనలు పాటిస్తే సరి.

- బాల్యంలో అమ్మానాన్నలు చెప్పినట్లు నడుచుకొనే పిల్లల ప్రవర్తన యుక్తవయసులోకి వచ్చేసరికి మారడం మొదలవుతుంది. అయితే వయసుతోపాటు వారి ఆలోచనలూ.. మారతాయని గ్రహించాలి. పరిసరాలు, స్నేహితులకు ప్రభావితమై సొంతంగా ఆలోచిస్తుంటారు. ఇదేమీ తప్పు కాదు. కొన్ని విషయాల్లో వారి మాటలకు, అభిప్రాయాలకు విలువ ఇచ్చి చూడండి. కచ్చితంగా వారి తీరులో మార్పు వస్తుంది.
- పాటించాలి.. ఏ విషయాన్నైనా పదే పదే చెబితే టీనేజీ పిల్లలకు నచ్చకపోవచ్చు. వారికేదైనా చెబుతుంటే...దాన్ని ముందు పెద్దవాళ్ల పాటించినప్పుడే వారూ అనుసరిస్తారు. తల్లిదండ్రులను స్ఫూర్తిగా తీసుకుంటారు.
- వాదనలొద్దు.. మన పిల్లలే కదా.. కోప్పడొచ్చని తల్లిదండ్రులు భావించకూడదు. వారితో మాట్లాడేటప్పుడు గొంతును వీలైనంత తక్కువ స్థాయిలో ఉంచి మృదువుగా మాట్లాడాలి. ఈ వయసు పిల్లలు తమ అభిప్రాయాలను అమ్మానాన్నలకు గట్టిగా అరిచి చెప్పాలనుకుంటారు. దానికి రియాక్ట్ అయితే చివరకు ఇరువురిమధ్య సంభాషణ వాదనగానే మిగులుతుంది. ఆ అవకాశం ఇవ్వొద్దు.

ఇట్ల చేద్దాం



వంట చేసే క్రమంలో దుస్తులపై నూనె మరకలు పడడం సహజం. అయితే వీటిని వదిలించడం అంత తేలిక కాదు. ఇందుకోసం ముందుగా దుస్తుల్ని చల్లటి నీళ్లలో ముంచి తీయాలి. ఆపై మరక ఉన్న చోట డిష్‌వాషింగ్ సబ్బు లేదా లిక్విడ్‌ని వేసి బాగా రుద్దాలి. ఇలా మరక పూర్తిగా తొలగిపోయే వరకు రుద్దాలి. లేదంటే బేకింగ్ సోడాను మరకపై చల్లి.. అరగంట తర్వాత బ్రష్‌తో రుద్దాలి. ఇప్పుడు వెనిగర్, నీళ్లు కలిపిన మిశ్రమాన్ని స్ప్రే చేసి కాసేపటి తర్వాత ఉతికేస్తే మరక వదిలిపోతుంది.

ఈ చిత్రకళాశైలి తమిళనాడు రాష్ట్రంలోని తంజావూరులో ఉద్భవించడం వల్ల ఈ కళకు 'తంజావూరు పెయింటింగ్' అనే పేరు వచ్చింది. ఈ చిత్రకళ 1600 ఏడి నుండి మొదలైందనీ, విజయనగర రాజుల అధీనంలో ఉన్న తంజావూరు నాయకుల ప్రోత్సాహంతో పేరు పొందిందనీ తెలుస్తుంది. ఈ పెయింటింగ్‌లలో అద్భుతంగా మెరిసే బంగారు రేకులు, విలువైన రాళ్ళను, రత్నాలను పొదుగుతారు. ఈ చిత్రకళలో విజయనగరం, దెక్కనీ, మరాఠా, యూరోపియన్ కళాశైలులు కనిపిస్తాయి. విజయనగర రాజుల పతనానంతరం కళాకారులు స్థానిక ప్రభావాలకులోనై ఈ ప్రత్యేకమైన శైలిని అభివృద్ధి చేశారు. మరాఠా రాజుల రాజ భవనాలు, ఛత్రాలు, ప్రధాన భవనాలను అలంకరించడంలో అనేక చిత్రకళల్ని ఉపయోగించాను. ఎక్కువగా చెక్కపలకలపై ఈ చిత్రాలను వేయడం ఆరంభించారు. సహజ రంగులతో రత్నాలు, బంగారు రేకులతో రాజుల సింహాసనాలు, గోడలు, స్తంభాలు, తోరణాలు తయారు చేసేవారు. భారతీయ చిత్రకళలో తంజావూరు చిత్రకళకు ప్రత్యేకమైన స్థానం ఉన్నది.

బంగారు తంజావూరు చిత్రకళ



నెమలిని చేద్దాం

మొదటగా మనం ఒక నెమలి బొమ్మను చేద్దాం. ఏ ఆర్ట్ అయినా ఏ చిత్రం అయినా నెమలి బొమ్మను చేయకుండా ఉండలేము. నెమలి అందాలను చిత్రించకుండా ఏ విధమైన కళ, కళాకారుడూ లేడు. ఇక బంగారు రేకలతోనూ, ఫాయిల్‌తోనూ తయారయ్యే తంజావూరు పెయింటింగ్‌లో నెమలి ఆకారాన్ని చిత్రించకుండా ఉంటారా? బంగారు ఆభరణాల తయారీలో కూడా నెమలి ప్రధమ స్థానాన్ని తీసుకుంటుంది. లాకెట్టయినా, కడియాలైనా, వడ్డాణమైనా నెమలి అందాలు లేకుండా ఉండవు. తంజావూరు చిత్రకళలో చెక్క పలకలనుగానీ, పెయింటింగ్ బేస్‌లు గానీ ఉపయోగించవచ్చు. ఒక బేస్‌ను తీసుకొని దాని మీద నెమలి చిత్రాన్ని వేసుకోవాలి. దీనికోసం పసుపురంగు కార్బన్ పేపర్‌ను ఉపయోగించాలి. చాక్‌పౌడర్ ఫెవికాల్ గీతల వెంట గీస్తూ వెళ్ళాలి. మొత్తం గీతలు గీసేశాక మధ్యలో రాళ్ళను పొదగాలి. నెమలి చిత్రం మధ్యలో ఉన్న డిజైన్ పూర్తయ్యాక బాగా ఆరబెట్టాలి. ఇది ఎండిపోయాక మాత్రమే గోల్డ్ ఫాయిల్‌తో అలంకరించాలి. ఈ గోల్డ్ ఫాయిల్ బాగా ఖరీదు ఉంటుంది. వేల రూపాయల ఖర్చు అవుతుంది. అయితే చిన్న చిన్న బొమ్మలు చేసుకోవచ్చు. నెమలి చిత్రమంతా గోల్డ్ ఫాయిల్‌ను అతికించాలి. పూర్తిగా అతికిన తర్వాత సన్నని కత్తితో అవసరం లేని భాగాన్ని కత్తిరిస్తే నెమలి చిత్రం అందంగా తయారవుతుంది.

వధువు బొమ్మ

ఒక అమ్మాయి బొమ్మను చేద్దాం. సాధారణంగా దేవతామూర్తులను తప్ప ఏవిధమైన బొమ్మల్నీ చెయ్యరు. కొనేవాళ్ళు కూడా ఇష్టపడరు. వెరైటీ కోసం మనం అమ్మాయి చిత్రాన్ని చేద్దాం. వివాహ సమయంలో వధువు బొమ్మను ఇలా తయారు చేస్తే ఎలా ఉంటుందన్న ఆలోచనే ఈ చిత్రానికి నాంది. కార్డుబోర్డు మీద ఒక వస్త్రాన్ని అతికించి దానిమీద ఈ చిత్రం వేశాను. అయితే దీనిలో అమ్మాయిని ఎక్కువగా బంగారంతో నింపకుండా చేశాను. కేవలం చుట్టూ ఉన్న డిజైన్‌ను మాత్రమే బంగారు రంగు రేకులతో నింపాను. ఇవి ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేస్తే వచ్చేస్తాయి. లేదంటే పెద్ద ఊర్లలో క్రాఫ్ట్ షాపులలో దొరుకుతాయి. అమ్మాయి నగలకు మాత్రం గోల్డ్ ఫాయిల్ పెట్టవచ్చు. నేను నగలు కూడా ఎక్కువగా వెయ్యలేదు. సాదాసీదాగా చెయ్యాలనుకున్నాను. వధువుకు వివాహ సమయంలో బహుమతిగా ఇవ్వా లనుకున్నాను. తలనిండా పువ్వులను చిత్రించాను. చాక్‌పౌడర్ పిండితో పువ్వులు చేసి పెట్టాను. మీరూ ప్రయత్నించండి.



రాధాకృష్ణులు



ప్రేమకు ప్రతిరూపమైన రాధాకృష్ణుల్ని చిత్రిద్దాము. మద్రాసు ఎయిర్‌పోర్టులో చక్కని షాపు ఉన్నది. ఫ్లైటుకు సమయం మిగిలితే నేను ఈ షాపులో ఉన్న తంజావూరు చిత్రాల్ని చూస్తూ ఉంటాను. కళ్ళ ముందు అద్భుతం సాక్షాత్కరించినట్టుంది. వాటిని చూస్తుంటే మనసెంత ఆహ్లాదంగా ఉంటుంది. నేనొకసారి శ్రీరామచంద్ర మెడికల్ కాలేజీకి వెళ్ళినపుడు ప్రతి బిల్డింగ్‌లో తంజావూరు చిత్రాలే దర్శనమిస్తాయి. తమిళనాడు రాష్ట్ర హస్తకళల విభాగంలో తంజావూరు చిత్రకళ ప్రధాన పాత్రను పోషిస్తుంది. సింహాసనాలు, ఆభరణాలు, నగలు వంటివన్నీ బంగారు రేకులతో దిద్ది రాళ్ళు రత్నాలను పొదిగితే అందమైన చిత్రం తయారవుతుంది. వీటిని తయారు చేయాలంటే నెలల సమయం పడుతుంది. రాధాకృష్ణులను కూడా వివాహ సమయంలో బహుమతులుగా ఇవ్వవచ్చు. నాట్య భంగిమలలో ఉన్న రాధాకృష్ణులను చేసుకుంటే బాగుంటుంది. లేదంటే గోపికల మధ్యలో ఉన్న కృష్ణుడ్ని కూడా చేసుకోవచ్చు.

– డాక్టర్ కందేపి రాణీప్రసాద్

జీర్ణశక్తికి ఇవి తింటే మంచిది

చలికాలంలో అరుగుదల క్షీణిస్తుంది.. విటమిన్ 'డి' లోపంతో రోగనిరోధక శక్తీ తగ్గుతుంది. ఫలితంగా వివిధ రకాల అనారోగ్యాలు చుట్టుముడతాయి. మరి ఈ సమస్యను నివారించాలంటే ఈ కాలంలో లభించే కొన్ని ఆహార పదార్థాలు తీసుకోవడం తప్పనిసరి అంటున్నారు పోషకాహార నిపుణులు. మరి రుచితో పాటు ఎన్నో ఆరోగ్య రహస్యాల్ని నింపుకొన్న ఆ పదార్థాలేంటో చూద్దాం...




- ఈ కాలంలో జీవక్రియలు నెమ్మదించడం వల్ల అదనపు కొవ్వులు, విషతుల్యాలు ఎప్పటికప్పుడు బయటికి వెళ్లకుండా శరీరంలో పేరుకుపోతాయి. దీని ప్రభావం కాలేయంపై పడుతుంది. ఇది ఆరోగ్యానికి అస్సలు మంచిది కాదు. కాబట్టి శరీరంలోని విషతుల్యాలను బయటికి పంపించి.. కాలేయాన్ని తిరిగి పునరుత్తేజితం చేయడంలో చెరకు రసం కీలక పాత్ర పోషిస్తుంది. ఇందులో ఉండే ఆల్కలీన్ సమ్మేళనాలే ఇందుకు కారణం. ఇవి శరీరంలో ఆమ్ల స్థాయుల్ని క్రమబద్ధీకరించడంలో సహకరిస్తాయి. అలాగే చలిగాలులకు చర్మం దెబ్బతినకుండా రక్షిస్తాయి.
- చలికాలంలో పిల్లలు తరచూ జబ్బు పడుతుంటారు. ఇందుకు కారణం వాళ్లలో రోగనిరోధక శక్తి తక్కువగా ఉండడమే! అందుకే రేగు పండును తరచూ వాళ్లకు అందించమంటున్నారు నిపుణులు. ఇందులో అధిక మొత్తంలో ఉండే విటమిన్ 'సి' ఇమ్యూనిటీని పెంచడంలో సహకరిస్తుంది. అలాగే వారిలో తలెత్తే మలబద్ధకం సమస్యకు చెక్ పెడుతుంది. పెద్దవాళ్లలోనూ చలికాలంలో కీళ్ల పట్టేయడం వంటి సమస్యలొస్తాయి. వాటికి విరుగుడూ రేగు పండే. ఇందులో అధిక మొత్తంలో ఉండే క్యాల్షియం, ఫాస్ఫరస్, ఇనుము.. ఎముక బలాన్ని పెంచుతాయి.



- చలికాలంలో ఎదురయ్యే అజీర్తి సమస్యలకు చింతపండును మించిన పరమౌషధం లేదంటున్నారు నిపుణులు. ఇందులో అధిక మొత్తంలో ఉండే మెగ్నీషియం, క్యాల్షియం ఎముకలకు బలాన్ని చేకూర్చుతాయి. తద్వారా ఎముక విరుపులకు చెక్ పెట్టచ్చు.. అలాగే భవిష్యత్తులో ఆస్టియోపోరోసిస్ రాకుండా జాగ్రత్తపడచ్చు.

- చలికాలంలో విరివిగా లభించే ఉసిరిని నేరుగానైనా తీసుకోవచ్చు.. లేదంటే ఉసిరి రసం, మురబ్బ, పచ్చళ్ల రూపంలో కూడా తినచ్చు. దీన్ని తరచూ తీసుకోవడం వల్ల ఈ కాలంలో ఇన్ఫెక్షన్ల బారిన పడకుండా జాగ్రత్తపడచ్చు. పుష్కలంగా ఉండే విటమిన్ 'సి' ఇమ్యూనిటీని పెంచడంలో సహకరిస్తుంది. అలాగే అజీర్తి కారణంగా తలెత్తే మలబద్ధకం, ఇతర జీర్ణ సంబంధిత సమస్యలకు చెక్ పెట్టచ్చు.



- నువ్వుల్లో ఉండే అత్యవసర కొవ్వులు ఎముకలు, కీళ్లకు బలాన్నిస్తాయి. తద్వారా ఈ కాలంలో కీళ్ల నొప్పులు, ఎముక విరుపులకు చెక్ పెట్టచ్చు. దీన్ని బెల్లంతో కలిపి ఉండలు చేసుకొని తీసుకోవడం వల్ల శరీరానికి వెచ్చదనం అందుతుంది. జీర్ణ సంబంధిత సమస్యల్ని తగ్గించడానికి, శరీరంలో రక్తహీనతను నివారించడానికి ఇది సూపర్‌ఫుడ్ అని చెప్పచ్చు.

అక్రమ బదిలీలలు!

(మొదటిపేజీ తరువాయి)

మున్సిపాల్టీగా ఉన్నప్పుడు కేటగిరీ–2గా పరిగణించి, రెండు పాయింట్లు ఇచ్చేవారు. నగర పాలక సంస్థ అయినప్పటి నుంచి కేటగిరీ–1 కింద ఒక పాయింట్ ఇస్తున్నారు. మున్సిపాల్టీల్లో 13.50 శాతం హెచ్‌ఆర్‌ఏ ఇస్తారు. ఉమ్మడి జిల్లాలోని కొత్తగూడెం, పాల్వంచ మున్సిపాల్టీలు కేటగిరీ–2 కింద సంవత్సరానికి రెండు పాయింట్ల చొప్పున ఇస్తారు. బదిలీలు ఉమ్మడి జిల్లా ఆధారంగా కాకుండా ఏ జిల్లాకు ఆ జిల్లా కొనసాగుతున్నాయి. దీనిలో మైదాన, ఏజెన్సీ ప్రాంతాల్లో ఎక్కడికైనా బదిలీ చేసేలా కోరుకోవచ్చు. కానీ ప్రస్తుత ట్రాన్స్‌ఫర్‌లు బదిలీ స్ఫూర్తికి విరుద్ధంగా కొనసాగుతున్నాయని ఉపాధ్యాయ సంఘాల ఆరోపణ.

చెక్‌స్లిప్ బదిలీలపైనా ఆక్షేపణ

ఖమ్మం జిల్లాలో నలుగురు ఉపాధ్యాయులకు చెక్‌స్లిప్ బదిలీలు జరిగాయి. దీనిపై ఉపాధ్యాయులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. బదిలీల షెడ్యూల్ విడుదలైన సమయంలో చెక్‌స్లిప్ బదిలీలకు అవకాశం ఇవ్వడం సరికాదని ఉపాధ్యాయ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. దీనివల్ల సుదూర ప్రాంతాల్లోని ఉపాధ్యాయులు మళ్లీ అక్కడే విధులు నిర్వహించాల్సి వస్తుందనే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరో 20 నుంచి 30 మంది వరకు ఉపాధ్యాయులకు చెక్‌స్లిప్ బదిలీలు జరిగే అవకాశం ఉందంటున్నారు.

అక్రమ పద్ధతిలో బదిలీలు

– జి.నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు, టీఎస్‌యూటీఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు



బదిలీల్లో పారదర్శకత లోపించింది. ఏడున్నరేండ్ల తర్వాత బదిలీలకు అవకాశం కల్పించిన ప్రభుత్వం పారదర్శకంగా, అవినీతికి ఆస్కారం లేకుండా నిర్వహిస్తామని తెలిపింది. కానీ అందుకు విరుద్ధంగా దొడ్డిదారిలో బదిలీలు చేపడుతోంది. అనర్హులకు అవినీతి పద్ధతుల్లో బదిలీలు చేస్తోంది. ఉపాధ్యాయులకు వారు పనిచేస్తున్న స్కూల్ సీనియార్టీతో నిమిత్తం లేకుండా బదిలీలకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తున్నాం.

పాకిస్తాన్‌లో బస్సు ప్రమాదం

(మొదటిపేజీ తరువాయి)

బస్సులో మంటలు చెలరేగాయని అన్నారు. మృతదేహాలు గుర్తుపట్టలేనంతగా కాలిపోయాయని చెప్పారు. డ్రైవర్ అతివేగమే ప్రమాదానికి కారణమని భావిస్తున్నట్టు తెలిపారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం.. 2018లో పాకిస్తాన్ రోడ్డు ప్రమాదాల్లో 27,000 మందికి పైగా మరణించినట్టు సమాచారం.

ఎన్నికల బడ్జెటేనా..?

(మొదటిపేజీ తరువాయి)

కేబినెట్ పదవులు కట్టబెడితే ఎన్నికల్లో ప్రభావితం చేయవచ్చునన్న ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. దీంతో నాలుగు ప్రధాన శాఖలు మినహా కేబినెట్ మొత్తాన్ని పునర్వ్యవస్థీకరించే అవకాశముందని వినిపిస్తోంది. ఇందులో భాగంగా తెలంగాణ నుంచి ప్రస్తుతమున్న కేంద్ర పర్యాటక మంత్రి కిషన్‌రెడ్డిని కొనసాగిస్తూనే మరొకరికి అవకాశమివ్వాలని బీజేపీ అధినాయకత్వం యోచిస్తోందని సమాచారం. ఇటీవల రాజ్యసభకు ఎన్నికైన లక్ష్మణ్ ఈ రేసులో ముందుండగా, ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు తీసుకొంటే ఎలా ఉంటుందనే చర్చ కూడా జరుగుతున్నట్లు తెలుస్తోంది.

గాంధీజీ హత్య వెనుక కుట్ర

(మొదటిపేజీ తరువాయి)

ఆధ్వర్యంలో ఆదివారంనాడిక్కడి సుందరయ్య విజ్ఞాన కేంద్రం (ఎస్వీకే) లో ధీరేంద్ర కే ఝా రచించిన 'గాంధీజీ హంతకుడు' (గాడ్సే జీవితం, ఆలోచనలు, అనుబంధాలు) తెలుగు అనువాద పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ పుస్తకాన్ని ఎస్వీకే ట్రస్టు కార్యదర్శి ఎస్ వినయకుమార్ తెలుగులోకి అనువాదం చేశారు. ఢిల్లీ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ తిరుమలి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంగ్ల మూల పుస్తక రచయిత ధీరేంద్ర కే ఝా ఆన్‌లైన్ ద్వారా సభలో పాల్గొని మాట్లాడారు. గాంధీ–గాడ్సేల ఆలోచనల సైద్ధాంతిక ఘర్షణను 2014 తర్వాత బీజేపీ ముందుకు తెస్తున్నదని వివరించారు. గాడ్సేను దేశభక్తుడిగా కొలిచే ప్రకటనలు వెలువడుతున్నాయనీ, అసత్య ప్రచారంతో చరిత్రను మార్చే ప్రయత్నం జరుగుతున్నదనీ చెప్పారు. గాంధీ హత్యకు గల కారణాలపై కేరవాన్ పత్రికలో వ్యాసం కోసం పరిశోధన చేసేటప్పుడు అనేక ఆసక్తికర అంశాలు వెలుగులోకి వచ్చాయనీ, వాటిని సాక్ష్యాధారాలతో ప్రజలకు చెప్పాలనే పరిశోధనను కొనసాగించి పుస్తకం రాసినట్టు తెలిపారు. 'గాంధీజీ హంతకుడు' తెలుగు అనువాద పుస్తక ఆవిష్కర్త ప్రొఫెసర్ తిరుమలి మాట్లాడుతూ మహాత్మాగాంధీని హత్య చేసింది గాడ్సే అనే ఓ వ్యక్తి కాదనీ, దాని వెనుక ఆర్‌ఎస్‌ఎస్, సావర్కర్ కుట్ర ఉన్నదని స్పష్టం చేశారు. బ్రిటీష్ వాళ్ళ భారతదేశానికి స్వాతంత్ర్యం ప్రకటించాక, దేశంలో తిరిగి పీష్వాల పాలన తేవాలనేది సావర్కర్ ఆలోచన అనీ, గాంధీ హత్యతో దానికి మార్గం సుగమం అవుతుందని భావిస్తే, ప్రజల నుంచి వచ్చిన వ్యతిరేకత ఆ ప్రయత్నాన్ని నిలుపుదల చేసిందన్నారు. సావర్కర్ మహాత్మాగాంధీ అంతటి ధైర్యవంతుడు కాదనీ, స్లీపర్‌సెల్‌గా ఉంటూ తన ఉద్రేక ప్రసంగాలతో యువకులను హిందూ తీవ్రవాదం వైపు నడిపించే ప్రయత్నం చేశారని చెప్పారు. గాడ్సే, ఆప్టే, కర్క్, పోవా వంటి వారు సావర్కర్ ప్రసంగాలకు ప్రభావితులైన వారేనని తేల్చిచెప్పారు. గాంధీజీ హత్య తర్వాత సావర్కర్, ఆర్‌ఎస్‌ఎస్ తమకు ఎలాంటి సంబంధాలు లేవని ప్రకటించుకున్నాయనీ, కానీ చారిత్రక ఆధారాలు సేకరించి, ఈ కుట్రకోణాన్ని ప్రజలకు తెలిసేలా రచయిత కృషి చేశారని అన్నారు. గాంధీజీ కంటే ముందు ఇదే సావర్కర్ గ్యాంగ్ జిన్నాను హత్య చేయాలని పథకం పన్నారనీ, కానీ మౌంట్‌బాటన్ ఆయనతో కలిసి ఉండటం వల్ల అది సాధ్యం కాలేదని వివరించారు. గాంధీజీ హత్యను ఓ వ్యక్తి చేసిన హత్యగా చిత్రీకరించేందుకు సావర్కర్, ఆర్‌ఎస్‌ఎస్ తీవ్ర ప్రయత్నం చేశాయన్నారు. గాడ్సే కూడా ఆ తరహాలోనే న్యాయస్థానంలో స్టేట్‌మెంట్స్ ఇచ్చాడని చెప్పారు. గాంధీ హత్య విషయం అప్పటి హోంశాఖ మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు ముందే తెలుసు అనీ, ఆయన సకాలంలో సరైన చర్య తీసుకొని ఉంటే, ఈ దారుణం జరిగి ఉండేది కాదని అభిప్రాయపడ్డారు.

గాంధీజీ లాగా ధైర్యంగా మాట్లాడేశక్తి సావర్కర్‌కు లేదనీ, ఆయనో పిరికివాడంటూ పలు ఉదాహరణ చెప్పారు. పుస్తక అనువాదకులు ఎస్ వినయకుమార్ మాట్లాడుతూ గాంధీజీ హత్య, ముంబయిలో సావర్కర్ సదన్‌పైకి ప్రజల దాడిని నియంత్రించడం, గుజరాత్‌లోని గోద్రా, అహ్మదాబాద్ అల్లర్లకు సారూప్యత ఉన్నదని వివరించారు. డిక్టేటర్‌షిప్‌పై గాడ్సే, సావర్కర్‌కు మక్కువ ఎక్కువని చెప్పారు. చిప్పావన్ బ్రాహ్మణుల మీదే ఆర్‌ఎస్‌ఎస్ భావజాలం ఆధారపడి ఉంటుందనీ, బ్రాహ్మణ ఆధిపత్యాన్ని గాంధీ సవాలు చేస్తున్నారనే కోపం వారికి ఉన్నదని తెలిపారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన నవతెలంగాణ పబ్లిషింగ్ హౌస్ ఎడిటర్ కే ఆనందాచారి మాట్లాడుతూ జనవరి 30 నాటికి గాంధీ హత్య జరిగి 75 ఏండ్లు పూర్తిఅవుతాయనీ, దాని పూర్వాపరాలపై చర్చ జరగాలని అన్నారు. గాంధీ హంతకులను దేశభక్తులుగా కీర్తించబడుతున్నారనీ, అసత్యాలు సత్యాలుగా రాజ్యమేలుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. 20 ఏండ్లనాటి గుజరాత్ అల్లర్లపై బీబీసీ డాక్యుమెంటరీ ప్రసారాలపైనా ఆంక్షలు విధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వాస్తవాలు ప్రజలకు తెలియాలన్నారు. కార్యక్రమంలో నవతెలంగాణ పబ్లిషింగ్‌హౌస్ గౌరవ సంపాదకులు గుడిపూడి విజయరావు, జనరల్ మేనేజర్ ఆర్ వాసు, కొండూరి వీరయ్య పాల్గొన్నారు. నవతెలంగాణ పబ్లిషింగ్‌హౌస్ మేనేజర్ డీ కృష్ణారెడ్డి వందన సమర్పణ చేశారు.

నోరు తెరవద్దు.. కాలు కదపద్దు

(మొదటిపేజీ తరువాయి)

అండర్‌టేకింగ్‌ను సమర్పించాల్సిందిగా ఆయనను కోరింది. దీనికి సంబంధించిన విషయాన్ని వాంగ్‌చుక్ ట్విట్టర్‌లో షేర్ చేశారు. బాండ్‌కు సంబంధించిన పత్రాలను సైతం పోస్ట్ చేశారు. ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాలు, కార్యక్రమాలకు రెచ్చగొట్టవద్దనీ, అది శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందనీ, అనుమతినిచ్చిన ప్రాంతంలోనే వారు (వాంగ్‌చుక్) తన దీక్షను కొనసాగించాలని ఆ బాండ్ పేపర్‌లో ఉన్నది. దీనిని ఉల్లంఘిస్తే న్యాయపరమైన చర్యలుంటాయని యంత్రాంగం పేర్కొన్నది. "వారు (యంత్రాంగం) నిన్న, ఈ రోజు నా వద్దకు వచ్చి బాండ్‌పై సంతకం చేయాలన్నారు. నేను మొదటగా నా లాయర్లను కలుస్తానని వారికి చెప్పాను" అని వాంగ్‌చుక్ చెప్పారు. తాను బాండ్‌పై సంతకం చేయనని కూడా తెలిపారు. గొంతులను నొక్కే "బనానా రిపబ్లిక్" వ్యూహంగా దీనిని ఆయన అభివర్ణించారు. తన పర్యావరణ దీక్ష అనేది అసమ్మతి చర్య కాదనీ.. పర్యావరణానుకూల జీవనశైలిని ప్రోత్సహిస్తున్నా ననీ.. పర్వతాలు, హిమానీనదాల రక్షణను తాను కోరుతున్నానని వాంగ్‌చుక్ తెలిపారు. ఐదు రోజుల పర్యావరణ దీక్షను చేపట్టడానికి నిర్ణయించిన ఖర్దూంగ్ లా పాస్ ప్రాంతానికి వెళ్లకుండా నిరోధించడానికి తన ఉద్యమాన్ని పాలక యంత్రాంగం నియంత్రించిందని ఆయన అన్నారు. వారు తనకు వారంట్ జారీ చేయలేదనీ, గృహ నిర్బంధం కంటే దారుణమైన స్థితిలో తాను ఉన్నానని తెలిపారు. 2019, ఆగస్టు 5న జమ్మూకాశ్మీర్‌కు ప్రత్యేక స్వయం ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370 రద్దు సందర్భంగా కాశ్మీర్ ప్రధానస్రవంతి రాజకీయ నాయకులను సంతకాలు చేయాలంటూ ఆదేశించిన బాండ్ పేపర్‌లో ఉన్న పదాలే.. ప్రస్తుతం వాంగ్‌చుక్‌కు జారీ చేసిన బాండ్ పేపర్‌లో ఉండటం గమనార్హం. ఇటు లడఖ్‌లో భూమి, ఉద్యోగాల రక్షణపై చర్చించడానికి కేంద్రం ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి కమిటీ లో చర్చల్లో పాల్గొనడానికి ఈ ప్రాంతానికి చెందిన రెండు పెద్ద పౌర సంఘాల నిరాకరించాయి.

అంధత్వ రహిత తెలంగాణయే సీఎం కేసీఆర్ సంకల్పం

- సమాచార, పౌర సంబంధాలశాఖ

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

అంధత్వ రహిత తెలంగాణయే సీఎం కేసీఆర్ సంకల్పమనీ, ఆ మేరకు రెండో దశ కంటి వెలుగు కార్యక్రమం కొనసాగుతున్నదని సమాచార, పౌర సంబంధాలశాఖ కమిషనర్ తెలిపారు. ఆదివారం కమిషనర్ ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 16,533 ప్రాంతాల్లో కంటివెలుగు శిబిరాలకుగాను, గ్రామీణ ప్రాంతాల్లో 12,768, పట్టణప్రాంతాల్లో 3,788 ఉన్నాయని చెప్పారు. రెండవ విడత కంటివెలుగు లో ఇప్పటివరకు 12,79,637 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, వారిలో దృష్టిలోపం వున్న 2,94,892 మందికి కండ్లద్దాలు, మరో 2,05,305 మందికి కండ్లద్దాలకై ప్రిస్క్రిప్షన్ రాశారు. శిబిరాల్లో ఇచ్చిన కండ్లద్దాలతో మురిసిపోతున్న లబ్ధిదారులు...ఇప్పుడు అన్నీ స్పష్టంగా కనబడుతున్నాయి సీఎంకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నారు. నల్లగొండ జిల్లా కేతేపల్లి మండల కేంద్రంలో 63 ఏండ్ల రాములమ్మకు పరీక్షలు నిర్వహించి దృష్టి లోపం ఉన్నట్టు గుర్తించారు. మైనస్ 5 పాయింట్ల దష్టిలోపం వచ్చేంత వరకు తనను ఆస్పత్రికి తీసుకెళ్లలేదనీ, సీఎం కేసీఆర్ వల్లే తనకు ఇంటి వద్దకే పరీక్షలు వచ్చాయని ధన్యవాదాలు తెలిపారు. ఇలాంటి ఉదాహరణలు ఎన్నో ఉన్నాయి.

పెరూలో బస్సు ప్రమాదం.. 25 మంది మృతి

లిమా : పెరూలో ఘోర బస్సు ప్రమాదం జరిగింది. వాయువ్య పెరూలోని పియురా ప్రావిన్స్‌లో ఓ బస్సు లోయలో పడింది. ఈ ప్రమాదంలో 25 మంది మరణించినట్టు అధికారులు తెలిపారు. వివరాల ప్రకారం.. కొరియంకా టూర్స్ కంపెనీకి చెందిన బస్సు పెరూ రాజధాని లిమా నుండి బయలుదేరిన బస్సు ఈక్వెడార్ సరిహద్దులోని టుంబేస్‌కు వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. ' డెవిల్స్ కర్వ్ ' అని పిలువబడే కష్టమైన ప్రదేశంలో ప్రమాదం జరిగిందని అన్నారు. ఈ బస్సులో మొత్తం 60 మంది ప్రయాణికులు ఉన్నారని, వీరిలో హైతీకి చెందినవారు కూడా ఉన్నట్టు తెలిపారు.

కేంద్ర బడ్జెట్‌లో జనం సమస్యలు ఉంటాయా?

(మొదటిపేజీ తరువాయి)

తగ్గుముఖం పట్టాలంటే ఉత్పత్తి, తయారీరంగాన్ని మెరుగుపర్చాలి. ఇందుకు కేంద్రం వద్ద అనేక మార్గాలున్నాయి. నిర్మాణం, మౌలిక వసతులు, సేవారంగాల్లో ప్రభుత్వ పెట్టుబడి ప్రవహించడానికి అనేక పథకాలున్నాయి. ఉదాహరణకు ..ప్రభుత్వ రంగ సంస్థల్ని తెగనమ్మకుండా, వాటికి ప్రభుత్వ సహకారం, మద్దతు, కొన్ని నిధులు సమకూరిస్తే చాలు. కొన్ని వేల ఉద్యోగాలు కొత్తవి ఏర్పడతాయి. భారతదేశ వనరులపై విదేశీ పెట్టుబడిదారులు కన్నేసి వుంచారు. విదేశీ వస్తువులు మన మార్కెట్‌ను ముంచెత్తకుండా అడ్డుకోవాల్సి వుంది. ఈ విషయాలన్నీ కొత్త బడ్జెట్ కొంత వరకు బయటపెడుతుంది.

వేతనాల్లో కోతలు..

కోవిడ్ సంక్షోభం తర్వాత వేతనాల్లో కోతలు సర్వసాధారణం అయిపోయింది. 'ఎంతో కొంత ఇస్తున్నాం..తీసుకుంటే తీసుకోండి, లేదంటే పోండి' అని యాజమాన్యాలు బెదిరిస్తున్నాయి. కుటుంబ అవసరాలు దృష్టిలో పెట్టుకొని అనేకమంది తక్కువ వేతనాలకు పనిచేయాల్సి వస్తోంది. కోవిడ్ ఆంక్షలు, నిబంధనలు నేడు లేకపోయినా..వేతనాల్లో కోతలు మాత్రం పోలేదు. ఈ పరిస్థితి సుదీర్ఘకాలంగా కొనసాగటం వల్లే మధ్య తరగతి..దారిద్ర్యరేఖకు దిగువకు వచ్చేశారు. అప్పులపాలయ్యారు. ఒకప్పుడు అప్పుల బాధ కొన్ని కుటుంబాలకే పరిమితం. నేడు అన్ని కుటుంబాలని ఆవరించింది. దీనికి ముఖ్య కారణం కేంద్రంలోని పాలకుల ఆర్థిక విధానాలే. సామాన్యులు, మధ్య తరగతి, వేతన జీవులు..అందరూ ప్రయివేటు రుణాలపై ఆధారపడటం వల్లే ఈ దుస్థితి ఏర్పడింది.

మరోవైపు ప్రయివేటు సంస్థలకు, అత్యంత ధనికులు, బడా వ్యాపారులు, కార్పొరేట్లకు తక్కువ వడ్డీల్లో పెద్ద మొత్తంలో రుణాలు అందుతున్నాయి. మోడీ సర్కార్ గుడ్డిగా అనుసరిస్తున్న ఆర్థిక విధానమిది. ఉపాధి కల్పన అంతా ప్రయివేటు చేతుల్లోనే ఉందని, వాటికి మేలు చేసే విధంగా, ప్రయోజనాలు కల్పిస్తూ పోతే..ఉపాధి సమస్య తీరుతుందని మోడీ సర్కార్ గుడ్డిగా నమ్ముతోంది. అదే ఇంత దూరం తీసుకొచ్చింది. ఇలాంటి తరుణంలో వస్తున్న కేంద్ర బడ్జెట్‌లో మోడీ సర్కార్ తన విధానం మార్చుకుంటుందా? అన్నది అందరూ వేచిచూస్తున్నారు.

ఉపాధి.. ఉద్యోగాలు

నిరుద్యోగ సమస్య ప్రతి ఇంటినీ వేధిస్తోంది. మధ్య వయస్సులో నిరుద్యోగిగా మారే వారి సంఖ్య నేడు పెద్ద ఎత్తున ఉంది.

ఈ అంశంపై సీఎంఐఈ నిత్యం గణాంకాల్ని విడుదల చేస్తోంది. ఈ సంస్థ నివేదికల ప్రకారం, గత 41 నెలలుగా సగటు నిరుద్యోగ రేటు 7శాతం పైన్నే ఉంది. డిసెంబర్ 2022లో 8.3శాతం నమోదైంది. కోవిడ్ సంక్షోభం దేశాన్ని తాకకముందు జనవరి 2020లో కార్మికరంగంలో ఉపాధి పొందినవారి సంఖ్య 41.1కోట్లు. కాగా డిసెంబర్, 2022 నాటికి 41కోట్లు. పనిచేసే వయస్సుగల 100 మంది ఉపాధిని కోరుకుంటే ఆనాడు 42.9మందికి ఉపాధి లభించింది. నేడు (డిసెంబర్ 2022) అది 40.5శాతం మాత్రమే ఉంది. దేశంలో నిరుద్యోగ సమస్య తీవ్రస్థాయిలో ఉందన్న విషయం ఈ గణాంకాలు తెలుపుతున్నాయి. నోట్ల రద్దు, జీఎస్టీ, కోవిడ్–19 సంక్షోభాలతో సామాన్యుడు విలవిల్లాడిపోయాడు. సంక్షోభ పరిస్థితుల్లో మోడీ సర్కార్ మొహం చాటేసింది. కష్టాలు, నష్టాలు ప్రజలే పరిష్కరించుకుంటారనే వ్యూహం ఎంచుకుంది. ఎన్నికలు...ఓట్ల అవసరం ఉంటేనే ప్రధాని మోడీ మౌనం వీడుతున్నారు.



చివరి స్థానంలో డబుల్ ఇంజిన్ సర్కార్

- ఇప్పటికీ కేరళ నెంబర్‌వన్ స్థానమే...
- తమిళనాడు, మహారాష్ట్రలు కొన్ని విషయాల్లో ముందంజ
- ఆయా రాష్ట్రాలకు వెళ్లాలని అధికారులకు ఆదేశం
- వైద్య చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన ఏడాది
- వైద్యారోగ్య రంగం 2022 వార్షిక నివేదికను విడుదల చేసిన మంత్రి హరీశ్ రావు

కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు వెనుకంజ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తమ ప్రభుత్వం డబుల్ ఇంజిన్ సర్కార్ అంటూ చెప్పుకుంటున్న బీజేపీ పాలిత ఉత్తర్ ప్రదేశ్ వైద్యారోగ్య రంగంలో చివరి స్థానంలో ఉందని వైద్యారోగ్యశాఖ మంత్రి టి.హరీశ్ రావు తెలిపారు. ఆదివారం హైదరాబాద్ లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో నిర్వహించిన కార్యక్రమంలో ఆ శాఖ 2022 వార్షిక నివేదికను విడుదల చేశారు. ఛార్జ్‌షీట్ పేరుతో తెలంగాణ వైద్యారోగ్యశాఖ పనితీరును విమర్శించిన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ముందు ఆ పార్టీ పాలిస్తున్న రాజస్థాన్, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల్లో సేవలెలా ఉన్నాయో తెలుసుకోవాలని హితవు పలికారు. నిటిఅయోగ్ విడుదల చేసిన ర్యాంకింగ్‌లో కేరళ మొదటి స్థానంలో ఉంటే తెలంగాణ మూడో స్థానంలో ఉందనీ, రాజస్థాన్ 16వ స్థానంలో ఉంటే, ఛత్తీస్‌ఘడ్ పదో స్థానంలో ఉందని తెలిపారు. రాష్ట్రంలోనూ కాంగ్రెస్ పాలించిన సమయంలో ప్రభుత్వాస్పత్రుల్లో సౌకర్యాలు లేక డెలివరీలు తగ్గాయనీ, టీఆర్ఎస్ పాలనలో అవి రెట్టింపయ్యాయని చెప్పారు. రాష్ట్ర వైద్యారోగ్యశాఖ 2022 వార్షిక నివేదికను ఆ రాష్ట్రాలకు పంపించి అమలు చేయిస్తే మంచిదని సూచించారు. తమిళనాడు, మహారాష్ట్రలు కొన్ని విషయాల్లో తెలంగాణ కన్నా మెరుగ్గా ఉన్నాయంటూ, కేరళతో పాటు మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాలకు వెళ్లి ఆయా విషయాలను అధ్య యనం చేసి మన రాష్ట్రంలో అమలు చేయాలని అధికా రులను ఆదేశించినట్టు మంత్రి తెలిపారు. చిన్న, చిన్న ఘటనలు మినహా 2022 సంవత్సరం రాష్ట్ర వైద్యారోగ్య చరిత్రలో సువర్ణాక్ష రాలతో లిఖించదగిన ఏడాదని అబి .ప్రాయపడ్డారు. ఏదైనా సంఘటన జరిగినప్పుడు వెంటనే సమీక్షించు కుంటున్నామనీ, అలాంటివి పునరావతం కాకుండా చర్యలు తీసుకుంటు న్నామని తెలిపారు.

ఎంఎంఆర్ రేట్ 56 నుంచి 43కు, ఐఎంఆర్ రేటు 23 నుంచి 21కి తగ్గించామన్నారు. లక్ష మంది జనాభాకు 19 ఎంబీబీఎస్ సీట్లతో దేశంలో నెంబర్‌వన్‌గా నిలిచామనీ, వైద్య పీజీ సీట్ల విషయంలో లక్షకు ఏడు సీట్లతో రెండో స్థానానికి చేరినట్టు వెల్లడించారు. హైదరాబాద్ నలువైపులా నాలుగు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు, గచ్చిబౌలిలో అదనంగా 1,000 పడకలు,నిమ్స్‌లో 2,000, వరంగల్ సూపర్ స్పెషాలిటీలో మరో 2,000 మొత్తం కలిపి 8,200 బెడ్లు అదనంగా రానున్నాయని తెలిపారు. భూకేటాయింపులు, పనులు ప్రారంభమయ్యాయని మంత్రి తెలిపారు. ఔట్ పేషెంట్ల సంఖ్య 60 లక్షలు, ఇన్‌పేషెంట్ల సంఖ్య దాదాపు 3 లక్షలు, సర్జరీలు 50 వేలు పెరిగిందన్నారు. రక్తహీనత ఉన్న గర్భిణుల కోసం కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ పథకం ప్రారంభించామని చెప్పారు. 926 మంది డాక్టర్ల నియామకం ఒకే రోజు చేశామనీ, తొమ్మిది మెడికల్ కాలేజీల ప్రారంభానికి ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేశామనీ, రాష్ట్రంలో 5.40 లక్షల డెలివరీలు జరిగితే అందులో 3.27 లక్షలు (61 శాతం) ప్రభుత్వాస్పత్రుల్లో జరిగాయని తెలిపారు. ఆస్పత్రుల్లో డెలవరీల శాతం 97 నుంచి 99.9 శాతానికి పెరిగిందన్నారు.

ప్రతి మరణంపై ఆడిట్ నిర్వహిస్తున్నామనీ, సీ సెక్షన్‌కు ఇన్సెంటివ్ ఇచ్చే బదులు సహజ ప్రసవాలకు ఇవ్వడాన్ని ప్రారంభించామనీ, దీన్ని కేంద్రం ప్రశంసించి మిగిలిన రాష్ట్రాలు అనుసరించాలని సూచించిందని మంత్రి తెలి పారు. ఇబ్రహీంపట్నం ఘటన తర్వాత ప్రతి ఆస్పత్రిలో ఇన్ఫెక్షన్ టీంలను ఏర్పాటు చేసి శిక్షణ ఇచ్చా మన్నారు. ప్రభుత్వా స్పత్రుల్లో 716 అవయవ మార్పిడి శస్త్రచికిత్సలు జరిగాయన్నారు. పేషెంట్ డైట్ ఛార్జీలను రూ.40 నుంచి రూ.80కి పెంచామనీ, 18 ఎంపిక చేసిన ఆస్పత్రుల్లో సహాయ కులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నారు. పారిశుధ్య పనుల నిర్వహణకు ఒక బెడ్‌కు ఇచ్చే రూ.5,000ను రూ.7,500 పెంచామనీ, దేశంలో ఎక్కడా లేని విధంగా డైట్, శానిటేషన్ కాంట్రాక్టుల్లో ఎస్సీ, ఎస్టీలకు 16 శాతం రిజర్వేషన్ కల్పించామన్నారు. పరికరాల మరమ్మతులు ఆలస్యం కాకుండా రాష్ట్ర స్థాయిలో ప్రాజెక్ట్ మేనేజ్ మెంట్ యూనిట్ (పీఎంయూ) ఏర్పాటు సత్ఫలితాలనిచ్చిందని మంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆరోగ్యశ్రీ కింద కుటుంబానికి ఇచ్చే కవరేజీ రూ.రెండు లక్షల నుంచి రూ.ఐదు లక్షలకు పెంచామనీ, అవయవమార్పిడి, దీర్ఘకాలిక రోగాలు వంటి ప్రత్యేక సందర్భాల్లో రూ.10 లక్షల వరకు ఇస్తున్నామన్నారు.

12,755 ఖాళీల భర్తీకి నిర్ణయం తీసుకున్నామనీ, 1,047 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు, 5,024 స్టాఫ్ నర్సు పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చామన్నారు. మూడంచెల వైద్య వ్యవస్థ ఐదెంచలుగా మారిందనీ, 2,500 పల్లె దవాఖానాలు అందుబాటులోకి రానున్నాయన్నారు. ఆయా విభాగాల్లో పలు అవార్డులు వచ్చాయంటూ అధికారులు, సిబ్బందికి అభినందనలు తెలిపారు.

2023లో సరోజినీదేవి కంటి ఆస్పత్రి, కోఠిలోని ఈఎన్ టీ ఆస్పత్రిలను బలోపేతం చేస్తామని తెలిపారు. ముఖ్యంగా ఆహార కల్తీ నివారణకు ఫుడ్ సేఫ్టీ ల్యాబ్ బలోపేతం, ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ల సేవలను పూర్తి స్థాయిలో వినియోగించుకుంటామని హరీశ్ రావు తెలిపారు. మలక్ పేట ఘటనపై పై, ఉద్దేశపూర్వక నిర్లక్ష్యం బయటపడితే విధుల్లో నుంచి తొలగిస్తామని తెలిపారు. రెండు జిల్లాల్లో హెల్త్ ప్రొఫైల్ నిర్వహించామనీ, మిగిలిన జిల్లాల్లోనూ కొనసాగిస్తామని ప్రకటించారు. ఈ సమావేశంలో వైద్యారోగ్యశాఖ కార్యదర్శి రిజ్వీ, రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ జి.శ్రీనివాసరావు, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ కమిషనర్ శ్వేతా మహంతి తదితరులు పాల్గొన్నారు.

జగజ్జేత భారత్

- మొట్టమొదటి అండర్ -19 మహిళల టీ20 ప్రపంచకప్ సొంతం
- ఫైనల్లో ఇంగ్లండ్‌పై 7 వికెట్ల తేడాతో విజయం
- బీసీసీఐ రూ. 5 కోట్ల రివార్డు



పొట్చెఫ్‌స్ట్రూమ్ (దక్షిణాఫ్రికా) : ఐసీసీ మొట్టమొదటి సారిగా నిర్వహించిన అండర్ 19 మహిళల టీ20 వరల్డ్‌కప్‌ను భారత్ కైవసం చేసుకున్నది. అమ్మాయిలు అద్భుత ప్రదర్శన కనబర్చడంతో భారత్ జగజ్జేతగా అవతరించింది. సమిష్టి కృషితో ఫైనల్లో ఇంగ్లండ్‌పై విజయంతో టీమిండియా తన పేరును చరిత్రలో లిఖించుకున్నది. ఆదివారం దక్షిణాఫ్రికాలోని పొట్చెఫ్‌స్ట్రూమ్ సెన్వ్యాస్ పార్కులో భారత్ - ఇంగ్లండ్ దేశాల మధ్య ఫైనల్ పోరు జరిగింది. ఈ మ్యాచ్‌లో యువ భారత జట్టు ఇంగ్లండ్‌ను 7 వికెట్ల తేడాతో ఓడించి ఈ ఘనతను సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ప్రత్యర్థి జట్టును కేవలం 68 పరుగులకు భారత్ కట్టడి చేసింది. స్వల్ప లక్ష్యాన్ని ఛేదించేందుకు భారత్ బరిలోకి దిగింది. 3 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని చేరింది. షెఫాలీ వర్మ (15), శ్వేత్ సెహ్రావత్ (5), తెలంగాణ అమ్మాయి గొంగడి త్రిష (24) పెవిలియన్‌కు చేరగా.. సౌమ్య తివారి (23), హ్రిషత బసు టీమిండియాను విజయతీరాలకు చేర్చారు. ఇంగ్లండ్ బౌలర్లలో హన్నా బేకర్, కెప్టెన్ గ్రేస్ స్కీవెన్స్, అలెక్సా స్టోన్‌హౌస్ తలో వికెట్ పడగొట్టారు.



ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్.. భారత బౌలర్లు మూకుమ్మడిగా విజంభించడంతో 68 పరుగులకే చాపచుట్టేసింది. టిటాస్ సాధు, అర్చనా దేవీ, పర్శవి చోప్రా తలో 2 వికెట్లు పడగొట్టి ఇంగ్లండ్ వెన్నువిరచగా.. మన్నత్ కశ్యప్, షెఫాలీ వర్మ, సోనమ్ యాదవ్ చెరో వికెట్ తీసి తమ పాత్రకు న్యాయం చేశారు. టీ20 ఫార్మాట్‌లో జరిగిన తొలి వరల్డ్‌కప్‌ను భారత అమ్మాయిలు కైవసం చేసుకోవడంతో భారత అభిమానుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ఇటు బీసీసీఐ అమ్మాయిలు సాధించిన విజయానికి గానూ రూ. 5 కోట్ల నజరానాను ప్రకటించింది.

జకోవిచ్ విజయ ఢంకా

- ఆస్ట్రేలియన్ ఓపెన్ పదో టైటిల్ కైవసం
- 22 గ్రాండ్ స్లామ్‌లతో నాదల్ రికార్డు సమం

సిడ్నీ : ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో సెర్బియా టెన్నిస్ దిగ్గజం నొవాక్ జకోవిచ్ విజయ ఢంకా మోగించారు. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ విభాగంలో ఆస్ట్రేలియన్ ఓపెన్ పదో టైటిల్‌ను సొంతం చేసుకున్నారు. జకోవిచ్ తొలి సెట్‌లోనే స్టెఫానోస్ సిట్సిపాస్‌ను బ్రేక్ చేసి తన ఆధిపత్యాన్ని చాటుకున్నాడు. రెండో సెట్ స్టెఫానోస్ మెరుగైన ప్రదర్శన కనబరిచినప్పటికీ జకోవిచ్ విజయం సాధించడంతో గేమ్‌ను ట్రైబేకర్‌కు తీసుకువెళ్లాడు. మూడోసెట్‌లో జకోవిచ్ 7-6తో టై బ్రేకర్‌లో స్టెఫానోస్‌ను ఓడించి 10వ టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. మొత్తంగా 6-3, 7-6, 7-6 తేడాతో విజయం సాధించారు. జకోవిచ్ తన 22 గ్రాండ్ స్లామ్‌లతో నాదల్ రికార్డును సమం చేశారు. కరోనా వ్యాక్సిన్ వ్యవహారం నేపథ్యంలో ఆస్ట్రేలియాకు వెళ్లి మరీ గతేడాది ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఆడకుండా నాదల్ వెనుతిరిగిన విషయం తెలిసిందే. ఇప్పుడు తన అద్భుతమైన ఆట తీరుతో టైటిల్‌ను కైవసం చేసుకోవడం గమనార్హం. ఇటు అగ్రశ్రేణి ఆటగాడు నాదల్ గాయం కారణంగా ఆదిలోనే ఇంటి బాట పట్టడం కూడా జకోవిచ్‌కు కలిచి వచ్చిన అంశం.



వాల్తేరు వీరయ్య ఆల్ టైమ్ ఇండస్ట్రీ హిట్



బాబీ కొల్లి, చిరంజీవి, నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, రామ్‌చరణ్

చిరంజీవి, రవితేజ, దర్శకుడు బాబీ కొల్లి (కెఎస్ రవీంద్ర) కాంబినేషన్‌లో రూపొందిన సినిమా 'వాల్తేరు వీరయ్య'. సంక్రాంతి కానుకగా ఈనెల 13న ప్రపంచవ్యాప్తంగా విడుదలై ఘన విజయం సాధించింది. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై నవీన్ యెర్నేని, వై రవిశంకర్ భారీ స్థాయిలో నిర్మించిన ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులని అలరించి, రికార్డ్ బ్రేకింగ్ కలెక్షన్స్‌తో బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకుంది.

ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ 'వీరయ్య విజయ విహారం' పేరుతో సక్సెస్ సెలబ్రేషన్స్‌ని హన్మకొండలో గ్రాండ్‌గా నిర్వహించారు. రామ్ చరణ్ ఈ వేడుకలో ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. భారీ ఎత్తున ప్రేక్షకులు, అభిమానులు హాజరైన ఈ వేడుక వైభవంగా జరిగింది. ఈ వేడుకలో చిరంజీవి చేతుల మీదుగా చిత్ర యూనిట్‌కు షీల్డ్స్ ప్రధాన కార్యక్రమం గ్రాండ్‌గా జరిగింది.

> బ్లాక్ బస్టర్ నిర్మాతలు నవీన్, రవికి అభినందనలు. నాకు 'రంగస్థలం' లాంటి మైల్ స్టోన్ మూవీ ఇచ్చారు. నాకే కాదు వారితో పని చేసిన ప్రతి హీరోకి బ్లాక్ బస్టర్ ఇచ్చే నిర్మాతలు మైత్రీ మూవీ మేకర్స్. బాబీకి బిగ్ కంగ్రాట్స్. చిరంజీవి గారు మా నాన్న గారిలా లేరు.. మా బ్రదర్‌లా ఉన్నారు. నేను ఇక్కడికి ఒక అభిమానిగా వచ్చాను. ఈ సినిమా చూసి ఎంత ఎంజాయ్ చేశానో మీతో పంచుకోవడానికి ఇక్కడికి వచ్చాను.
>
> - రామ్‌చరణ్

చిరంజీవి మాట్లాడుతూ,'ఈ సినిమా బ్లాక్ బస్టర్ అవుతుందని అనుకున్నాం. కానీ నాన్ బాహుబలి, నాన్ ఆర్ఆర్ఆర్ స్థాయి సినిమా అవుతుందని మేము ఊహించలేదు. ఇంత గొప్ప విజయానికి అగ్ర తాంబూలం ఇవ్వాల్సింది ప్రేక్షకులకే. ఈ సినిమా 250 కోట్ల గ్రాస్‌కి చేరబోతుందంటే అది ఆషామాషీ విషయం కాదు. ప్రేక్షకులు నన్ను ఎలా చూడాలని అనుకున్నారో అలా మళ్ళీ తెరపై చూస్తూ ఒక ఘరానా మొగుడు, గ్యాంగ్ లీడర్ ఇలాంటి సినిమాలని గుర్తు చేసుకోవడం నాకు చాలా ఆనందాన్ని ఇచ్చింది. ఇలాంటి ఫీలింగ్ మీకు, నాకు కలిగించడానికి ప్రధాన కారణం దర్శకుడు బాబీ. రవితేజని చూస్తే నాకు మరో పవన్ కళ్యాణ్‌గా అనిపిస్తాడు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాతలకు నిజమైన నిర్వచనంగా నిలబడ్డారు' అని తెలిపారు. 'ఈ సినిమా పెద్ద బ్లాక్‌బస్టర్ అవుతుందని చిరంజీవి అన్నయ్య జడ్జ్ మెంట్‌తో ముందే నమ్మకం వచ్చింది. మా చిరంజీవిని మాకు ఇచ్చావు అనే మాట అన్నయ్య అభిమానుల నుండి వింటూనే వున్నాను. వీరయ్య ఎంతో గౌరవాన్ని తెచ్చిపెట్టింది' అని దర్శకుడు బాబీ కొల్లి చెప్పారు.

నిర్మాత నవీన్ యెర్నేని మాట్లాడుతూ,'ఈసినిమా ఎంత పెద్ద బ్లాక్ బస్టర్ అంటే .. ఈ రోజుల్లో సినిమా డిస్ట్రిబ్యుటర్స్‌కి బ్రేక్ ఈవెన్ అయితే హిట్ అంటున్నారు. 20 శాతం కమీషన్ వస్తే బ్లాక్ బస్టర్ అంటున్నారు. 20 శాతంకంటే ఓవర్ ఫ్లో వస్తే దీనిని ఏమనాలి ?! ఆల్ టైం ఇండస్ట్రీ హిట్ అనాలి. ఈనెల 13 నుండి వాల్తేరు వీరయ్య సర్‌ప్రైజ్ రిజల్ట్ ఇస్తూనే ఉంది. మా అంచనాలకు మించి కలెక్ట్ చేస్తోంది. నా కెరీర్ ఇలాంటి రిజల్ట్ ఎప్పుడూ చూడలేదు' అని అన్నారు.

నవచిత్రం

తెలుగులోనూ విజయం ఖాయం



శివరాజ్ కుమార్, వి.ఆర్.కృష్ణ మండపాటి


కన్నడ చలనచిత్ర పరిశ్రమలో శివ రాజ్‌కుమార్ ఒక ఐకానిక్ హీరో. ప్రస్తుతం ఆయన నటించిన చిత్రం 'వేద'. ఇది తన 125 చిత్రాల మైలురాయిగానే కాకుండా, తన భార్య గీతా శివ రాజ్‌కుమార్ నేతృత్వంలోని సొంత సంస్థ గీతా పిక్చర్స్ బ్యానర్‌లో ఇది మొదటి వెంచర్‌గా కూడా రావడం విశేషం.

ఇటీవలే కన్నడలో విడుదలై సంచలనం సృష్టించిన ఈ సినిమా త్వరలో తెలుగు రిలీజ్‌కు సిద్ధమవుతోంది. కంచి కామాక్షి కలకత్తా క్రియేషన్స్ ద్వారా ఈ సినిమా తెలుగులో రిలీజ్ కానుంది. దీనికి సంబంధించిన టైటిల్, మోషన్ పోస్టర్‌ను చిత్ర బృందం ఆవిష్కరించింది.

ఈ సందర్భంగా నిర్మాత వి.ఆర్.కృష్ణ మండపాటి మాట్లాడుతూ,'కథ నచ్చి ఈ సినిమా కొనుక్కున్నాను. ఒక మంచి సినిమాకి ఎప్పుడూ తెలుగు ప్రేక్షకులు బ్రహ్మరథం పడతారనే నమ్మకంతో దీన్ని తెలుగులో రిలీజ్ చేస్తున్నాను. త్వరలో ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్‌ని గ్రాండ్‌గా నిర్వహించనున్నాం. శివ రాజ్ కుమార్ ఫ్యామిలీకి మన తెలుగులో కూడా ఎంత ఆదరణ ఉందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. మనం కూడా ఆయన్ని శివన్న అని పిలుచుకుంటాం. ఈ ప్రీ రిలీజ్ ఫంక్షన్‌కి వాళ్ళు కూడా హాజరవుతారు' అని తెలిపారు.

ఎ.హర్ష దర్శకత్వం వహించిన ఈ యాక్షన్ డ్రామా చిత్రం కన్నడలో డిసెంబర్ 23న విడుదలై సంచలనం సృష్టించింది. ఘనవి లక్ష్మణ్, అదితి సాగర్, శ్వేత చంగప్ప, ఉమాశ్రీ తదితరులు ఈ చిత్రంలో నటించారు. ఈ చిత్రానికి నిర్మాత : గీతా శివరాజ్‌కుమార్, సినిమాటోగ్రఫీ : స్వామి జె గౌడ్, ఎడిటర్: దీపు ఎస్ కుమార్, సంగీతం: అర్జున్‌జన్య.

వెయ్..దరువెయ్‌కి విశేష ఆదరణ



సాయిరామ్ శంకర్

సాయి రామ్‌శంకర్ హీరోగా నటిస్తున్న చిత్రం 'వెయ్ దరువెయ్'. చిత్ర టైటిల్ సాంగ్ 'వెయ్ దరువెయ్'ను హీరో నాగ చైతన్య రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'ఈ పాట చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంది. సినిమా చూడాలి అని కుతుహలాన్ని కలిగించింది. సినిమా ఖచ్చితంగా సక్సెస్ అవ్వాలి' అని తెలిపారు.

'మా సినిమా నుంచి విడుదలైన రెండవ సాంగ్ ఇది. మొదటి సాంగ్ 'మంజుల మంజుల..' 5 మిల్లియన్ వ్యూస్‌కి రీచ్ అయింది. చాలా మంచి విశేష స్పందన వచ్చింది రెండవ సాంగ్ టైటిల్ సాంగ్. మా మూవీ నుంచి వస్తున్న బెస్ట్ డాన్స్ నెంబర్ సాంగ్. మీకు తప్పకుండా నచ్చుతుంది' అని హీరో సాయి రామ్ శంకర్ చెప్పారు.

దర్శకుడు నవీన్ రెడ్డి మాట్లాడుతూ, 'ఈ సినిమా కథ చెప్పగానే, సింగిల్ సిట్టింగ్‌లో మా హీరో సాయి అంగీకరించారు. ఆయన నా మీద ఉంచిన నమ్మకాన్ని జయించాననే అనుకుంటున్నాను. అలాగే కథ మీద నమ్మకంతో మా నిర్మాత దేవరాజ్ ఎక్కడా కాంప్రమైజ్ కాలేదు. లేటెస్ట్‌గా విడుదలైన టైటిల్ సాంగ్ 'వెయ్ దరువెయ్'కి కూడా విశేష ఆదరణ లభించడం ఆనందంగా ఉంది. అలాగే సినిమా సైతం ఇదే రీతిలో ప్రేక్షకలోకాన్ని అలరిస్తుందనే గట్టి నమ్మకంతో ఉన్నాం' అని అన్నారు.

నిర్మాత దేవరాజ్ మాట్లాడుతూ, 'నవీన్ చెప్పిన కథ నాకెంతో బాగా నచ్చింది. ఎంత ఖర్చు అయిన సరే నేను పెడతాను అని కథ మీద నమ్మకంతో ముందుకు వచ్చాను. మేము అనుకున్నట్టే సినిమా చాలా బాగా వచ్చింది. హీరో సాయి కెరీర్‌లో మరొక మంచి సినిమా అవుతుంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తయ్యాయి. ఫిబ్రవరి 24న ఈ చిత్రాన్ని థియేటర్లలో ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా రిలీజ్‌కి సన్నాహాలు చేస్తున్నాం' అని తెలిపారు. సాయి రామ్ శంకర్, యాశ శివ కుమార్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రంలో సునీల్, కాశీ విశ్వనాథ్, పోసాని కృష్ణ మురళి, పృథ్వీ తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి మ్యూజిక్ డైరెక్టర్ : భీమ్స్, కెమెరా మెన్ : ముత్యాల సతీష్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ :జనగాని కార్తీక్, శ్రీపాల్ చొల్లేటి.

31న నయా సినిమా షురూ..




నాని

యువ కథానాయకుడు నాని నటించబోయే తన 30వ చిత్రాన్ని వైర ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై చేయబోతున్నారు. ఈ బ్యానర్‌పై ప్రొడక్షన్ నెం1గా రూపొందనుందని న్యూ ఇయర్ సందర్భంగా మేకర్స్ అధికారికంగా ప్రకటించిన సంగతి తెలిసిందే.

నూతన దర్శకుడు శౌర్యువ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని మోహన్ చెరుకూరి (సివిఎం), డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల, మూర్తి కెఎస్ నిర్మిస్తునారు. తండ్రీకూతుళ్ల మధ్య అందమైన బంధాన్ని చూపించే హార్ట్ టచింగ్ వీడియో ద్వారా సినిమాలో నాని వరల్డ్‌ని కూడా మేకర్స్ రివీల్ చేశారు. గ్లింప్స్‌కి అద్భుతమైన స్పందన వచ్చింది. ఇంకా టైటిల్ ఖరారు చేయని ఈ చిత్ర ప్రారంభ పూజా కార్యక్రమం ఈనెల 31న హైదరాబాద్‌లో జరగనుంది. ఫిబ్రవరి 1 నుంచి సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. ఇందులో మృణాల్ ఠాకూర్ నానికి జోడిగా నటించనున్నారు.

మనసే.. మనసే



కిరణ్ అబ్బవరం

అల్లు అరవింద్ సమర్పణలో ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ జీఏ2 పిక్చర్స్ బ్యానర్ పై తెరకెక్కుతున్న సినిమా 'వినరో భాగ్యము విష్ణు కథ'. బన్నీ వాసు నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. 'భలే భలే మగాడివోయ్, గీత గోవిందం, టాక్సీవాలా, ప్రతిరోజూ పండగే, మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్, 18 పేజెస్' లాంటి అద్భుతమైన చిత్రాల తర్వాత జీఏ 2 పిక్చర్స్ బ్యానర్లో వస్తున్న సినిమా కావడంతో ఈ సినిమాపై అందరిలోనూ భారీ అంచనాలు పెరిగాయి.

తిరుమల తిరుపతి నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ సినిమాతో మురళి కిషోర్ అబ్బూరు దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. కిరణ్ అబ్బవరం హీరోగా నటిస్తున్న ఈ సినిమాలో ఆయన సరసన కశ్మీర పర్దేశీ నటిస్తోంది. ఇదివరకే ఈ చిత్రం నుండి రిలీజైన 'వాసవసుహాస', 'బంగారం' పాటలకు, చిత్ర టీజర్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. తాజాగా ఈ చిత్రం నుంచి 'దర్శన' సాంగ్ లిరికల్ వీడియోను చిత్రబృందం రిలీజ్ చేసింది. భాస్కర భట్ల రవికుమార్ రచించిన ఈ పాటను అనురాగ్ కులకర్ణి ఆలపించారు. 'మనసే మనసే తననే కలిసే, అపుడే అపుడే తొలిప్రేమలోన పడిపోయా కదా, తనతో నడిచే అడుగే మురిసే' అని స్టార్ట్ అయ్యే ఈ బ్రేకప్ సాంగ్‌లోని 'తట్టుకోవడం కాదే పిల్ల నావల్లా వయ్యారి, గుక్కపట్టి ఏడుస్తుందే నా ప్రాణం నీవల్లా' లాంటి లిరిక్స్ యూత్‌కి బాగా కనెక్ట్ అవుతాయి. ఇదివరకే కిరణ్ 'ఎస్.ఆర్ కల్యాణమండపం' సినిమాకి మంచి సాంగ్స్ రాసిన భాస్కర భట్ల ఈ సినిమాలో కూడా అదే స్థాయిలో పాటలను రాశారు. మార్తాండ్ కె వెంకటేష్ ఎడిటింగ్ చేస్తున్న ఈ సినిమాకు విశ్వాస్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. చైతన్ భరద్వాజ్ సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రానికి సహ నిర్మాతగా బాబు వ్యవహరిస్తున్నారు. సత్యగమిడి, శరత్ చంద్ర నాయుడు ఎక్స్‌క్యూటివ్ నిర్మాతలు. ఈ సినిమా ఫిబ్రవరి 17న విడుదల కానుంది.

సరికొత్త సస్పెన్స్ థ్రిల్లర్



అరవింద్ కృష్ణ

అరవింద్ కృష్ణ, రజత్ రాఘవ్ హీరోలుగా, నటాషాదోషి ప్రధాన పాత్ర పోషించిన కొత్త చిత్రం 'ఎస్.ఐ.టి'. (స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్).

ఎస్ఎస్ఆర్ ఎంటర్టైన్మెంట్స్, వైజాగ్ ఫిలిం ఫ్యాక్టరీ బ్యానర్ పై వి.బి.ఆర్. దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం సరికొత్త సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందుతోంది.

స్క్రీన్‌ప్లే హైలెట్‌గా నిర్మితమవుతున్న ఈ చిత్రంలో ఇంకా కౌశిక్ మేకల, అనిల్ రాథోడ్, రుచిత సాదినేని ముఖ్యపాత్రలు పోషించారు.

ఇప్పటికే విడుదలైన ఈ సినిమా టైటిల్ పోస్టర్ సినిమా పై క్యూరియాసిటీని పెంచింది. షూటింగ్ పూర్తి చేసుకుని శరవేగంగా పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటున్న ఈ చిత్రం నుండి మరిన్ని వివరాలను మేకర్స్ త్వరలో తెలియజేయనున్నారు.

ఈ చిత్రానికి సంగీతం: వరికుప్పల యాదగిరి, ఎడిటర్: కిరణ్ తుంపెర, సినిమాటోగ్రఫీ :జగదీష్ బొమ్మిశెట్టి, ఫైట్స్ : రాబిన్ సుబ్బు, రీ -రికార్డింగ్ : విజయ్ కూరాకుల, కొరియోగ్రఫీ : జీణ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ : ఏ అరవింద్ రెడ్డి, కో ప్రొడ్యూసర్స్ : కె.చంద్రబాలిరెడ్డి, రమేష్ గుండా, నరేంద్ర వాసిరెడ్డి, ప్రొడ్యూసర్స్ : ఎస్. నాగిరెడ్డి, తేజ్ పల్లి, గుంటక శ్రీనివాస్ రెడ్డి, రచన - దర్శకత్వం వి.బి.ఆర్.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886